

సాక్షి 24|7
సూర్యాపేట
సోమవారం 28-8-2017

రూ.125కే విద్యుత్ కనెక్షన్లు డివిజన్ల వారీగా..




కొత్త సబ్‌స్టేషన్లు, విద్యుత్ లైన్లు ఇతర పనులకు కలిపి మంజూరైన నిధులు(రూ.కోట్లలో)



ఎట్టకేలకు...

దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ జ్యోతి యోజన ప్రారంభం

- ఉమ్మడి జిల్లాకు రూ.103.49 కోట్ల నిధులు మంజూరు
- మున్సిపాలిటీల్లో ఐపీడీఎస్ కింద రూ.61 కోట్లు..
- సంసద్ ఆదర్శ గ్రామాలకు రూ.4.81 కోట్లు
- నియోజకవర్గానికి ఒకటి చొప్పున కొత్తగా 33/11 కేవీ సబ్‌స్టేషన్లు
- 59,868 గృహాలకు రూ.125కే విద్యుత్ కనెక్షన్
- కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్ల ఏర్పాటు
- పనులు పూర్తయ్యేందుకు గడువు ఏడాది మాత్రమే



- వివరాలు
8,9లో

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ జ్యోతి యోజన (డీడీయూజీజేవై) అమలుకు అడుగు పడింది. రెండేళ్ల పాటు కసరత్తు చేసిన విద్యుత్‌శాఖ ఎట్టకేలకు ఈ ఏడాది పనులు ప్రారంభించేందుకు సిద్ధమైంది. కేంద్రం నుంచి పెద్ద ఎత్తున నిధులు రాబట్టాలన్న ఉద్దేశంతో విద్యుత్‌శాఖ భారీ అంచనా వ్యయంతో ప్రతిపాదనలు రూపొందించింది. - నల్లగొండ

ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ప్రాధాన్యం

- ప్రజలు ఎప్పుడైనా కలిసి సమస్యలు చెప్పొచ్చు
- రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు చర్యలు
- గంజాయి, గుట్కా అమ్మకాలపై నిఘా.. కేసుల నమోదు
- పట్టణాల్లోని కీలకమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు
- ఎస్పీ పరిమళహననూతన్



సాక్షి, సూర్యాపేట : పీపుల్స్ ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను కేవలం నినాదంగా చూడకుండా ఆచరణాత్మకంగా అమలు చేయనున్నట్లు ఎస్పీ పరిమళ హననూతన్ తెలిపారు. పోలీసులంటే ప్రజలు భయపడాల్సిన అవసరం లేదన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజా సంక్షేమం కోసమే పోలీసులు నిరంతరం పనిచేస్తున్న విషయాన్ని ప్రజల గుర్తించాలన్నారు. జిల్లాలో శాంతిభద్రతల పరిస్థితి, మహిళలపై దాడులు తదితర అంశాలపై ఎస్పీ 'సాక్షి' ప్రతినిధితో ప్రత్యేకంగా మాట్లాడారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరణ కోసం తీసుకుంటున్న చర్యలు - మిగతా 2లో ▶

మృత్యువులోనూ వీడని స్నేహబంధం

- 3లో

- రైలు కింద పడి ఇద్దరు యువకుల ఆత్మహత్య
- మిర్యాలగూడ రైల్వేస్టేషన్ సమీపంలో ఘటన
- త్రిపురారం మండలం బాబుసాయి గూడెంలో విషాదఛాయలు

క్రికెట్, ప్రొ కబడ్డీ బెట్టింగ్స్ ఉచ్చులో చిక్కుకున్నారో.. ఆర్థిక ఇబ్బందులో.. మరో కారణమో తెలియదు కానీ.. ఇద్దరు యువకులు తమకు తామే మరణశాసనం లిఖించుకున్నారు.. త్రిపురారం మండలం బాబుసాయిగూడానికి చెందిన బచ్చు చరణ్(19), బురుగు నాగరాజు(20) మిర్యాలగూడ రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. మరణం కూడా తమను విడదీయలేదని నిరూపించారు.. ఆ ఇద్దరు స్నేహితులు.

జానపద కళలకు జీవం పోస్తున్న ప్రభుత్వం



జానపద జాతర ర్యాలీని ప్రారంభిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, నృత్యం చేస్తున్న కళాకారిణి

తెలంగాణలో జానపద కళలకు ప్రభుత్వం జీవం పోస్తోందని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. భాషా సాంస్కృతిక శాఖ, జిల్లా జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో పేటలో ఆదివారం రాత్రి నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. అనంతరం కళా ప్రదర్శనలను రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ మందుల సామేల్ జ్యోతిప్రజ్వలన చేసి ఆరంభించారు.

- భానుపురి(సూర్యాపేట) - 16లో

అమరవీరుల త్యాగాలను గుర్తించాలి

సంకినేని వెంకటేశ్వర్‌రావు



యాదగిరి బంధువులతో మాట్లాడుతున్న సంకినేని

నూతనకల్(తుంగతుర్తి) : నైజాం నవాబు ఆగడాలకు వ్యతిరేకంగా పోరాడి అమరులైన వీరుల త్యాగాలను ప్రభుత్వం గుర్తించి సెప్టెంబర్ 17ను విమోచన దినంగా నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో నైజాం, భూస్వాములకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతం చేసేందుకు బండెనక బండి కట్టి ఏ బండ్లో పోతవు కొడుకో నైజాం సర్కారోడా అనే పాటను రచించిన బండి యాదగిరి(నాగెల్లి) బంధుమిత్రులను ఆదివారం మండల పరిధిలోని వెంకెపల్లిలో కలిసి మాట్లాడారు. నిరక్షరాస్యుడైన యాదగిరి పాటను రచించి స్వయాన పాటపాడి ప్రజలను చైతన్యవంతులను చేశారని, అలాంటి నాయకుడ్ని పాలకులు విస్మరించారని తెలిపారు. యాదగిరి స్మారకార్థం తిరుమలగిరి మండల కేంద్రంలో వచ్చే నెల మొదటి వారంలో స్థూప నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. నైజాం, నవాబుకు వ్యతిరేకంగా నిర్వహించిన సాయుధ పోరాటంలో పాల్గొని సహాయ సహకారాలు అందించిన వారిని గుర్తించి తిరుమలగిరిలో జరిగే బహిరంగ సభలో వారిని సన్మానించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు కొణతం సత్యనారాయణరెడ్డి, జీడి భిక్షం, కాప రవికుమార్, మద్ది సంజీవరెడ్డి, నూడి మధుసూదన్‌రెడ్డి, బీమిడి రాంరెడ్డి, గుగులోతు శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మట్టపల్లి ఘాట్‌ను పరిశీలించిన ఎస్పీ

మఠంపల్లి : మట్టపల్లిలోని కృష్ణానది వద్ద గణేష్ నిమజ్జనానికి కేటాయించిన ఘాట్‌ను ఆదివారం రాత్రి జిల్లా ఎస్పీ పరిమళహన నూతన్ పరిశీలించారు. స్నానపు ఘాట్‌లు, అక్కడ నిర్వహిస్తున్న బల్లకట్టును పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విగ్రహాల నిమజ్జనానికి నది వద్ద భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసులకు సహకరించాలని కోరారు. అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా నిమజ్జనం చేసుకోవాలని సూచించారు. ఆమె వెంట కోదాడ డీఎస్పీ రమణారెడ్డి, స్థానిక ఎస్‌ఐ జానయ్య తదితరులున్నారు.

గ్రామీణ వైద్యులను గుర్తించడం హర్షణీయం



సమావేశంలో అభివాదం చేస్తున్న సంఘం నేతలు

కోదాడ : పల్లెల్లో పేదలకు వైద్యసేవలందిస్తున్న గ్రామీణ వైద్యులను తెలంగాణ ప్రభుత్వం గుర్తించడం హర్షణీయమని తెలంగాణ గ్రామీణ వైద్యుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిట్టల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం కోదాడలోని ఈవీ రెడ్డి డిగ్రీ కళాశాలలో జరిగిన ఆ సంఘం కోదాడ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలోనే గ్రామీణ వైద్యులకు శిక్షణ ఇవ్వడంతో పాటు సర్టిఫికెట్లను ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష్య, కార్యదర్శులుగా వీవీఎన్.చారి, దాచేపల్లి వీరయ్యలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనంతారపు బ్రహ్మం, ఏవీ.చారి, ఎస్‌కే.మన్సూర్ అలీ, కోలిచలం వీరయ్య, నర్సింహారావు, దావుద్, సాహెబ్‌అలీ, నివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



ఉద్యోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

సూర్యాపేటటౌన్ : పట్టణంలోని జెడ్పీ హైస్కూల్‌లో టీపీటీఎఫ్, పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో మ్యాక్స్‌క్యూర్ హాస్పిటల్ వైద్యుల సహకారంతో ప్రభుత్వ, రిటైర్డ్ ఉద్యోగులకు ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 200 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ మేనేజర్లు స్వామి, వైద్యులు నితిన్, సునీల్, రాహుల్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్, ఉపాధ్యక్షుడు జ్ఞానసుందర్, రమేష్, యాకయ్య, ముత్తయ్య, రమేష్, లింగయ్య, ఆర్.మధుసూదన్, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ప్రాధాన్యం

▶ మొదటి పేజీ తరువాయి

ఆమె మాటల్లోనే జిల్లాలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపులో ఉన్నాయి. జిల్లాలో ఎక్కడా ఎలాంటి సమస్యలు లేవు. పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహిస్తున్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలని ఎవరైనా ప్రయత్నిస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయి. నేరాలు అదుపు చేసేందుకు అవసరమైన భద్రతా చర్యలు తీసుకుంటూనే నిఘా పెంచుతున్నాం. ఇందుకోసం అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నాం. పట్టణాల్లోని సున్నితమైన, కీలకమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం.

అవినీతికి పాల్పడితే సహించేది లేదు

జిల్లా పోలీసులు ప్రజల పట్ల దురుసుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవంలేదు. పోలీసులు.. పోలీస్టేషన్లకు వచ్చే వారితో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తారు. జిల్లాలో పీపుల్ ఫ్రెండ్లీ పోలీసింగ్ ఆచరణాత్మకంగా అమలు చేస్తున్నాం. పోలీసు శాఖలో అవినీతికి పాల్పడితే సహించేది లేదు. పోలీసు సిబ్బంది అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవు.

ప్రజలు నేరుగా వచ్చి నన్ను కొలవవొచ్చు

ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులు చెప్పుకునేందుకు ప్రతి సోమవారం ప్రజా విజ్ఞప్తులు స్వీకరిస్తున్నాం. ప్రజలు ఎప్పుడైనా నేరుగా నన్ను కలిసి సమస్యలు చెప్పుకోవచ్చు. ప్రజల ఫిర్యాదులు, విజ్ఞప్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యమిస్తున్నాం.

తాగి వాహనం నడిపితే చర్యలు తప్పవు

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ముఖ్యంగా 65వ నంబరు జాతీయ రహదారిపై ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వాహనాలు వేగంగా నడపడం, ట్రాఫిక్ నిబంధనలను పాటించకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాలు జరిగే చోట హెచ్చరిక బోర్డులను పెట్టడంతోపాటు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించేలా చూస్తున్నాం. తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవు.

గుట్కా, గంజాయి వ్యాపారాన్ని అరికడతాం

గుట్కా, గంజాయి అమ్మడం చట్ట విరుద్ధం. గుట్కా, గంజాయి రవాణా, అమ్మకాలు చేసే వారి విషయంలో కఠినంగా వ్యవహరిస్తాం. ఎక్సైజ్, పోలీసు శాఖలు సంయుక్తంగా దాడులు నిర్వహించి గంజాయి రవాణా, విక్రయాలకు అడ్డుకట్టవేస్తాం.

మహిళ భద్రతే ధ్యేయం

ఈవ్‌టీజింగ్, మహిళలపై వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయి. మహిళలపై దాడులు, వేధింపులకు అడ్డుకట్ట వేసేందుకు షీటీమ్స్‌తోపాటు 'స్నేహిత' బృందాలు పనిచేస్తున్నాయి. మహిళల భద్రత విషయంలో కఠినంగా వ్యవహరిస్తాం.

వినాయ వేడుకలకు పటిష్ట బందోబస్తు

గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశాం. 1100 మంది పోలీసు సిబ్బంది బందోబస్తులో పాల్గొంటున్నారు. నవరాత్రి వేడుకలు సజావుగా సాగేలా ఉత్సవకమిటీలు పోలీసులతో సహకరించాలి. నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా జరిగేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం.

గ్రామీణ వైద్యులకు అండగా ఉండాలి



మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకన్న

తాళ్లగడ్డ(సూర్యాపేట) : గ్రామీణ వైద్యులకు ప్రభుత్వం అండగా ఉండాలని తెలంగాణ ఆర్‌ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకన్న అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని బ్రహ్మాండ్లపల్లి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సూర్యాపేట జిల్లా గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం సమావేశానికి హాజరై మాట్లాడారు. ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యులకు ప్రభుత్వం శిక్షణ తరగతులు నిర్వహించి గుర్తింపు కార్డులు జారీ చేసేందుకు సీఎం కేసీఆర్ ఇప్పటికే జీఓను జారీ చేశారని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని సెంటర్లలోనూ శిక్షణ తరగతులు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టిన అమ్మ ఒడి కార్యక్రమంపై ప్రతి గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షుడు ఎస్‌కె.రహమతుల్లా, జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సయ్య, ప్రధాన కార్యదర్శి రాజేందర్, కోశాధికారి చంద్రయ్యగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ డాంగేగౌడ్, అధికార ప్రతినిధి వెంకటేశ్వర్లు, పి.వెంకన్న, రాజబాబురెడ్డి, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి





మృతి చెందిన గట్టయ్య, ఫణిగిరిలో చెట్టును ఢీకొన్న కారు

నాగారం (తుంగతుర్తి) : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందగా, నలుగురికి తీవ్ర గాయాలైన సంఘటన ఫణిగిరి శివారులో ఆదివారం చోటు చేసుకుంది. మండల పరిధిలోని ఫణిగిరి గ్రామ శివారులో జనగాం నుంచి ఫణిగిరికి వస్తున్న కారు అదుపుతప్పి రోడ్డువెంట మర్రిచెట్టును ఢీకొట్టింది. ప్రమాదంలో కారులో ఉన్న జనగాం జిల్లా గుండాల మండలం చిన్నపడిశాల గ్రామానికి చెందిన చింతల గట్టయ్య(45) అక్కడికక్కడే మృతిచెందాడు. శాఖపురం గణేష్, శాఖపురం సమ్మయ్య, చింతల అశోక్, చింతల శ్రీహరి తీవ్రంగా గాయపడారు. వీరు సూర్యాపేట జిల్లా నాగారం మండలంలోని ఫణిగిరి గ్రామానికి పెళ్లి చూపుల నిమిత్తం కారులో బయలుదేరి వస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తిరుమలగిరిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

640 అడుగులకు చేరిన మూసీ నీటిమట్టం



వరదనీటితో కళకళలాడుతున్న మూసీ ప్రాజెక్టు

కేతేపల్లి(నకిరేకల్) : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నాగార్జునసాగర్ తర్వాత అతిపెద్ద సాగునీటి ప్రాజెక్టుగా ఉన్న మూసీ రిజర్వాయర్‌లో నీటిమట్టం 640 అడుగులకు చేరుకుంది. ఎగువ మూసీ ప్రాంతాలు, హైదరాబాద్ నగరంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు దిగువన గల మూసీ ప్రాజెక్టులోకి స్వల్పంగా ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. హైదరాబాద్ నుంచి వచ్చే వరద నీటి ఉధృతి ఆదివారం ఉదయం మూసీ రిజర్వాయర్‌కు చేరింది. శనివారం సాయంత్రం కేవలం 540 క్యూసెక్‌లుగా ఉన్న ఇన్‌ఫ్లో ఆదివారం మధ్యాహ్నానికి 3500 క్యూసెక్‌లకు పెరిగింది. దీంతో మూసీ రిజర్వాయర్‌లో నీటిమట్టం ఆదివారం సాయంత్రానికి 640 అడుగులకు అడుగులకు చేరుకుంది. మూసీ రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 645 అడుగులుగా ఉంది. సూర్యాపేట పట్టణంతో పాటు పరిసర గ్రామాల చెరువులు నింపేందుకు ప్రాజెక్టు ఎడమ కాల్వకు 250 క్యూసెక్‌ల నీటిని విడుదల చేస్తున్నారు.

మృత్యువులోనూ వీడని స్నేహం

వారిద్దరూ మంచి స్నేహితులు. ఒకరు త్రిపురారం మండల కేంద్రంలో సెల్‌ఫోన్ షాపు నిర్వహిస్తుండగా.. మరొకరు మిర్యాలగూడ పట్టణంలో బైక్ మెకానిక్ పని చేస్తున్నారు. ఇద్దరిదీ ఒకే గ్రామం కావడంతో వారి మధ్య విడదీయరాని స్నేహం ఏర్పడింది. అందరితోనూ కలివిడిగా ఉండే వీరు శనివారం రాత్రి మిర్యాలగూడ రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. దీంతో ఇరువురి కుటుంబాలు విషాదంలో మునిగిపోయాయి.


రోదిస్తున్న నాగరాజు తల్లి


చరణ్ ఇంటి వద్ద గుమిగూడిన బంధువులు

- రైలు కిందపడి ఇద్దరు యువకుల ఆత్మహత్య
- మిన్నంటిన కుటుంబసభ్యుల రోదనలు
- బాబుసాయిపేటలో విషాదఛాయలు

త్రిపురారం (నాగార్జునసాగర్) :

త్రిపురారం మండలంలోని బాబుసాయిపేట గ్రామానికి చెందిన బచ్చు చరణ్(19), బూరుగు నాగరాజు(20) మంచి స్నేహితులు. బచ్చు చరణ్ మిర్యాలగూడ పట్టణంలో బైక్ మెకానిక్‌గా పనిచేస్తుండగా.. బూరుగు నాగరాజు త్రిపురారం మండల కేంద్రంలో నాగసాయి మెబైల్ షాపును ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందుతున్నాడు. వీరి ఆకాల మరణంతోబాబుసాయిపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇద్దరు ఒకేసారి మృతి చెందడంతో తోటి స్నేహితులు కన్నీరుమున్నీరుగా విలపించారు. వీరి మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం గ్రామంలోనే అంత్యక్రియలు నిర్వహించారు. వీరి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

తల్లి రెక్కల కష్టంతోనే కుటుంబ పోషణ..

బాబుసాయిపేట గ్రామానికి చెందిన బచ్చు భద్రయ్య, రేణుక దంపతులది నిరుపేద కుటుంబం. వీరికి ఇద్దరు కుమారులు. వీరి చిన్న కుమారుడు చరణ్. ఎనిమిదేళ్ల క్రితం చరణ్ తండ్రి భద్రయ్య గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. నాటి నుంచి తల్లి రేణుక కూలినాలి పనులు చేస్తూ.. పిల్లలిద్దరినీ పోషిస్తోంది. ఈ క్రమంలో తనకు చేదోడు వాదోడుగా ఉంటున్న కుమారుడు ఆత్మహత్యకు పాల్పడడంతో ఆమె గుండెలవిసేలా రోదించింది.

పెద్దదిక్కును కోల్పోయిన కుటుంబం..

గ్రామానికి చెందిన బూరుగు అంజయ్య,అరుణ దంపతులు 15 ఏళ్ల క్రితం మిర్యాలగూడ మండలంలోని ఆలగడప గ్రామం నుంచి బాబుసాయిపేట వచ్చారు. వీరికి ఇద్దరు మగ సంతానం. అంజయ్య త్రిపురారంలో కారు డ్రైవింగ్ సెంటర్‌ను నిర్వహిస్తుండగా.. తల్లి అరుణ కిరాణం షాపు నడుపుతూ పిల్లలను పోషించుకుంటున్నారు. డిగ్రీ వరకు చదువుకున్న పెద్దకుమారుడు బూరుగు నాగరాజు త్రిపురారంలో ఓ మొబైల్ షాపు ఏర్పాటు చేశాడు. కుటుంబానికి ఆసరా అవుతాడనుకున్న కుమారుడు రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడడంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పలువురి పరామర్శ

గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడడంతో.. విషయం తెలుసుకున్న పలువురు ప్రముఖులు వారి కుటుంబాలను పరామర్శించారు. వైస్ ఎంపీపీ గోపగాని మాధవి, సర్పంచ్ కలగాని అరుణ, బాబుసాయిపేట సొసైటీ చైర్మన్ నాగరాజు, నాయకులు గోపగాని శ్రీనివాస్, కలగాని శ్రవణ్, బచ్చు సాంబయ్య తోపాటు పలువురు వారి కుటుంబ సభ్యులను ఓదార్చి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

బాలుడికి డెంగీ


నిమ్స్‌లో చికిత్స పొందుతున్న రంజిత్

మునుగోడు : మండలంలోని చీకటిమామిడి గ్రామ పంచాయతీ పరిధిలోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందినా ఓ బాలుడు డెంగీ బారిన పడ్డాడు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పోలగాని ప్రకాష్ పెద్ద కుమారుడు రంజిత్(16)కి వారం క్రితం జ్వరం రాగా నల్లగొండలోని ఓ ప్రవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరబాద్ నిమ్స్‌కు తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు డెంగీ జ్వరంగా నిర్ధారించారు. ప్రస్తుతం అతనికి చికిత్స నిర్వహిస్తున్నారు. పూర్తిగా కొలుకునేందుకు సమయం పడుతుందని వైద్యులు చెప్పినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

ఆలేరు : వరంగల్ నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లో నుంచి శనివారం రాత్రి 10 గంటలకు ప్రమాదవశాత్తు జారిపడిన పట్టణంలోని సంతోష్‌నగర్‌కు చెందిన సంతోష్ (25) ఆదివారం మృతిచెందాడు. రైళ్లో నుంచి జారి పడిన సంతోష్‌ను చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందాడు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

మునగాల (కోదాడ) : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని మొద్దులచెరువు స్టేజీ వద్ద జాతీయ రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ముకుందాపురం గ్రామానికి చెందిన ట్రాక్టర్ కోదాడ వైపు నుంచి సూర్యాపేట వెళ్తోంది. మార్గమధ్యలో మొద్దుల చెరువు స్టేజీ వద్ద డివైడర్ దాటుతుండగా హైదరాబాద్ నుంచి తూర్పుగోదావరి జిల్లా అమలాపురం వెళ్లే కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అమలాపురం పట్టణానికి చెందిన దంపతులు డి.సుబ్రమణ్యం, కృష్ణవేణికి తీవ్రగాయాలయ్యాయి. కారు నడుపుతున్న వారి కుమారుడు రాముకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించి, మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఈ మేరకు స్థానిక ఎస్ఐ గడ్డం నగేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

ఆత్మకూరు–ఎం (ఆలేరు) : ప్రేమ వివాహం చేసుకున్న జంట ఆదివారం పోలీసులను ఆశ్రయించింది. మండలంలోని కూరెళ్ల గ్రామానికి చెందిన నిమ్మల జితేంద్ర, బండ మానస నాలుగు సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నారు. ఈ నెల 12 నుంచి మానస అదృశ్యమైనట్లు తల్లిదండ్రులు ఆత్మకూరు(ఎం) పోలీస్‌స్టేషన్‌లో ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో మానస, జితేందర్ విజయవాడలోని కనక దుర్గ ఆలయంలో వివాహం చేసుకున్నారు. తమకు రక్షణ కల్పించాలంటూ ఆదివారం వలిగొండ పోలీసులను ఆశ్రయించారు. ఆత్మకూరు(ఎం) పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు కావడంతో వారికి ఇక్కడికి తీసుకొచ్చారు.

పోలీసులకు జాతీయ పక్షి అప్పగింత

రాజపేట (ఆలేరు) : మండలంలోని బేగంపేట గ్రామంలో ఎగురలేని స్థితిలో ఉన్న జాతీయ పక్షిని గ్రామానికి చెందిన యువకుడు సందీపు మహేష్ ఆదివారం పోలీసులకు అప్పగించాడు. పక్షికి ప్రథమ చికిత్స నిర్వహించి అటవీ శాఖ అధికారులకు అప్పగించనున్నట్లు ఎస్ఐ బీసన్న తెలిపారు.

ఉరేసుకుని యువతి ఆత్మహత్య


విద్య మృతదేహం


మృతిచెందిన శ్రావ్య

వలిగొండ (భువనగిరి) : ఉరేసుకుని యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని పల్లెర్ల స్టేజీ వద్ద ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. స్టేజీ వద్ద నివాసం ఉండే ఇంజమూరి స్వామి కూతురు విద్య (19) మండల కేంద్రంలోని ప్రగతి కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఆదివారం తెల్లవారుజామున ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుంది. కుటుంబ సభ్యులు గమనించే సరికి మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. విద్య తండ్రి స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తిరుమలగిరిలో మరొకరు..

తిరుమలగిరి : మండలం మాలిపురం గ్రామానికి చెందిన దండ శ్రావ్య (21) చున్నితో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆదివారం చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రావ్య ఈ నెల 5వ తేదీన దొంగతనం కేసులో రిమాండ్‌కు వెళ్లి 24న బెయిల్‌పై వచ్చింది. దీంతో మనస్థాపం చెంది ఆదివారం ఉదయం ఇంట్లో ఇరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. శ్రావ్య తండ్రి లక్ష్మారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.మహేష్ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ ప్రవీణ్‌కుమార్

చివ్వెంల (సూర్యాపేట) : మండల పరిదిలోని దురాజ్‌పల్లి ఆవాసం ఖాసీంపేట గ్రామంలో ఆదివారం పేకాట రాయుళ్లను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ బి.ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పలువురు గ్రామంలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నట్టు సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి గ్రామానికి చెందిన సిరపంగి వెంకటేష్, సిరపంగి సురేష్, సిరపంగి నారాయణ, మన్‌రెడ్డి మోహన్‌రెడ్డి, షేక్ లతీఫ్‌ను అరెస్ట్ చేశారు. వారి వద్ద రూ.750, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

మహిళ కడుపులో కణితి తొలగింపు

నల్లగొండ టౌన్ : పట్టణంలోని బొట్టుగూడలో గల శ్రీలక్ష్మి మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిలో ఆదివారం అరుదైన శస్త్రచికిత్స చేసి మహిళ కడుపులోంచి ఐదు కిలోల కణితిని తొలగించారు. నల్లగొండ మండలం దోమలపల్లి గ్రామానికి చెందిన గుండెబోయిన పెద్దమ్మ(60) మూడు సంవత్సరాలుగా కడుపునొప్పితో బాధపడుతూ చికిత్స కోసం శనివారం శ్రీలక్ష్మి ఆస్పత్రిలో చేరింది. ఆమె కడుపులో కణితి ఉన్నట్లు గుర్తించి డాక్టర్ టీఎన్ఆర్, డాక్టర్ రాకేష్ బృందం శస్త్రచికిత్స చేసి కణితిని తొలగించినట్లు ఆస్పత్రిల ఎండీ జానకిరెడ్డి తెలిపారు.

ఆటో, డీసీఎం ఢీ.. మహిళ మృతి

- ఎనిమిది మందికి తీవ్ర గాయాలు
- కూలికి వెళ్లి వస్తుండగా ఘటన

చందంపేట (దేవరకొండ) : కూలి పనులకు వెళ్లి వస్తున్న ఆ కుటుంబాల్లో రోడ్డు ప్రమాదం విషాదం నింపింది. ఆదివారం రాత్రి పోలేపల్లి శివారులోని బర్లదొడ్డి వద్ద ఆటోను డీసీఎం ఢీ కొనడంతో.. ఒకరు మృతిచెందగా.. ఎనిమిది మంది గాయపడ్డారు. వివరాల ప్రకారం.. చందంపేట మండలం ముడుదండ్ల గ్రామపంచాయతీ పోల్యానాయక్‌తండాకు చెందిన సుమారు 20 మంది గిరిజనులు మల్లేపల్లి సమీపంలోని వరినాట్లను వేసేందుకు ఆటోలో వెళ్లి వస్తున్నారు. ఆదివారం పనులు ముగించుకుని తిరిగివస్తుండగా.. మార్గ మధ్యలో పోలేపల్లి శివారు వద్ద వీరి ఆటోను డిండి వైపు నుంచి వస్తున్న మినీ డీసీఎం అతి వేగంతో ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న బుజ్జి(50)అక్కడికక్కడే మృతి చెందింది. ఇస్లావత్ ఇక్కా, ఇస్లావత్ బుజ్జి, చంద్రకళ, హల్చి, బుజ్జా, జ్యోతి, సాలి, కోమటికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమి త్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పలువురి పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించారు.


బుజ్జి మృతదేహం


వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ

సంఘటన స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ

సంఘటన స్థలాన్ని దేవరకొండ డీఎస్పీ రవికుమార్ పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ పరారీలో ఉన్నట్లు సమాచారం. డీఎస్పీ వెంట దేవరకొండ, డిండి, చందంపేట ఎస్ఐలు, చందంపేట ఎంపీపీ సలహాదారుడు గోవిందుయాదవ్, సర్పంచ్ రమావత్ గోప్యానాయక్, ఎంపీటీసీ జయ్‌కుమార్ ఉన్నారు.

మరో ప్రమాదంలో వ్యక్తికి గాయాలు..

పోలేపల్లి గ్రామ శివారులోని మిల్లు వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో డిండి మండలం ఎర్రారం పరిధిలోని జాల్‌తండాకు చెందిన రమావత్ రామ్లీకి తీవ్ర గాయాలయ్యాయి. దేవరకొండ నుంచి తన కుమారుడు ఆర్.సంత్యతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా డిండి నుంచి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది.

వాతావరణం

రానున్న 24 గంటల్లో పశ్చిమ తీరం, తెలంగాణలో అక్కడక్కడ, దక్షిణ చత్తీస్‌గఢ్‌లలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురవచ్చు. తూర్పు రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, ఉత్తర తమిళనాడు, ఒడిశా, మధ్య, ఈశాన్య భారతంలో అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

నల్లగొండ వాతావరణం

గరిష్టం కనిష్టం
30.4°/25.0°

జాతీయం

నగరం	గరిష్ట	కనిష్ట
ఢిల్లీ	35.7	24.8
కోల్‌కతా	32.9	26.7
బెంగళూరు	26.5	21.0
ముంబై	29.8	25.2
చెన్నై	32.9	25.8

పట్టణ వాతావరణం

పట్టణం/జిల్లా	గరిష్ట/ కనిష్ట	పట్టణం/జిల్లా	గరిష్ట/ కనిష్ట
కాకినాడ	33.1/26.7	విజయవాడ	30.9/26.0
అనంతపురం	33.1/24.1	శ్రీకాకుళం	30.8/26.6
చిత్తూరు	33.0/26.2	విజయనగరం	30.8/26.6
తిరుపతి	33.0/26.2	కరీంనగర్	30.8/25.5
విశాఖపట్నం	31.8/27.6	గుంటూరు	30.4/25.0
నెల్లూరు	31.8/26.1	నిజామాబాద్	30.4/23.7
ఆదిలాబాద్	31.8/25.6	వరంగల్	30.3/25.0
నల్లగొండ	31.2/25.0	మహబూబ్‌నగర్	30.3/23.0
ఒంగోలు	31.1/26.6	హైదరాబాద్	30.2/23.0
కడప	31.1/25.0	రంగారెడ్డి	30.2/23.0
ఏలూరు	31.0/26.8	కర్నూలు	30.1/23.1
రాజమండ్రి	31.0/26.8	ఖమ్మం	29.8/21.6
తాడేపల్లిగూడెం	31.0/26.8	మెదక్	29.1/21.2

బుల్లితెర


www.sakshi.com

సాక్షి SAKSHI TV

ఉ. 07.00 గంటల నుండి ప్రతి గంటకు సాక్షి న్యూస్ బులెటిన్

ఉ.06.45 నిరీక్షణ
ఉ.07.00 నంద్యాల జడ్జిమెంట్
ఉ.07.30 నంద్యాల జడ్జిమెంట్
ఉ.09.00 నంద్యాల జడ్జిమెంట్
ఉ.09.30 నంద్యాల జడ్జిమెంట్
ఉ.10.00 నంద్యాల జడ్జిమెంట్
ఉ.10.30 నంద్యాల జడ్జిమెంట్
మ.12.00 నంద్యాల జడ్జిమెంట్
మ.02.30 డాక్టర్స్ టైమ్
సా.04.30 మార్గం
సా.05.00 స్పీడ్ న్యూస్
సా.05.30 ఉర్దూ న్యూస్
సా.06.30 పండగ వేళ
రా.07.30 పొలిటికల్ కారిడార్
రా.08.00 ఫోర్త్ ఎస్టేట్
రా.09.00 న్యూస్ 360
రా.09.30 మ్యాగజైన్ స్టోరీ

టీవీలో ఈరోజు సినిమాలు




జెమిని మూవీస్
ఉ.07.00 ప్రేమకు స్వాగతం
ఉ.09.30 శివశంకర్
మ.12.00 కార్తికేయ
సా.06.00 లడ్డూబాబు
రా.09.00 పంజా



మూవీస్ నౌ
ఉ.10.00 ఏలియన్స్ ఇన్ ద ఎటిక్
ఉ.11.50 రష్ అవర్ 3
సా.04.45 డాన్ ఆఫ్ ద డెడ్
సా.06.45 థోర్
రా.09.00 ద కంజ్యూరింగ్



హెచ్‌బీవో
ఉ.06.00 జోనా హెక్స్
ఉ.10.52 ద డార్క్ నైట్
మ.01.23 ఐరన్ మ్యాన్ 3
సా.05.00 ద అకౌంటెంట్
రా.10.49 ద హ్యాంగోవర్-2



స్టార్ మూవీస్
ఉ.06.56 టర్బో
ఉ.08.47 ఇండిపెండెన్స్ డే
మ.01.22 చైనీస్ జోడియాక్
మ.03.46 ద అవెంజర్స్
సా.06.42 గూస్‌బమ్స్



మా మూవీస్
ఉ.07.00 ఆడవాళ్లే అలిగితే
ఉ.09.00 సోగ్గాడు
మ.12.00 షాపింగ్ మాల్
సా.05.00 నమో వెంకటేశ
రా.09.00 దేవరకొండ వీరయ్య



జీ క్లాసిక్
ఉ.06.17 కాళీచరణ్
ఉ.09.21 జిగ్రీ దోస్త్
మ.12.36 హైసియత్
రా.07.00 కుందన్
రా.09.00 శేష్‌నాగ్

తిరుమల సమాచారం

తిరుమలలో ఆదివారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. దర్శనం కోసం భక్తులు వేచి ఉండే వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో 27 కంపార్టుమెంట్లు నిండాయి.

సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం :

గదుల వివరాలు:

ఉచిత గదులు – ఖాళీ లేవు
రూ.50 గదులు – ఖాళీ లేవు
రూ.100 గదులు – ఖాళీ లేవు
రూ.500 గదులు – ఖాళీ లేవు

సేవలు
సహస్రదీపాలంకరణ సేవ – ఖాళీ లేవు
వసంతోత్సవం – ఖాళీ లేవు
ఆర్జిత బ్రహ్మోత్సవం – ఖాళీ లేవు

సోమవారం ప్రత్యేక సేవ : **విశేష పూజ**



యాదాద్రి సమాచారం

- ఉదయం 4 గంటల నుంచి ఆలయం తెరుస్తారు.
- ఉదయం 4గంటల నుంచి 4:30 గంటల వరకు స్వామి అమ్మవార్లకు సుప్రభాతం.
- ఉదయం 4:30 గంటల నుంచి 5:00 గంటల వరకు బాలబోగం.
- ఉదయం 5:00 గంటల నుంచి 6:00 గంటల వరకు స్వామి అమ్మవార్లకు అభిషేకం.
- ఉదయం 6:00 గంటల నుంచి 7:15 గంటల వరకు సహస్రనామార్చన, ఆరాధన.
- ఉదయం 7:15 గంటల నుంచి మధ్యాహ్నం 12:00గంటల వరకు ధర్మ, ఉభయ దర్శనాలు ప్రారంభం.
- మధ్యాహ్నం 12:00గంటల నుంచి 12:30గంటల వరకు స్వామి అమ్మవార్లకు నివేదన.
- మధ్యాహ్నం 12:30 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ధర్మ, ఉభయ దర్శనాలు.
- మధ్యాహ్నం 3:00 గంటల నుంచి 4 :00 గంటల వరకు ఆలయం మూసివేత.
- సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7గంటల వరకు ధర్మ , ఉభయ దర్శనాలు ప్రారంభం.
- రాత్రి 7:00 గంటల నుంచి రాత్రి 8:15 గంటల వరకు ఆరాధన, సహస్రనామార్చనలు.
- రాత్రి 8:15 గంటల నుంచి 9గంటల వరకు ధర్మ, ఉభయ దర్శనాలు.
- రాత్రి 9గంటల నుంచి 9:30 గంటల వరకు పవళింపు సేవ, దర్శనాలు నిలిపివేత.
- రాత్రి 9:30 గంటల నుంచి 10గంటల వరకు ద్వార భంధనం, ఆలయం మూసివేత.
- **విశేషాలు :** ఉదయం 8:30 గంటల నుంచి 10గంటల వరకు సుదర్శన హోమం , 10గంటల నుంచి 12గంటల వరకు స్వామి అమ్మవార్ల నిత్య కల్యాణం.



ఈవారం వ్యవసాయ సూచనలు

పత్తిలో ఎండుతెగులు.. నివారణ



- ఆగస్టు నెల మొదటి పక్షంలో నెలకొన్న బెట్ట వాతావరణ పరిస్థితులు, తదుపరి మూడో వారంలో అకస్మాత్తుగా కురిసిన అధిక వర్షాలకు రాష్ట్రంలో చాలా చోట్ల పత్తి పంటలో ఎండు తెగులు లేదా వడలు తెగులు ఆశించి మొక్కలు అక్కడక్కడ గుంపులుగా వడలిపోయి ఎండిపోవడం, ఆకు రాల్చడం, కొన్ని చోట్ల చనిపోవడం జరుగుతుంది.
- చాలాసార్లు వేరువ్యవస్థ బాగున్నప్పటికీ ఇలా వడలిపోవడం జరుగుతుంది. దీనిని పారావిల్ట్ అంటారు. ఇది సాధారణంగా దీర్ఘ కాలం బెట్ట ఉన్నప్పుడు, ఎక్కువకాలం అధిక వర్షాలు కురిసినప్పుడు, ముఖ్యంగా దీర్ఘకాలిక బెట్ట తర్వాత అకస్మాత్తుగా అధిక వర్షాలు కురిసినప్పుడు ఇలా జరుగుతుంది. కావున చేనులో అక్కడక్కడ మొక్కలు వడలడం గమనించిన వెంటనే ఈ చర్యలు చేపట్టాలి.
- వడలిన మొక్కల చుట్టూ, వాటి చుట్టూ ఉన్న మంచి మొక్కల చుట్టూ మొక్కల వేరువ్యవస్థ తడిచేలా భూమిని మందు ద్రావణంతో (అనగా 30 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ మరియు 1 గ్రా. స్ట్రెప్టోసైక్లిన్ 10 లీటర్ల నీటికి కలిపి) బాగా తడపాలి. వారం రోజుల వ్యవధిలో మరల బావిస్టన్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి మొక్కల చుట్టూ తడపాలి.
- పాక్షికంగా వడలినవి మరల తిరిగి కొంత వరకు మంచిగా అయ్యే అవకాశం మరియు ఎండు తెగులు ఇంకా ఎక్కువ వ్యాప్తి చెందకుండా ఉండేందుకు ఈ చర్య ఉపయోగపడుతుంది. పైవిధంగా భూమిని తడపడంతో పాటు చేనుపై లీటరు నీటికి 2.5 గ్రా. సాఫ్/ కాంపానియన్ (కార్బండిజమ్+ మ్యాంకోజెబ్ కలిసి ఉన్న మందు) మరియు 10 గ్రా. మల్టీ కే./ పాలీఫీడ్ కూడా పిచికారీ చేస్తే బాగుంటుంది.
- అనుకూల వాతావరణ పరిస్థితులు రాగానే చేనులో గొర్రు, గుంటుకల ద్వారా అంతర కృషి చేసి మొక్కల వేరు వ్యవస్థకు గాలి సోకేలా చేయాలి. దీని వల్ల చేను త్వరగా కోలుకుని అభివృద్ధి చెందుతుంది.

సోయాచిక్కుడు

పెంకు పురుగు (స్టెమ్ గర్‌డ్లర్)

ఈ పురుగు కాండమును, పక్క కొమ్మల లోపలి పదార్థరం తిని నష్టపర్చడం వల్ల కొమ్మల చివర్లు ఎండిపోతాయి. ఈ పురుగు నష్టపరిచే లక్షణాన్ని గుర్తించాలంటే కాండంపై రెండు పాము గాట్లు లాంటి గీతలు ఉంటాయి. దీని నివారణకు లీటరు నీటికి క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లేదా ట్రైజోఫాస్1.5 మి.లీ. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ. ఏదైనా ఒక మందును పిచికారీ చేయాలి. ఉధృతి ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఫోరేట్ 10జి. గుళికలు ఎకరానికి 4 కిలోలు లేదా కార్బోఫ్యూరాన్ 3జి. గుళికలు 10–12 కిలోలు వేసుకోవాలి.



వరి

ప్రస్తుతం కురిసే వర్షాల వల్ల రైతులు ముదురునాట్లు వేయడానికి సంసిద్ధమవుతున్నారు. వారు కొన్ని మెళకువలు తప్పనిసరిగా పాటించాలి.

- నారుమడిలో కాండం తొలుచు పురుగు ఉధృతి పెరిగే సూచనలు ఉన్నాయి. నివారణకు నారు విత్తిన నారు పీకే వరం రోజుల ముందు కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు సెంటు నారుమడికి 160 గ్రాముల చొప్పున ఇసుకలో కలిపి వేయాలి.
- వరిలో ముదురు నారు అనగా 40 రోజులు లేదా ఆపైన వయసుగల నారు ఏసే పరిస్థితుల్లో, కుదుర్లు దగ్గరదగ్గరగా అనగా ఇక చదరపు మీటరుకు 44 కుదుర్లు మరియు ఒక్కొక్క కుదురుకు 4–5 మొక్కలు ఉండే విధంగా నాటుకోవాలి.
- ముదురు నాటు వేసే వారు కొనలు తుంచి నాటాలి
- ముదురునారు వనాటిన పరిస్థితుల్లో నత్రజని ఎరువును సిపార్సు చేసిన దానికి 25 శాతం అదనంగా వాడాలి. నత్రజని ఎరువును 70 శాతం నాటిన వారం రోజుల్లో, మిగిలిన 30 శాతం అంకురం ఏర్పడే దశలో వేయాలి.

విస్తరణ సంచాలకులు
ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.



చికెన్ (సుగుణ)

స్కిన్	స్కిన్‌లెస్
రూ.140	రూ.160

భవిష్యం

మేషం: పనులు సకాలంలో పూర్తి. సంఘంలో ఆదరణ. దూరప్రాంతాల నుంచి కీలక సమాచారం. భూలాభాలు. వృత్తి, వ్యాపారాలలో ఒత్తిడులు తొలగుతాయి.

వృషభం: చిన్ననాటి స్నేహితులను కలుసుకుని ఉత్సాహంగా గడుపుతారు. సేవలకు గుర్తింపు రాగలదు. ఆకస్మిక ధన, వస్తులాభాలు. వ్యాపారాలు లాభసాటిగా ఉంటాయి. ఉద్యోగులకు హోదాలు.



మిథునం: మిత్రులతో మాటపట్టింపులు. ధనవ్యయం. పనులు ముందుకు సాగవు. ప్రయాణాలు వాయిదా. వ్యాపారాలు సాదాసీదాగా ఉంటాయి. ఉద్యోగులకు వివాదాలు.

కర్కాటకం: రుణయత్నాలు. ప్రయాణాలలో అవాంతరాలు. బంధువులతో విభేదాలు. అనుకోని ఖర్చులు. ఆరోగ్యభంగం. వృత్తి, వ్యాపారాలలో గందరగోళం.

సింహం: పరిస్థితులు అనుకూలిస్తాయి. సంఘంలో గౌరవం పెరుగుతుంది. ఆసక్తికర సమాచారం. ఇంటాబయటా అనుకూలం. వృత్తి, వ్యాపారాలలో నూతనోత్సాహం.

కన్య: కుటుంబసభ్యులతో స్వల్ప వివాదాలు. ఆర్థిక లావాదేవీలు మందగిస్తాయి. శ్రమాధిక్యం. ఆలయాలు సందర్శిస్తారు. వృత్తి, వ్యాపారాలు నిరాశాజనకంగా ఉంటుంది.

తుల: పలుకుబడి పెరుగుతుంది. ఆస్తిలాభ సూచనలు. ప్రముఖులతో పరిచయాలు. బాకీలు వసూలవుతాయి. వ్యాపారాలలో కొత్త పెట్టుబడులు. ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు.

వృశ్చికం: కొన్ని పనులు వాయిదా వేస్తారు. ఆర్థిక లావాదేవీలు మందకొడిగా సాగుతాయి. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వ్యాపారాలు, ఉద్యోగాలలో కొన్ని మార్పులు.

ధనుస్సు: పలుకుబడి పెరుగుతుంది. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. సన్నిహితుల నుంచి శుభవార్తలు. వ్యాపారాలు లాభిస్తాయి. ఉద్యోగులకు సంతోషకర సమాచారం.

మకరం: నూతన ఉద్యోగప్రాప్తి. చిన్ననాటి మిత్రుల కలయిక. కీలక నిర్ణయాలు. వ్యవహారాలలో విజయం. వ్యాపారాలు, ఉద్యోగాలలో అనుకూలత.

కుంభం: పనుల్లో ప్రతిబంధకాలు. రాబడికి మించిన ఖర్చులు. అనారోగ్యం. కుటుంబ సభ్యులతో విభేదాలు. వ్యాపారాలు నత్తనడకన సాగుతాయి. ఉద్యోగులకు పనిఒత్తిడులు.

మీనం: కుటుంబసభ్యులతో వైరం. శ్రమ పడ్డా ఫలితం కనిపించదు. అనారోగ్యం. ఆలయాలు సందర్శిస్తారు. వ్యాపారాలు, ఉద్యోగాలలో నిరాశాజనకంగా ఉంటుంది.

– సింహంభట్ల సుబ్బారావు





తాళ్లగడ్డ : చివ్వెంల మండలం దురాజ్‌పల్లి గ్రామ ఆవాసం ఖాసీంపేటలో వీధుల్లో సీసీ నిర్మించలేదు. చిన్నపాటి వర్షం వచ్చినా వీధులు చిత్తడిగా మారుతున్నాయి. అధికారులు స్పందించి సీసీ నిర్మించాలి. **– ఫొటో పంపినవారు, ఎస్.వెంకటేష్**

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 99128 59928

వంటకు తంటా..!

- పాఠశాలల్లో తీరని వంట గదుల కొరత
- 19 స్కూళ్లలో ఒక్కో గదికి రూ.2లక్షలు మంజూరు
- పునాదులకే పరిమితమైన నిర్మాణాలు
- ఆరుబయటనే మధ్యాహ్నం వంట చేస్తున్న ఏజెన్సీ నిర్వాహకులు

ఆత్మకూర్(ఎస్) :

'అన్నీ ఉన్నా అల్లుడినోట్లో శని ఉన్నట్టుగా' ఉంది మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండే ఏజెన్సీల పరిస్థితి. వివిధ పాఠశాలల్లో వంటగదుల కోసం నిధులు విడుదల చేసినా స్థానిక ప్రజాప్రతినిధులు.అధికారుల నిర్లక్ష్యంతో నిర్మాణాలు ముందుకు సాగడం లేదు. దీంతో ఏజెన్సీ నిర్వాహకులకు ఆరుబయట, చెట్ల కింద వంటలు చేయడం తప్పడం లేదు. అయితే ప్రస్తుతం వర్షాకాలం కావడంతో అప్పుడప్పుడు చిరుజల్లులు కురుస్తుండడ.. ఈదురు గాలులకు కట్టెల పొయ్యిలు సరిగ్గా మండక అన్నం, కూరలు సక్రమంగా ఉడకని దుస్థితి నెలకొంది. ఫలితంగా ఒక్కోసారి విద్యార్థులకు ఉడికీ ఉడకన అన్నం పెట్టాల్సి వస్తోందని మహిళలు చెబుతున్నారు. ఈ క్రమంలో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మహిళలు వాపోతున్నారు.



సమన్వయ లోపంతోనే..

మండలంలో 12 ఉన్నత పాఠశాలలు, 6 ప్రాథమికోన్నత, 39 ప్రాథమిక పాఠశాలలతో పాటు కస్తూరిబాగాంధీ, ఆదర్శ పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించుటకు ఏజెన్సీ మహిళలు వంట వండుతున్నారు. ఇందులో సగానికి వరకు పాఠశాలల్లో వంటగదులు లేవు. అయితే ఆయా పాఠశాలల్లో వంటగదుల నిర్మాణానికి 2014–15 సంవత్సరంలో తెలంగాణ ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. దాదాపు 25 పాఠశాలల్లో వంటగదుల నిర్మాణానికి ఒక్కొక్కదానికి రూ.75 వేలు విడుదల చేయగా 4 పాఠశాలల్లో మాత్రమే గదుల నిర్మాణం పూర్తయింది. మిగతా పాఠశాలల్లో నిధులు సరిపోక అసంపూర్తిగా మిగిలాయి. దీనికితోడు స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయ లోపంతో కొన్ని పాఠశాలల్లో నిర్మాణాలు పూర్తికావడం లేదు.

మరో మారు నిధులు విడుదల..

వంటగదుల నిర్మాణాలకు ప్రభుత్వం మరోమారు నిధులు విడుదల చేసింది. ఈ విద్యాసంవత్సరం ఒక్కొక్క వంటగది నిర్మాణానికి రూ.2 లక్షల చొప్పున 19 పాఠశాలలకు వంటగదులను జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా నేషనల్ రూరల్ ఎంప్లాయ్‌మెంట్ స్కీం కింద మంజూరు చేశారు. కానీ 19 పాఠశాలల్లో నేటికీ వంటగదుల నిర్మాణాలు పూర్తికాలేదు. కొన్ని పాఠశాలల్లో బునాదులు దాటగా ఏనుబాముల, దాచారం, కాల్‌బావ్‌సింగ్‌తండా పాఠశాలల్లో పనులనే ప్రారంభించలేదు. నిధులున్నా పనులు జరగకపోవడంతో విద్యార్థులు, ఏజెన్సీ మహిళలకు తిప్పలు తప్పడం లేదు. అధికారులు స్పందించి వంట గదుల నిర్మాణాలను పూర్తి చేసి తమ ఇబ్బందులను తీర్చాలని ఏజెన్సీల మహిళలు కోరుతున్నారు.



ఆరుబయట వంటతో తీవ్ర ఇబ్బందులు

వంటగదులు లేక పోవడంతో ఆరుబయటనే మధ్యాహ్న భోజనం వండుతున్నాం. చిన్న పాటి వర్షం వచ్చినా కట్టెలు మండక వంట సక్రమంగా ఉడకడం లేదు. వంట గదులు నిర్మించి గ్యాస్ అందించాలి.

– వై.పుష్ప, ఏజెన్సీ నిర్వాహకురాలు, ఇస్తాళ్లాపురం

విద్యాశాఖ అధికారులు ఏమంటున్నారంటే..

వంట గదుల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. మండల వ్యాప్తంగా గత ఏడాది నిధుల కింద ఓ మూడు చోట్ల గదుల నిర్మాణాలు పూర్తయ్యాయి. కానీ ఈ విద్యాసంవత్సరంలో 19 పాఠశాలలకు నిధులు విడుదల కాగా గ్రామాల సర్పంచ్‌లు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్‌ల మధ్య సమన్వయ లోపంతో పనులు జరగడంలేదు. పిల్లలకు నాణ్యమైన భోజనం అందించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి.

న్యూస్ బాక్స్

ఘనంగా మదర్ థెరిస్సా జయంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

భానుపురి : వీఆర్‌డీఆర్ సేవాసమితి ఆధ్వర్యంలో మదర్ థెరిస్సా 107వ జయంతిని స్థానిక తాళ్లగడ్డలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు బైరు వెంకన్నగౌడ్ థెరిస్సా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి చకిలం రాజేశ్వర్‌రావు, కార్యదర్శి అయూబ్‌ఖాన్, అబ్దుల్‌రహీం, కుమ్మరికుంట్ల వేణుగోపాల్, బైరు శైలేందర్, అంజద్‌అలీ, బైరు మహేష్, లింగస్వామి, సాయిచరణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అనాథాశ్రమాల్లో పండ్లు పంపిణీ



చివ్వెంల : పండ్లు పంపిణీ చేస్తున్న సభ్యులు

చివ్వెంల : థెరిస్సా జయంతి సందర్భంగా హోప్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం దురాజ్‌పల్లి శివారులోని ఆలేటి ఆటం వరల్డ్, రామ్‌కోటి తండాలోని అనాథాశ్రమాల్లో పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దైద వెంకన్న, డేవిడ్ రాజ్, వనజ శ్రీనివాస్, పూర్ణ శశికాంత్ పాల్గొన్నారు.

'ఎక్స్‌పో' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ నేతలు

భానుపురి : హైదరాబాద్‌లో సెప్టెంబర్ 8, 9, 10వ తేదీల్లో జరిగే ఫొటోట్రేడ్ ఎక్స్‌పో పోస్టర్లను సూర్యాపేట ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థాని క గాంధీపార్కులో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాపర్తి శ్రీనివాస్‌గౌడ్, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు గునగంటి సురేష్, శేఖర్, శంకర్, రవి, రాజు, హరినాథ్, లాలు, శ్రీనివాస్, నగేష్, వెంకట్, పాషా, వాసు, ఓంకార్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, చరణ్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



విద్యానగర్‌లో మొక్క నాటుతున్న కౌన్సిలర్ గండూరి పావని

సూర్యాపేట : పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని కౌన్సిలర్ గండూరి పావని అన్నారు. ఆదివారం హరితహారంలో భాగంగా 2వ వార్డులోని విద్యానగర్‌లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన సొంత ఖర్చుతో మొక్కల సంరక్షణకు 200 ట్రీగార్డులను అందించినట్లు తెలిపారు. విద్యానగర్ కాలనీని మున్సిపాలిటీలో ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో గండూరి కృపాకర్, రవి, చల్లా లక్ష్మీకాంత్, రమేష్, మల్లికార్జున్, మేడిగ ఉమ, వెంకట్‌రెడ్డి, సత్యనారాయణ, లక్ష్మీప్రసాద్, హేమలత, సుధాకర్, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

మిగతా జోన్ వార్తలు 12వ పేజీలో

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

- దేవులపల్లి అమర్
- చింతలపాలెంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్రస్థాయి సమావేశం



సమావేశంలో పాల్గొన్న టీయూడబ్ల్యూజే నాయకులు



మాట్లాడుతున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మేళ్లచెరువు(హుజూర్‌నగర్) : జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి టీయూడబ్ల్యూజే కృషి చేస్తోందని ఐజేయూ జనరల్ సెక్రటరీ దేవులపల్లి అమర్ తెలిపారు. ఆదివారం సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలోని పులిచింతల ప్రాజెక్టు వద్ద నిర్వహించిన టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య వంటి అంశాలపై పోరాటాలు చేసి కొంత వరకు సాధించామన్నారు. గ్రామీణ విలేకరులపై దాడులు జరిగినప్పుడు సమస్య పరిష్కారం అయ్యే వరకు పోరాటం చేస్తున్నామన్నారు.

స్వేచ్ఛ తగ్గిపోతోంది : ఉత్తమ్

రాష్ట్రంలో ప్రస్తుత కాలంలో మీడియాకు స్వేచ్ఛ తగ్గిపోతోందని టీపీసీసీ అధ్యక్షుడు నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. మీడియాను పాలకులు ప్రభావితం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజాసమస్యలను వెలుగులోకి తేవడంలో గ్రామీణ విలేకరులు తమ పాత్ర పోషించాలన్నారు. నేరెళ్ల వంటి సంఘటనలు వెలికి తీసిన ఘనత విలేకరులదేనన్నారు. జర్నలిస్టులకు కాంగ్రెస్‌పార్టీ అండగా ఉంటుందన్నారు. సమావేశంలో ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు నగునూరి శేఖర్ , ఐజేయూ కార్యదర్శి నరేందర్‌రెడ్డి, నాయకులు కల్లూరి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి విరాహత్‌అలీ, సూర్యాపేట జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చలసాని శ్రీనివాసరావు, కోలా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'సాక్షి' మైత్రి మహిళ ఆధ్వర్యంలో

టైలరింగ్ కోర్సులో శిక్షణ

'సాక్షి' మైత్రి మహిళ ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీ నుంచి టైలరింగ్ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సర్టిఫికెట్లు అందజేయనున్నట్టు వెల్లడించారు.

శిక్షణలో నేర్పించే అంశాలు..

బేసిక్స్‌లో..
మెథడ్స్ ఆఫ్ కటింగ్, మెథడ్స్ ఆఫ్ స్టిచింగ్, బేబీ ఫ్రాక్స్, డ్రెస్ పెటి కోట్స్, శారీ పెటికోట్స్.

బ్లౌజెస్‌లో..
రౌండ్ నెక్ బ్లౌజ్, స్క్వేరో నెక్, హైనెక్, బ్యాక్‌ఓపెన్, కాలర్‌నెక్, ప్యాచ్‌వర్క్, బోట్‌నెక్, ప్రిన్సెస్‌కట్ బ్లౌజెస్.

డ్రెస్సెస్‌లో..
స్మాల్ అంబ్రెల్లా టాప్, ఫిష్ అంబ్రెల్లా టాప్, సెమీ గౌన్, సెమీ అండ్ ఫుల్ పాటియాలా.

శిక్షణ తేదీలు
30.8.17 నుంచి 27.9.17 వరకు.. (25 రోజులు)
ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు

రిజిస్ట్రేషన్ తేదీలు
24.8.17 నుంచి 29.8.17 వరకు.
ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు..

ఫీజు : 2,000

రిజిస్ట్రేషన్లు, శిక్షణ స్థలం : అనూ బ్యూటీపార్లర్, రవీంద్రనగర్, వినాయక టెంపుల్ దగ్గర, నల్లగొండ.

వివరాలకు : సెల్ : 7730881499 నంబర్‌ను సంప్రదించగలరు.

పిలాయిపల్లి కాల్వకు గండి



చిట్యాల: సుంకెనపల్లి శివారులో కాల్వకు పడిన గండి

చిట్యాల/ రామన్నపేట : చిట్యాల మండలం సుంకెనపల్లి గ్రామ శివారులోని పిలాయిపల్లి కాల్వ కట్టకు ఆదివారం గండి పడింది. దీంతో నీరంతా కాల్వ సమీపంలోని పంట చేలల్లోకి చేరి రైతులకు భారీ నష్టాన్ని మిగిల్చింది. హైదరాబాద్‌లో కురుస్తున్న భారీ వర్షాలతో పిలాయిపల్లి కాల్వలోకి భారీగా నీరు వస్తుంది. దీంతో మరోవైపు కాల్వ మరమ్మతు పనులు చేస్తుండటంతో దిగువ ప్రాంతాలకు ఇటీవల నీటిని నిలిపివేశారు. కాగా ఇటీవల కురిసిన వర్షాలతో కాల్వల్లోకి నీరు భారీగా రావడంతో కాల్వ దిగువ భాగానికి అధికారులు వదిలారు. దీంతో ఆ నీటి ఉధృతికి చిట్యాల మండలం సుంకెనపల్లి శివారులో కాల్వకు గండి పడింది. దీంతో నీరంతా రైతుల పంట చేలల్లోకి చేరింది. దీంతో కాల్వల పక్కన ఉన్న కోసనం రాంరెడ్డి, నారాయణరెడ్డి, ఆవుల నర్సింహాలతో పాటు మరికొందరు రైతులకు చెందిన సుమారుగా యాభై ఎకరాల్లోని పంటల్లోకి నీరు చేరింది. దీంతో పంటలు నీటిలో మునిగిపోయాయి. గండి పడిన ప్రదేశాన్ని వీఆర్వో రమేష్ పరిశీలించారు. గండి పడిన ప్రాంతాన్ని పరిశీలించిన సుంకెనపల్లి సర్పంచ్ ఆవుల అయిలయ్య మాట్లాడుతూ పంటలు నష్టపోయిన రైతులకు పరిహారాన్ని చెల్లించాలని అధికారులను డిమాండ్ చేశారు. ఆయన వెంట వార్డు సభ్యులు బాతరాజు రవీందర్, శేఖర్‌రెడ్డి, మల్లేష్, సోమలింగం ఉన్నారు.

సామాజిక న్యాయ సాధనకు పోరాడాలి

- రిటైర్డ్ హైకోర్టు జస్టిస్ చంద్రకుమార్



చంద్రకుమార్‌కు బొకే అందజేస్తున్న బీసీ సంఘం నాయకులు

సూర్యాపేటరూరల్ : అవినీతికి వ్యతిరేకంగా, సామాజిక న్యాయ సాధనకు అన్ని కులాలు ఏకమై పోరాటం చేయాలని హైకోర్టు మాజీ న్యాయమూర్తి బి.చంద్రకుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం ఖమ్మం పర్యటనకు వెళ్తూ సూర్యాపేట మండలం రాయినిగూడెం సమీపంలో గల సెవెన్ ఆర్ హోటల్‌లో కాసేపు ఆగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి దాదాపు 71 సంవత్సరాలు అయినప్పటికీ దేశంలో పేదవాడు పేదవాడు గానే ధనవంతుడు అధిక ధనవంతులుగా మారుతున్నారని తెలిపారు. 33 శాతంగా ఉన్న అట్టడుగు వర్గాల వారిని దోపిడీ చేస్తూ వస్తున్న అగ్ర వర్ణ దోపిడీదారులకు ప్రత్యామ్నాయ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు తెలంగాణలో అన్ని జిల్లాల్లో పర్యటిస్తున్నట్లు వెల్లడించారు. అంతకు ముందు తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మాజీ న్యాయమూర్తి చంద్రకుమార్‌కు ఘన స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి వసంత సత్యనారాయణ పిళ్ళే, కంచుకొమ్ముల వెంకట్, సట్టు నాగయ్య, కారింగుల వెంకటేశ్వర్లు, లెంకల మట్టిపల్లి యాదవ్, మేకపోతుల శ్రీకాంత్‌గౌడ్‌తో పాటు పలువురు ఉన్నారు.

బూరుగడ్డలో న్యాయమూర్తుల ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న న్యాయమూర్తులు

హుజూర్‌నగర్ రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న అతి పురాతనమైన శ్రీ శాల్మలీకంద ఆదివరహ లక్ష్మీనృసింహ వేణుగోపాల స్వామివారి దేవాలయాన్ని ఆదివారం హైదరాబాద్ మెట్రోపాలిటన్ న్యాయమూర్తి శ్రీసుధ దంపతులు, నల్లగొండ జిల్లా జడ్జి తిరుమలరావు, హుజూర్‌నగర్ జడ్జి మంజుల సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారికి ఆలయ పూజారులు, ధర్మకర్తలు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామివారి శేషవస్త్రాలు వారికి బహూకరించి శాలువ పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి హరీష్ కుమారాచార్యులు, సర్పంచ్ దేశ్‌ముఖ్ రాధిక, ధర్మకర్తలు యరగాని రామస్వామిగౌడ్, రాగం లింగయ్య, యరగాని పూర్ణ, గువ్వల అయోధ్య, నందిగామ నాగమణి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్ కుమార్ దేశ్‌ముఖ్, నీటి సంఘాల చైర్మన్ గూడెపు శ్రీనివాస్, ఈఓ లక్ష్మణరావు, కిరణ్‌గౌడ్, రాములు గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

సదస్సును విజయవంతం చేయాలి

• ముల్కలపల్లి రాములు

కోదాడఅర్బన్ : ఈ నెల 29న కోదాడ పట్టణం లోని ఆర్‌ఎస్వీ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే మహిళా వ్యవసాయ కూలీల రాష్ట్ర స్థాయి సదస్సులో అధిక సంఖ్యలో మహిళా కూలీలు పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు, సీపీఎం జిల్లా కార్యదర్శి ముల్కలపల్లి రాములు కోరారు. కోదాడ పట్టణంలోని సుందరయ్య భవన్‌లో ఆదివారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రస్థాయిలో వెయ్యి మంది ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొనను న్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.విజయ రాఘవన్ ముఖ్య అతిథిగా, స్థానిక ఎమ్మెల్యే నలమాద పద్మావతితో పాటు వ్యవపాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు అతిథులుగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఐద్వా జిల్లా కార్యదర్శి మల్లు లక్ష్మి, సంఘం జిల్లా కార్యదర్శి మట్టపల్లి సైదులు, నాయకులు కుక్కడపు ప్రసాద్, వెలిదె పద్మావతి, మిట్టగణుపుల ముత్యాలు, సోమపంగు రాధాకృష్ణ, రాపోలు సూర్య నారాయణ, కేవీ.భద్రం, జానయ్య, జె.నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు

భూములు ఆక్రమిస్తే సహించేది లేదు



మఠంపల్లి ధర్నాలో మాట్లాడుతున్న దయానంద్

మఠంపల్లి (హుజూర్‌నగర్) : సమాజంలోని దళితుల భూములను భూస్వాములు, వివిధ పరిశ్రమల యాజమాన్యాలతోపాటు ఇంకా ఎవ రైనా ఆక్రమిస్తే సహించేది లేదని మాల యునైటెడ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు దయానంద్, వైస్‌చైర్మన్ పద్మారావు అన్నారు. దళితుల భూములు ఆక్రమణకు గురవుతున్నాయని ఆదివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసన దీక్షలు 5వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా దీక్షలకు సంఘీభావం తెలిపిన మాల యునైటెడ్ ఫోరం రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ దళితుల భూములను ఆక్రమించుకోవడం సరికాదన్నారు. మఠంపల్లి దళితుల భూములను ఆక్రమించుకున్న పరిశ్రమ యాజమాన్యాలు భేషరుతుగా వైదొలగాలని, లేనట్లయితే మాల యునైటెడ్ ఫోరం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అంతేగాక 5 రోజులుగా దళితులు దీక్ష చేస్తుంటే ఉన్నతాధికారులు స్పందించకపోవడం న్యాయం కాదన్నారు. ఈ కార్యక్ర మంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇస్లావత్ బాలాజీనాయక్, చెన్నా నాయక్, పోతబత్తినిశ్రీను, ఏసుమళ్ల గోపయ్య,ముక్కంటి, వెంకటయ్య, నర్సమ్మ, శాంతమ్మ, జేమ్స్, తిరుపమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కృష్ణయాదవ్



నియామకపత్రాన్ని అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య

భానుపురి (సూర్యాపేట) : బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వట్టె కృష్ణయాదవ్‌ను నియమిస్తూ హైదరాబాద్‌లోని బీసీ భవన్‌లో ఆదివారం ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నియామకపత్రం అందించారు. ఈ సందర్భంగా కృష్ణయాదవ్ మాట్లాడుతూ బీసీలకు రాజ్యాధికారం కోసం చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. తన ఎన్నికకు సహకరించిన జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, ఎర్ర సత్యనారాయణ, బోర సుభాష్, ఆర్.అరుణ్, శారద, లింగయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి : డీఐఈఓ

సూర్యాపేటటౌన్ : క్రీడల్లో సూర్యాపేట జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రుద్రంగి రవి అన్నారు. పట్టణంలోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అథ్లెటిక్స్ అండర్ –19 విభాగంలో జరిగిన ఎంపికలను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎంపికలకు గడ్డం భాస్కర్ రెడ్డి ఆర్గనైజింగ్ సెక్రటరీగా వ్యవహరించారు. ఈ సందర్భంగా లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, జావలిన్, డిస్క్, రన్నింగ్ విభాగంలో ప్రతిభ గల క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు వీరన్న, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, రాములు, మధుసూదన్‌రెడ్డి, మాధవి, సైదులు, కరుణాకర్, వీరయ్య, కొల్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల సమస్యలపై పోరాడాలి

కోదాడ : వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి సంఘటితంగా పోరాడాలని వయోవృద్ధుల సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు సముద్రాల మల్లికార్జునస్వామి కోరారు. ఆదివారం కోదాడలోని పింఛన్‌దారుల కార్యాలయంలోమ జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వయో వృద్ధులకు ఆస్తిహక్కులో రక్షణ, బస్సు ప్రయాణంలో రాయితీలు, న్యాయస్థానాల్లోలో సత్వరన్యాయం, సంతానం నుంచి రక్షణ, వృద్ధాశ్రమాల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అక్టోబర్ 1న వయోవృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని పేర్కొన్నారు. అనంతరం సూర్యాపేట జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రావెళ్ల సీతరామయ్య, కార్యదర్శిగా మేడవరపు మట్టయ్యమ, అసోసియేట్ అధ్యక్షుడిగా విద్యాసాగర్ రావు, ఉపాధ్యక్షులుగా అమృతారెడ్డి, జక్కుల మల య్య, సోమయ్య, దాసు ఎన్నికయ్యారు. ఈ కార్యక్ర మంలో జాతీయ కౌన్సిల్ సభ్యులు రావెళ్ల సీత రామయ్య, కోదాడశాఖ అధ్యక్షుడు జాన్ షరీఫ్, సూర్యాపేట, హూజూర్‌నగర్, తుంగతుర్తి బాధ్యుతుల హమీద్ ఖాన్, శ్రీహరి, పుల్లయ్య స్థానిక నాయకులు విద్యాసాగర్‌రావు, అక్కిరాజు బాబురావు, అమృతారెడ్డి, గడ్డం నర్సయ్య, బూరుగడ్డ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మల్లికార్జునస్వామి

సమస్యల పరిష్కారంలో పీఆర్టీయూ ముందంజ

• పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లు రాంబాబు

మునగాల (కోదాడ) : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో తమ సంఘం ముందంజలో ఉంటుందని ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పీఆర్టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లు రాంబాబు పేర్కొన్నారు. ఆదివారం మునగాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఆ సం ఘం మండల శాఖ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏకీకృత సర్వీసు రూల్స్ సాధించిన ఘనత పీఆర్టీయూకే దక్కిందన్నారు. ప్రస్తుతం ఉన్న సీసీఎస్ విధానం రద్దు కోసం పీఆర్టీయూ దశలవారీగా ఉద్యమం చేపడుతుందన్నారు. ప్రతి పాఠశాలలో ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టేందుకు, ఆదర్శ పాఠశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ పోరాడుతోందన్నారు. మండల శాఖ అధ్యక్షుడు పప్పుల రాంబాబు అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి తుమ్మల సురేష్, కె.రవీందర్‌రెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు, పీఆర్టీయూ రాష్ట్ర నాయకులు టి.జితేందర్‌రెడ్డి, బి.కోటయ్య, పి.మధుసూదన్‌రెడ్డి, గడ్డం కృష్ణారెడ్డి, మునగాల, కోదాడ ఎంఈఓలు వసుకుల రామారావు, గోపతి గోపయ్య, మండలంలోని ప్రభుత్వ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఓరుగంటి రవి, కంచర్ల అనంతరెడ్డి, కొప్పుల విద్యాసాగర్‌రెడ్డి, వి.లక్ష్మి, జెడ్పీటీసీ కోల ఉపేందర్‌రావు, సీపీఎం మండల కార్యదర్శి బుర్రి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బొల్లు రాంబాబు

బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి



సమావేశంలో అభివాదం చేస్తున్న బీసీ నాయకులు

కోదాడ : బీసీలకు చట్ట సభల్లో 50 వాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మండవ శ్రీనివాసగౌడ్ కోరారు. ఆదివారం కోదాడలో జరిగిన ఆ సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా, ఉద్యోగాల్లో ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లను కూడా 50 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. అనేక సంవత్సరాల నుంచి బీసీలకు అన్యాయం జరుగుతోందన్నారు. సమావేశంలో బీసి విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పచ్చిపాల రామకృష్ణ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కొక్కు లక్ష్మీనారాయణ, బొలిశెట్టి కృష్ణయ్య, ఆవుదొడ్డి ధనమూర్తి, పాలూరి సత్యనారాయణ, ఉయ్యాల నర్సయ్య, గుండెల సూర్యనారాయణ, చందు నాగేశ్వరరావు, ఉపేందర్, బాల కృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాధనం దుర్వినియోగం చేయొద్దు : జేఏసీ



సమావేశంలో మాట్లాడుతున్న ధర్మార్జున్

ఆత్మకూర్–ఎస్(సూర్యాపేట) : తెలంగాణ జేఏసీ ప్రాజెక్టులకు వ్యతిరేకం కాదని, ప్రాజెక్టుల రీడిజైనింగ్ పేరుతో ప్రభుత్వం రూ.వేల కోట్ల ప్రజాధనాన్ని వృథా చేయొద్దని టీజేఏసీ ఉమ్మడి జిల్లా కన్వీనర్ కుంట్ల ధర్మార్జున్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని నెమ్మికల్లులో నిర్వహించిన జేఏసీ మండల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామిక తెలంగాణ కోసం జేఏసీ పనిచేస్తోందన్నారు. గత ప్రభుత్వాల పథకాలను, విధానాలనే తెలంగాణ ప్రభుత్వం అవలంబించడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో విద్యావంతుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి తండు నాగరాజు, నియోజకవర్గ కన్వీనర్ మండారి ప్రభాకర్, కొల్లు క్రిష్ణారెడ్డి, బారి అశోక్, దండెంపల్లి మహేష్, జటంగి సౌనయ్య, జనార్దన్, అర్రూరి నాగరాజు, బెల్లంకొండ రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణకారుల సమస్యలు పరిష్కరించాలి

అర్వపల్లి (తుంగతుర్తి) : స్వర్ణకారుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని స్వర్ణకార సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చొల్లేటి దేవేంద్రాచారి కోరారు. ఆదివారం స్థానిక విజ్ఞాన్ పాఠశాలలో జరిగిన స్వర్ణకార సంఘం మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని మండలాలు, గ్రామాల్లో సంఘాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.సత్యనారాయణచారి, ఎం.సత్యనారాయణ, జిల్లా కోశాధికారి బి. శ్రీనివాస్, ఎన్. వీరాచారి, ఆర్. సతీష్, ఎ.బ్రహ్మాచారి, శ్రవణ్ పాల్గొన్నారు.

కళా బృందంతో కలిసి పాట పాడుతున్న కిరణ్ (ఫైల్)



చైతన్య కిరణం

- జానపద కళాకారుడిగా రాణిస్తోన్న నకిరేకంటి కిరణ్
- ఉద్యమ పాటలతో ప్రజల్లో చైతన్యం
- ఇప్పటికే పలు ప్రదర్శనలు ఇచ్చి గుర్తింపు

ఆటే అతనికి ప్రాణం. పాటే సర్వస్వం. గజ్జెకట్టి పాటందుకుని చిందేశాడంటే ప్రజల్లో చైతన్యం వెల్లువిరుస్తుంది. తన ఆటపాటల ద్వారా ప్రజల్లో చైతన్యం కలిగిస్తున్న నకిరేకంటి కిరణ్ జానపద కళాకారుడిగా గుర్తింపు పొందాడు.



వేములపల్లి (మిర్యాలగూడ)

వేములపల్లి మండలం సల్కునూరు గ్రామానికి చెందిన నకిరేకంటి వెంకటయ్య, సరోజనమ్మ దంపతుల కుమారుడు కిరణ్‌కుమార్. ఇంటర్ వరకు చదివాడు. అదే గ్రామానికి చెందిన స్వర్గీయ పొలిశెట్టి లింగయ్య వద్ద శిష్యరికం చేసి జానపద పాటలు పాడడం నేర్చుకున్నాడు. తనతోటి గాయకులైన కోటేష్, సుదర్శన్‌ల సహకారంతో ప్రావీణ్యం సంపాదించాడు. మొదటిసారిగా 1998లో యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన జానపద పాటల ప్రదర్శనలో పాల్గొన్నాడు. అదే విధంగా 2002 నుంచి జనవిజ్ఞాన వేదికలో చేరి పలు గ్రామాలు తిరుగుతూ మూఢనమ్మకాలు, నిరక్షరాస్యత, హెచ్ఐవీ నిర్మూలన, మహిళా సాధికారిత వంటి అంశాలపై అనేక ప్రదర్శనలు ఇచ్చాడు. తన ఆటపాటలతో ప్రజల్లో నెలకొని ఉన్న మూఢనమ్మకాలను పారదోలేందుకు తనవంతుగా కృషిచేస్తున్నాడు.

తెలంగాణ ఉద్యమంలో..

మలిదశ తెలంగాణ ఉద్యమంలో దూం.. ధాం.. బృందంలో ఒకటిగా ఉంటూ తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోశాడు. అనంతరం తెలంగాణ సంస్కృతి సమాఖ్య జిల్లా కో కన్వీనర్‌గా కొనసాగుతూ కూడా అంజయ్య నేతృత్వంలో పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నాడు. కళాకారుడైన పైలం సంతోష్‌తో కలిసి ఆడి పాడి ప్రజల మన్ననలు పొందాడు. జైబోలో తెలంగాణ సినిమాలో గద్దర్‌తో కలిసి పాడుస్తున్న పొద్దుమీద నడుస్తున్న కాలమా అనే పాటలో నటించాడు. కేంద్ర, రాష్ట్ర పథకాలు స్వచ్ఛభారత్, గ్రామజ్యోతి వంటి కార్యక్రమాలను తన కళావేదిక ద్వారా ప్రచారం చేస్తూ ప్రజలను చైతన్యం పరుస్తున్నాడు.

ప్రజా చైతన్యమే నా ఊపిరి..

ప్రజల్లో మమేకమై ఉద్యమ స్ఫూర్తిని నింపుతా. నాఊపిరి ఉన్నంత వరకు కళాకారుడిగానే జీవితం కొనసాగిస్తా. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న కళాకారులకు ప్రభుత్వం చేయూతనివ్వడం గర్వంగా ఉంది. నా ఆటపాటలతో ప్రజలను ఆనంద పరచడం ఎంతో సంతోషంగా ఉంటుంది. ప్రజలు జానపద కళాకారులను ఆదరించాలి. ముందుతరాలకు మన సంప్రదాయాలను తెలియజేయాలి.



- కిరణ్, జానపద కళాకారుడు

ఎట్టకేల

దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ జ్యోతి యోజన ప్ర

- ఉమ్మడి జిల్లాకు రూ.103.49 కోట్ల నిధులు మంజూరు
- మున్సిపాలిటీలకు ఐపీడీఎస్ కింద రూ.61 కోట్లు..
- సంసద్ ఆదర్శ గ్రామాలకు రూ.4.81 కోట్లు
- నియోజకవర్గానికి ఒకటి చొప్పున 33/11కేవీ సబ్‌స్టేషన్లు
- పనులు పూర్తయ్యేందుకు ఏడాది మాత్రమే గడువు



నల్లగొండ :

దీన్‌దయాళ్, ఐపీడీఎస్, సంసద్ ఆదర్శయోజన గ్రామాలకు కలిపి ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.1800 కోట్లతో పనులు ప్రతిపాదించారు. కానీ అంత భారీ మొత్తంలో నిధులు ఇచ్చేందుకు కేంద్రం అంగీకరించకపోవడంతో ప్రతిపాదనలు వెనక్కివచ్చాయి. రూ.1800 కోట్లతో రూపొందించిన పనుల్లో కేవలం రూ.169కోట్లకు మాత్రమే కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంట్లో దీన్‌దయాళ్ పథకం కింద రూ.103.49 కోట్లు, ఇంటిగ్రేటెడ్ పవర్ డెవలప్‌మెంట్ స్కీం (ఐపీడీఎస్) రూ.61 కోట్లు, పార్లమెంట్ సభ్యులు దత్తత తీసుకున్న సంసద్ ఆదర్శయోజన గ్రామాలకు రూ.4.81 కోట్లు మంజూరు చేశారు.

గ్రామాలకు దీన్‌దయాళ్..

కేంద్ర ప్రభుత్వం గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు 24 గంటలపాటు నిరంతర విద్యుత్ సరఫరా చేసేందుకు డీడీయూజీజేవైని ప్రవేశపెట్టింది. దీనిలో భాగంగా ప్రధానంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో కొత్తగా పన్నెండు 33/11 కేవీ సబ్‌స్టేషన్లు నిర్మించనున్నారు. తుంగతుర్తి నియోజకవర్గానికి అదనంగా ఒక సబ్‌స్టేషన్ మంజూరు చేశారు.

కొత్త సబ్‌స్టేషన్లు ఇవీ...

దీన్‌దయాళ్ కింద మంజూరైన 13 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లు మండలాల వారీగా...సూర్యాపేట (ఇమాంపేట), మిర్యాలగూడ (చింతపల్లి), కోదాడ (శాంతినగర్), పీఏపల్లి (గుడిపల్లి), పెద్దవూర (కొత్తలూర్), కట్టంగూరు (పరడ), నేరేడుచర్ల (తిమ్మారెడ్డిగూడెం), శాలిగౌరారం (వల్లాల) , తిరుమలగిరి (వెలిశాల), వలిగొండ (వెల్వర్తి), మునుగోడు (సింగారం), యాదగిరిగుట్ట (యాదాద్రి), కనగల్ (దర్వేశిపురం).

గడువు ఏడాదే..

ఆరు డివిజన్‌లకు ఒక్కొక్కరు చొప్పున ఆరు కాంట్రాక్టు సంస్థలను ఎంపిక చేశారు. దేవరకొండ విష్ణు డెకోలమ్, మిర్యాలగూడ శ్రీ శ్రీనివాస ఎలక్ట్రికల్స్, సూర్యాపేట స్వర్ణ ఎలక్ట్రికల్స్, నల్లగొండ బి.శ్రీనివాస్‌రావు కాంట్రాక్టర్, హుజూర్‌నగర్ ఏకచక్ర ఎలక్ట్రికల్, భువనగిరి స్వర్ణ ఎలక్ట్రికల్స్ సంస్థలకు పనుల బాధ్యతలు అప్పగించారు. ఈ మొత్తం పనులన్నీ పూర్తిచేసేందుకు ప్రభుత్వం విధించిన గడువు ఏడాదే. ఎందుకంటే ఈ పథకాల ద్వారా అమలయ్యే ఖర్చులో కేంద్రం 60 శాతం నిధులు భరించనుంది. నిర్ణీత గడువులోగా పనులు పూర్తిచేస్తే మరో 15 శాతాన్ని కూడా కేంద్రమే భరిస్తుంది. మిగిలిన 15శాతం నిధులను పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి రుణం, మరో 10 శాతం నిధులు విద్యుత్ పంపిణీ సంస్థలు పెట్టుబడులు పెట్టనున్నాయి. ఒకవేళ సకాలంలో పనులు నిర్వహించకపోతే ఆ 15శాతం కూడా రుణం కింద తీసుకోవాల్సి ఉంటుంది. తాజాగా విద్యుత్‌శాఖకు చేరిన ప్రగతి నివేదిక ప్రకారం ఉమ్మడి జిల్లాలో దర్వేశిపురం, శాంతినగర్, తిమ్మారెడ్డిగూడెం, గుడిపల్లి, కొత్తలూరు గ్రామాల్లో సబ్‌స్టేషన్‌ల పనులు ప్రారంభమయ్యాయి. గృహాలకు విద్యుత్ కనెక్షన్లు, పెద్ద విద్యుత్ లైన్‌ల పనులు చేపట్టేందుకు సర్వే జరుగుతోంది.

పట్టణ ప్రాంతాలకు ....

- నల్లగొండ
- భువనగిరి
- సూర్యాపేట
- మిర్యాలగూ
- కోదాడ
- దేవరకొండ
- హుజూర్‌నగ
- చౌటుప్పల్

ఐపీడీఎస్ పథకం కింద జిల్లాలో నల్లగొండ, మిర్యాలగూడ, సూర్యాపేట, భువనగిరి, కోదాడ, హుజూర్‌నగర్, దేవరకొండ, చౌటుప్పల్ పట్టణాలు ఎంపికయ్యాయి. దీనికిగాను రూ. 61.55 కోట్లు మంజూరయ్యాయి. మిర్యాలగూడలో రెండు, చౌటుప్పల్‌లో ఒకటి 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లు ఏర్పాటు చేయనున్నారు. ఈ పట్టణాల్లో ప్రధానంగా చేపట్టే పనుల్లో ఎల్‌టీ సబ్‌స్టేషన్‌ల సామర్థ్యాన్ని పెంచనున్నారు. 1
కేవీఏ నుంచి 160 కేవీఏ సామర్థ్యానికి పెంచేందుకుగా
రూ.90లక్షలు, 160 కేవీఏ నుంచి 315 కేవీఏ పెంచేం
కోట్లు, 63 కేవీఏ నుంచి 100 కేవీఏకు పెంచేందుకు ర
కేటాయించారు. నల్లగొండ మినహా మిగిలిన అన్ని ప
మి లోపలి భాగం) నుంచి వేయనున్నారు. దీనికిగాను
పొడవున వేసేందుకు రూ.2.28 కోట్లు మంజూరు చేశా
దేవరకొండ (40) చొప్పున ఆయా ప్రాంతాల్లోని సబ్
దీనికిగాను రూ.2 కోట్లు కేటాయించారు.

కు..!


ారంభం



గ్రామాల్లో దీన్‌దయాళ్ పథకం ఇలా..

33 /11 కేవీ సబ్‌స్టేషన్లు	13
విద్యుత్‌లైన్	54 కి.మీ
11 కేవీ విద్యుత్ లైన్	65.50కి.మీ
నిధులు	రూ.20.41 కోట్లు
విద్యుత్ సౌకర్యం లేని దారిద్ర్యరేఖకు దిగువనున్న కుటుంబాలకు కొత్తమీటర్లు	59,868
నిధులు	రూ.17.96 కోట్లు
సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు	2,288
నిధులు	రూ.17.37 కోట్లు
11కేవీ కొత్తలైన్లు	460.69 కి.మీ
ఎల్‌టీఏబీ లైన్	1,360 కి.మీ
ఎల్‌టీ ఓవర్‌హెడ్ లైన్	65 కి.మీ
నిధులు	రూ.78.60 కోట్లు


ఈ కుటుంబాలకు రూ.125కే విద్యుత్ కనెక్షన్ ఇస్తుండడం విశేషం.



100
ను
దుకు రూ.2.12
రూ.6.50 కోట్లు
ట్టణాల్లో కలిపి మొత్తం ఆరు కిలోమీటర్ల వరకు హెచ్‌టీ లైన్ అండర్ గ్రౌండ్ (భూ
రూ.2.56 కోట్లు కేటాయించారు. కొత్తగా 11 కేవీ విద్యుత్ లైన్లు ఆరు కి.మీ
రు. నల్లగొండ (150), సూర్యాపేట (40), మిర్యాలగూడ(30), కోదాడ(30),
స్టేషన్‌లు, కార్యాలయాల పైన సోలార్ ప్యానళ్లు కూడా ఏర్పాటు చేయనున్నారు.

ఆదర్శ గ్రామాల్లో వెలుగులు...

నల్లగొండ, భువనగిరి పార్లమెంట్ సభ్యులు గుత్తా సుఖేందర్‌రెడ్డి, బూర నర్సయ్యగౌడ్, దివంగత ఎంపీ పాల్వాయి గోవర్ధన్ రెడ్డిలు సంసద్ ఆదర్శ యోజన పథకం కింద దత్తత తీసుకున్న మూడు గ్రామాలకు రూ.4.81 కోట్లు మంజూరు చేశారు. ఆయా గ్రామాల్లో నిరంతర విద్యుత్ వెలుగులు ప్రసరింపజేసేందుకు ప్రత్యేకంగా నిధులు కేటాయించారు. ఈ గ్రామాల్లో 11 కేవీ లైన్ అగ్మేంటేషన్, బీపీఎల్ కుటుంబాలకు విద్యుత్ కనెక్షన్లు, కొత్తగా 11 కేవీ విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఎల్‌టీ 'ఏబీ' లైన్లు, ఎల్‌టీ ఓవర్‌హెడ్ లైన్లు, సబ్‌స్టేషన్‌లలో డీటీఆర్‌ల పునరుద్ధరణ, వీధిలైట్ల పనులు చేపట్టనున్నారు.



యాదాద్రి.. జనసంద్రం



బాలాలయంలో నిర్వహించిన నిత్య కల్యాణంలో పాల్గొన్న భక్తులు



ఆలయ తిరువీధుల్లో భక్తుల రద్దీ

యాదగిరికొండ (ఆలేరు) : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆదివారం జనసంద్రంగా మారింది. ఆలయ పరిసరాలు, క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. సుమారు 15 వేల మంది భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారని ఆలయ అధికారులు తెలిపారు. స్వామి వారి దర్శనానికి సుమారు 3 గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. భక్తులు ప్రసాదాలు విరివిగా కొనుగోలు చేశారు. దేవస్థానం వివిధ విభాగాల నుంచి రూ.16,85,688 ఆదాయం వచ్చిందని దేవస్థానం అధికారులు వెల్లడించారు. భక్తుల రద్దీ పెరగడంతో దేవస్థానం ఘాట్ రోడ్డు నుంచి వాహనాలను అనుమతించ లేదు. దీంతో భక్తులు ఆటోలను ఆశ్రయించారు.

ఘనంగా అష్టోత్తర శతఘటాభిషేకం



కలశాలకు పూజలు నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

యాదగిరికొండ (ఆలేరు) : యాదాద్రి దేవస్థానంలో ఆదివారం అష్టోత్తర శత ఘటాభిషేకాన్ని ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ఎదురుగా 108 రాగి కలశాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. వాటి ఎదురుగా లఘు హోమం నిర్వహించారు. అనంతరం దేవస్థానం ప్రధానార్చకుడు ప్రధాన కలశాన్ని తలపై పెట్టుకుని మూడు సార్లు ప్రదక్షిణలు గావించారు. అలాగే ఆలయంలో సుదర్శన హోమం నిర్వహించారు. నిత్య కల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ నరసింహమూర్తి, ఈఓ గీతారెడ్డి, ఆలయ ప్రధానార్చకుడు కారంపూడి నరసింహమూర్తి, గట్టు యాదగిరిస్వామి, మంగళగిరి నరసింహామూర్తి ఉన్నారు.

స్వామి వారిని దర్శించుకున్న ప్రముఖులు



ప్రభుత్వ విప్ సునీతకు ప్రసాదం అందజేస్తున్న ఈఓ గీతారెడ్డి



ప్రధానాలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ జ్యోతి

యాదగిరికొండ (ఆలేరు) : శ్రీలక్ష్మీనరసింహస్వామిని ఆదివారం స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ జ్యోతిలు వేర్వేరుగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి ఘన స్వాగతం పలికారు. గర్భాలయంలోని స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద మంత్రాలతో అర్చకులు వారికి ఆశీర్వచనం చేశారు. అనంతరం కమిషనర్ జ్యోతి ప్రధానాలయ నిర్మాణ పనులను పరిశీలించారు.

సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దాలి

- పబ్లిక్ క్లబ్ అభివృద్ధికి కృషి చేస్తా
- అక్రమాలు జరిగితే సహించేది లేదు
- విద్యుత్ శాఖమంత్రి జగదీశ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట : క్లబ్‌లు సాంస్కృతిక కార్యక్రమాలకు వేదికగా ఉండాలని, సూర్యాపేట పబ్లిక్ క్లబ్‌ను రాష్ట్రంలోనే ఉత్తమ క్లబ్‌గా తీర్చిదిద్దాలని రాష్ట్ర విద్యుత్, ఎస్సీ కులాల అభివృద్ధిశాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సభ్యులకు సూచించారు. ఆదివారం సూర్యాపేటలోని త్రివేణి ఫంక్షన్ హాల్‌లో అపెక్స్ కమిటీ ఆధ్వర్యంలో క్లబ్ నూతన సభ్యులతో జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ క్లబ్‌ల్లో పేకాట లాంటి కార్యక్రమాలు కాకుండా కుటుంబంతో ఉత్సాహంగా గడిపేలా అభివృద్ధి చేసేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. సూర్యాపేటలో కొందరు అక్రమాలకు పాల్పడేందుకు వీటిని అడ్డాగా చేసుకుంటున్నారని, కోర్టును తప్పుదోవ పట్టించేలా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. అక్రమాలు కొనసాగించేందుకు కొత్త సభ్యుల వద్ద అక్రమంగా డబ్బులు కాజేసి మోసగిస్తున్నారని తెలిపారు. ఏకపక్షంగా సమావేశాలు నిర్వహించి కమిటీ ఎన్నిక జరిగిందంటూ సభ్యులను అయోమయానికి గురి చేస్తున్నారన్నారు. ఈ విషయాలన్నీ తెలుసుకుని అక్రమాలు అరికట్టి క్లబ్ గౌరవాన్ని కాపాడేందుకు సభ్యుల సహకారంతో ముందుకు వెళ్లేందుకే సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇకపై పాత, కొత్త చర్చలు లేకుండా అంతా ఒక్కటిగా క్లబ్ అభివృద్ధికి పాటుపడాలని స్పష్టం చేశారు. కొత్త సభ్యులకూ అండగా ఉంటానని, వీరే కాకుండా జనరల్ బాడీ సమావేశం నిర్వహించి మరింత మంది సభ్యులను చేర్చుకోవాలని సూచించారు. ఆహ్లాదం కోసం కుటుంబ సభ్యులతో కలిసి క్లబ్‌కు వచ్చేలామార్చాలని సభ్యులకు సూచించారు. ఇందుకోసం అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈనెల 3న జరిగే క్లబ్ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకోవా లని సూచించారు. ఈ కార్యక్రమంలో అపెక్స్ కమిటీ సభ్యులు కట్కూరి గన్నారెడ్డి, పెద్దిరెడ్డి గణేష్, శనగాని రాంబాబుగౌడ్, బొల్లెద్దు దశరథ, మార్కెట్ కమిటీ చైర్మన్ వై.వెంకటేశ్వర్లు, ఎంపీపీ వట్టె జానయ్య, బడుగుల లింగయ్యయాదవ్, గుడిపూడి వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

టీఆర్‌ఎస్ ప్రభుత్వం కార్మికుల పక్షపాతి

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

భువనగిరి : తెలంగాణ ప్రభుత్వం కార్మికుల పక్షపాతి అని ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం భువనగిరిలోని వైఎస్‌ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన టీఆర్‌ఎస్‌కేవీ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్మికుల సమస్యలపై అవగాహన కలిగిన వ్యక్తి ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. రాష్ట్రంలో ఆటో కార్మికులకు సంబంధించి రవాణా పన్ను కింద రూ.74కోట్లను రద్దు చేసిందన్నారు. ఆటో కార్మికులకు రూ.5లక్షలు, భవన నిర్మాణ కార్మికులకు రూ.6లక్షల చొప్పున ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తుందని గుర్తు చేశారు. కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ కార్మిక సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెడుతున్నారన్నారు. అనంతరం ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ మాట్లాడుతూ కార్మికులు ఐక్యతతో ఉంటే సమస్యలను సులభంగా పరిష్కరించుకోవచ్చన్నారు. అనంతరం టీఆర్‌ఎస్‌కేవీ రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబుయాదవ్ మాట్లాడుతూ కార్మికుల సమస్యను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. టీఆర్‌ఎస్‌కేవీ జిల్లా నాయకులు మందుల వెంకటయ్య అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుర్వి లావణ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జడల అమరేందర్‌గౌడ్, ఆసంఘం నాయకులు నారాయణ, ప్రభాకర్, భారతి, మారయ్య, నరేందర్‌రెడ్డి, కోటేశ్వర్‌రావు, బాలరాజ్, సంతోష్, విఠల్, దేవేందర్, నర్సింగరావుతోపాటు 28రంగాల కార్మిక నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే పేదలకు మేలు : భిక్షమయ్యగౌడ్



కాంగ్రెస్ కండువాలను కప్పుతున్న భిక్షమయ్యగౌడ్

ఆత్మకూరు(ఎం)(ఆలేరు) : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పేదలకు మేలు జరిగిందని డీసీసీ అధ్యక్షుడు బూడిద భిక్షమయ్య గౌడ్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో మండలంలోని కొరటికల్ గ్రామానికి చెందిన 30 మంది టీఆర్‌ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరిన సందర్భంగా వారిని ఉద్దేశించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గంగపురం మల్లేశం, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దసాని సిద్ధులు, గ్రామ సర్పంచ్ కొడిమాల యాదగిరి గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి కందడి అనంత రెడ్డి, కట్టెకోల హన్మంతు గౌడ్, కందడి దశరథరెడ్డి, కుమ్మరికుంట్ల గణేష్, లోడి శ్రీను, చామకూర నారాయణ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపునకు కృషి



ప్రమాణ స్వీకారం చేస్తున్న అసోసియేషన్ నాయకులు

నల్లగొండ టౌన్ : కేంద్ర ప్రభుత్వం వస్త్రాలపై అమలు చేస్తున్న జీఎస్టీని తగ్గించేందుకు తమ వంతుగా కృషి చేస్తామని తెలంగాణ స్టేట్ ఫెడరేషన్ ఆఫ్ టెక్స్‌టైల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అమ్మనబోలు ప్రకాష్, ఏపీ స్టేట్ ఫెడరేషన్ ఆఫ్ టెక్స్‌టైల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బుసిరెడ్డి మల్లీశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానికంగా జరిగిన నల్లగొండ జిల్లా క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో వారు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇరు రాష్ట్రాల వస్త్ర వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించనున్నామని తెలిపారు. జిల్లా నూతన కార్యవర్గం నూతనోత్తేజంతో వ్యాపారుల సమస్యలన్నింటిని పరిష్కరించడానికి కృషి చేయాలని, దానికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. జిల్లా అధ్యక్షుడు గట్టుశ్యాంసుందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి జెల్లా గణేష్ , జిల్లా కోశాధికారి చెరుపల్లి నవీన్ మాట్లాడుతూ వస్త్రా వ్యాపారులు ఐక్యంగా సంఘం అభ్యున్నతికి సహకరించాలని కోరారు. ప్రభుత్వపరంగా రావాల్సిన అన్ని హక్కులను సాధించుకునేందుకు తమ నూతన కార్యవర్గం పాటుపడుతుందన్నారు. సమష్టి కృషితో వ్యాపారుల సమస్యలన్నింటిని దశల వారీగా పరిష్కారం చేసుకోవడానికి అందరూ సహకరించాలని కోరారు. అనంతరం నూతన కార్యవర్గం చేత ఇరు రాష్ట్రాల ఫెడరేషన్ అధ్యక్షులు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉమ్మడి నల్లగొండ జిల్లా కన్వీనర్ గండూరి శంకర్ సూర్యాపేట అధ్యక్షుడు కర్నాటి సురేందర్, సంతోష్ చోఖాని, శ్రీనివాస్, ఎన్. సంగమేశ్వర్, బద్రి ఈశ్వరప్ప, వెల్లంపల్లి రామచందర్‌రావు, సింగిరికొండ ప్రసాద్, జగిని వెంకన్న, నాళ్ల వెంకటేశ్వర్లు, పెండెం అంజనేయులు, కై రంకొండ కిషన్, మిర్యాల పర్వతాలు, నీల మోహన్‌రావు, నీల చంద్రశేఖర్, శివకోటి యాదయ్య, కర్నాటి శివన్నారాయణ, వనం సుదర్శన్, తిరందాసు అంజనేయులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి కృషి

- రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ మందుల సామేల్



చీరలను పంపిణీ చేస్తున్న మందుల సామేల్

అడ్డగూడూరు (తుంగతుర్తి) : తెలంగాణ ప్రభుత్వం నిరుపేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తుందని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ మందుల సామేల్ అన్నారు. మండల పరిధిలోని మానాయికుంటలో ఆదివారం సామేల్ అదే గ్రామానికి చెందిన లక్ష్మీనరసింహ స్వామి కోలాట బృందంలోని 30 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. వినాయక చవితి సందర్భంగా పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మానాయికుంటలోని ప్రాథమిక పాఠశాలలో ఆవరణంలో హరితహారంలో భాగంగా మెక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కండారి సైదులు, విజయ, టీఆర్‌ఎస్ నాయకులు మందుల కృష్ణ, ఎ. యాదగిరి, చుక్క యాదగిరి, జులియన్‌రెడ్డి, మాదాసు అథోని, కండారి మహేష్, బాలెంల మలేష్, ధయాకర్, తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో సీఎం విఫలం



మాట్లాడుతున్న మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి

నూతనకల్(తుంగతుర్తి) : ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పూర్తిగా విఫలమయ్యారని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం ఎర్రపహాడ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సందర్భంలో ప్రతి ఇంటికి ఉద్యోగం, దళితులకు మూడు ఎకరాలు, డబుల్‌బెడ్ రూం, కేజీ టు పీజీ విద్య పథకాలను ఆశచూపి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించారని పేర్కొన్నారు. తన కుటుంబంలో నలుగురికి మంత్రి పదవులు రావడమే ఇంటికో ఉద్యోగంలా అనిపిస్తుందని ఎద్దేవా చేశారు. భూ సర్వేను కేంద్ర ప్రభుత్వం చేపట్టాల్సి ఉన్నప్పటికీ ప్రతిష్టత కోసం రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించడం సమంజసం కాదన్నారు. సర్వేయర్ల కొరత ఉన్నప్పటికీ భూ సర్వేను పూర్తి చేస్తానని చెప్పడం ముఖ్యమంత్రి అవివేకమని పేర్కొన్నారు. శ్రీరాం సాగర్ రెండో దశ పరిధిలో అసంపూర్తిగా ఉన్న పనులను సత్వరమే పూర్తి చేసి చెరువులు, కుంటలను నింపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జెన్నారెడ్డి ప్రతాప్‌రెడ్డి, గుడిపాటి నర్సయ్య, నాగం సుధాకర్‌రెడ్డి, ఎస్‌కె. ముజీబ్, లింగాల రామచంద్రు, దరిపెల్లి వీరన్న, జలగం యోగానందం, పసుల వెంకన్న, లింగాల వెంకన్న, సతీష్, రాములు, అవిలయ్య, జూలూరి కేశవచారి, పగిళ్ల ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

'సెవెన్'లో ఆగిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ బృందం



సూర్యాపేటరూరల్ : పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ రేణుకా చౌదరి నేతృత్వంలో స్టాండింగ్ కమిటీ సభ్యులైన లోకసభ, రాజ్యసభ ఎంపీలతో కలిసి హైదరాబాద్ నుంచి భద్రాచలం వెళ్తూ సూర్యాపేట మండలంలోని రాయినిగూడెం గ్రామ సమీపంలో గల సెవెన్ ఆర్ హోటల్‌లో కాసేపు ఆగారు. ఎన్విరాల్ అండ్ ఫారెస్ట్‌లో భాగంగా భద్రాచలంలో పర్యావరణ పరిరక్షణను పరిశీలించేందుకు గాను వెళ్తున్నట్లు బృందం సభ్యులు తెలిపారు.


కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు శనేశ్వరంలా కాంగ్రెస్



మాట్లాడుతున్న దూదిమెట్ల బాలరాజు

నల్లగొండ కల్చరల్ : ప్రజల ఆమోదంతో నిర్మిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు కాంగ్రెస్ పార్టీ శనేశ్వరంలా దాపురించిందని విద్యార్థి జేఏసీ రాష్ట్ర చైర్మన్ దూదిమెట్ల బాలారాజు యాదవ్ విమర్శించారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో కోటి ఎకరాలకు సాగు నీరు అందించాలని సీఎం కేసీఆర్ సంకల్పిస్తే కాంగ్రెస్ పార్టీ నాయకులు కోర్టులకు వెళ్తూ అనవసరంగా గగ్గోలు పెడుతున్నారని పేర్కొన్నారు. పార్లమెంట్ సభ్యుల బృందం తెలంగాణ రాష్ట్ర సందర్శించేందుకు వచ్చినప్పుడు పొన్నాల లక్ష్మయ్య కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను నిలుపుదల చేయాలని వినతిపత్రం అందించడం హేయమైన చర్య అన్నారు. సమావేశంలో టీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున, పెరిక దివాకర్, నిరసనమెట్ల అశోక్, కోపల్లె సత్యనారాయణ, యాదగిరి, శంకర్, అశోక్, శ్రవణ్, రామాంజనేయులు, లింగస్వామి, వినయ్, ఉపేందర్ పాల్గొన్నారు.

ప్రాజెక్టు ఫోకస్



సింగూరు నుంచి నీటి కేటాయింపులు (టీఎంసీల్లో)

'సింగూరు' సంక్షిప్తంగా..

ఆయకట్టు : **40** వేల ఎకరాలు

ప్రయోజనం పొందే మండలాలు : **4** (పుల్కల్, అందోలు, సదాశివపేట, మునిపల్లి)

44 గ్రామాలకు ప్రయోజనం

కాల్వల పొడవు : **197** కి.మీ.

ఎడమ కాలువ పొడవు : **24.15** కి.మీ

ప్రధాన కాలువ పొడవు : **24.10** కి.మీ



సింగూరు పరవళ్లు

40 ఏళ్ల తర్వాత.. 40 వేల ఎకరాలకు.. - కాళేశ్వరం ద్వారా మరో 35వేల ఎకరాలకు నీరు

సంగారెడ్డి నుంచి కల్వల మల్లికార్జున్‌రెడ్డి :

ఉమ్మడి మెదక్ జిల్లా మీదుగా 120 కిలో మీటర్ల పొడవునా ప్రవహిస్తున్న గోదావరి ఉపనది మంజీరాపై 1976లో 'సింగూరు ప్రాజెక్టు' నిర్మించారు. మంజీర పరీవాహక ప్రాంతంలో నీటి పారుదల రంగాన్ని అభివృద్ధి చేసే లక్ష్యంతో ఈ ప్రాజెక్టు చేపట్టారు. నిజాం హయాంలో నిర్మితమైన ఘణపూర్, నిజాంసాగర్ పరిధిలోని ఆయకట్టును స్థిరీకరించడం కూడా ప్రాజెక్టు లక్ష్యాల్లో ఒకటి. ప్రాజెక్టు పూర్తయినా సాగునీటి కాలువలు తవ్వకుండా.. హైదరాబాద్ జంట నగరాల తాగునీటి అవసరాల కోసం ప్రాజెక్టు నీటిని వినియోగించారు. సింగూరు ప్రాజెక్టు నుంచి 40 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు 1980 అక్టోబర్ 31న జీఓ 455ను విడుదల చేశారు. అయితే సాగునీరు ఇచ్చే దిశగా అప్పటి ప్రభుత్వాలు ఎలాంటి ప్రయత్నాలు చేయలేదు.

వైఎస్ చేతుల మీదుగా..!

సింగూరు నీళ్లను సాగునీటి అవసరాలకు విడుదల చేయాలని ఉమ్మడి మెదక్ జిల్లాలో పలు ఆందోళనలు జరిగాయి. ఎన్నికల హామీలో భాగంగా నాటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి 2006 జూన్ 7న రూ.88.99 కోట్ల అంచనాతో కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దీంతోపాటుగా ఎత్తిపోతలకు రూ.32.68 కోట్లు కలుపుకుని మొత్తంగా 121.67 కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు. తొలి తెలంగాణ ప్రభుత్వంలో నీటి పారుదల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన టి.హరీశ్‌రావు చొరవతో కాలువల పనులు పూర్తి కాగా.. ప్రస్తుతం గేట్ల మరమ్మతు పనులు పూర్తి కావొచ్చాయి.

తొలిసారిగా పంట పొలాలకు...

ప్రాజెక్టు చరిత్రలో తొలిసారి గత ఏడాది యాసంగిలో కాలువలు, చెరువుల ద్వారా పంట పొలాలకు నీటిని విడుదల చేశారు. ఈ ఏడాది కూడా నాలుగు మండలాల్లోని 44 గ్రామాల పరిధిలో 40వేల ఆయకట్టుకు నీరు అందించడం లక్ష్యంగా నీటిని విడుదల చేశారు. వరి, జొన్న, మొక్కజొన్న, కూరగాయల సాగుతో రైతుల ముఖాల్లో ఆనందం కనిపిస్తోంది. ఉపాధి వేటలో హైదరాబాద్ వలస వెళ్లిన కుటుంబాలు తిరిగొస్తున్నాయి. సింగూరు జలాశయంలో గతేడాది 59.06లక్షల చేప పిల్లలను వదిలారు.



'సింగూరు' ప్రత్యేకత

గోదావరికి ఉపనది అయిన మంజీరా నదిపై పుల్కల్ మండలం సింగూరు వద్ద 29.91 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో 1976లో ఈ ప్రాజెక్టు నిర్మించారు. రూ.29.95 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు నిర్మాణ వ్యయం పూర్తయ్యే నాటికి రూ.130 కోట్లకు చేరింది. ఎర్త్‌డ్యాం, స్పిల్‌వే, పవర్ హౌస్ నిర్మాణం పూర్తయిన తర్వాత.. 1999లో తొలిసారిగా ప్రాజెక్టులో పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేశారు. ఆ తర్వాత మంజీరాపై పుల్కల్, సింగూరు వద్ద వంతెనలు నిర్మించారు. ఎర్త్‌డ్యాం మొత్తం పొడవు 7.11 కి.మీ.. గేట్లకు ఎడమవైపున 3.993 కిలోమీటర్లు, కుడివైపున 3.120 కిలోమీటర్ల పొడవు ఉంటుంది. 327 మీటర్ల పొడవున ఉన్న రాతి కట్టడంపై 17 గేట్లను ఏర్పాటు చేశారు.

ఐదేళ్లలో సింగూరు ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో (మిలియన్ ఘనపుటడుగుల్లో)

సంవత్సరం	ఇన్‌ఫ్లో	ఔట్‌ఫ్లో
2012-13	6,082	11,639
2013-14	27,516	8,798
2014-15	4,122	87,600
2015-16	2,061	5,854
2016-17	1,05,987	88,798

మూడో విడత హరితహారంలో భాగంగా తెలంగాణ వ్యాప్తంగా నాటాల్సిన మొక్కలు **37.90 కోట్లు**

22.17 కోట్లు

ఇప్పటివరకు హైదరాబాద్ సహ 30 జిల్లాల్లో నాటిన మొక్కలు..

"అన్ని జిల్లాల్లో కలిపి ఇంకా 42 శాతం మొక్కలు నాటాలి. వర్షాభావం వల్లే మొక్కలు నాటడంలో జాప్యం జరుగుతోందని అధికారులు చెబుతున్నారు.



మూడో 'సారి'.. 58%

అత్యధిక జిల్లాల్లో జోరుతగ్గిన హరితహారం.. ఇప్పటికీ 'లక్ష్యం'లో సగమే పూర్తి

సూర్యాపేట నుంచి నాగరాజు కాకోళ్ల :

హరితహారం అనుకున్నంత వేగంగా సాగడం లేదు. మూడో విడత లక్ష్యంలో కేవలం 58 శాతం మాత్రమే పూర్తయింది. ఈ విడతలో అన్ని జిల్లాల్లో 37.90 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోగా హైదరాబాద్ సహా 30 జిల్లాల్లో ఇప్పటివరకు 22.17 కోట్ల మొక్కలనే నాటగలిగారు. ఖమ్మం జిల్లాలో లక్ష్యం మేర మొక్కలు నాటగా సంగారెడ్డి జిల్లా హరితహారంలో బాగా వెనుకబడి ఉంది.

రాష్ట్ర వ్యాప్తంగా 24 శాతం మేర ఉన్న అటవీ విస్తీర్ణాన్ని 33 శాతానికి పెంచేందుకు హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ప్రభుత్వం.. మొత్తంగా 230 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకుంది. అటవీ ప్రాంతంలో 100 కోట్ల మొక్కలు, మరో 130 కోట్ల మొక్కలు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నాటాలని నిర్ణయించారు. మొదటి విడతలో 15.86 కోట్లు, రెండో విడతలో 31.67 కోట్ల మొక్కలను నాటారు.

లక్ష్యంలో 50 శాతమే..

సూర్యాపేట, మహబూబాబాద్, పెద్దపల్లి, నాగర్‌కర్నూల్, సిద్దిపేట, వనపర్తి, మహబూబ్‌నగర్, మెదక్, వికారాబాద్, నిర్మల్, భూపాలపల్లి, గద్వాల, సంగారెడ్డి జిల్లాల్లో ఇచ్చిన లక్ష్యంలో 50 శాతంలోపు మొక్కలు మాత్రమే నాటారు.


ఇంకా 15 కోట్ల మొక్కలు

ఇంకా 42 శాతం మొక్కలు.. అంటే 15.73 కోట్ల మొక్కలు నాటాల్సి ఉంది. సెప్టెంబర్ వరకు వర్షాకాలం పూర్తవుతుంది. అప్పటిలోగా మిగతా 15.73 కోట్ల మొక్కలు నాటడంలో అధికార యంత్రాంగం సఫలం అవుతుందా లేదా అనేది వేచి చూడాలి.


"వర్షాభావం కారణంగా డిసెంబర్ మాసాంతం వరకు మొక్కలు నాటే కార్యక్రమం కొనసాగించే అవకాశాలు ఉన్నాయని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు.

హరితహారంలో ఖమ్మం జిల్లా తర్వాత జనగామ, ఆదిలాబాద్, కొత్తగూడెం, మేడ్చల్, నిజామాబాద్, మంచిర్యాల, సిరిసిల్ల, కరీంనగర్, రంగారెడ్డి జిల్లాలు ముందు వరుసలో ఉన్నాయి.

హరితహారం కార్యక్రమం ముందుకు సాగకపోవడానికి తీవ్ర వర్షాభావ పరిస్థితులే కారణంగా తెలుస్తోంది. రెండో విడతలో నాటిన చాలా వరకు మొక్కలు పరిరక్షణ లేక ఎండిపోయిన విషయం తెలిసిందే."



మూడో విడతలో ఇప్పటివరకు నాటిన మొక్కల శాతం | మొత్తం 31 జిల్లాల్లో నాటాల్సిన మొక్కల శాతం



13 50 శాతం లోపు మొక్కలు నాటిన జిల్లాలు రాష్ట్రంలో 13 ఉన్నాయి.

17 రాష్ట్రంలో 17 జిల్లాల్లో 50 శాతానికిపైగా మొక్కలు నాటారు.

హరితహారంలో వెనుకబడిన కొన్ని జిల్లాలు..

జిల్లా	లక్ష్యం	నాటినవి (లక్షల్లో)
సిద్దిపేట	200.00	78.29
వనపర్తి	80.00	41.10
మహబూబ్‌నగర్	200.00	59.77
మెదక్	130.00	70.94
వికారాబాద్	125.00	45.82
నిర్మల్	100.00	33.12
భూపాలపల్లి	115.00	72.40
గద్వాల	80.00	53.47



పోస్టర్ ఆవిష్కరణ



సూర్యాపేటరూరల్ : ఈ నెల 29న కోదాడ పట్టణంలో జరిగే మహిళా కూలీల రాష్ట్ర సదస్సుకు వ్యవసాయ కూలీలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని పిల్లలమర్రి గ్రామంలో రాష్ట్ర సదస్సుకు సంభందించిన వాల్‌పోస్టర్, కరపత్రాలను ఆయన ఆవిష్కరించిమాట్లాడారు. ఈ సమావేశంలో ఆ సంఘం మండల కార్యదర్శి నల్లమేకల అంజయ్య, చింతలచెర్వు భిక్షం, కూలీలు లక్ష్మమ్మ, మల్లమ్మ, మైబూ, వెంకటమ్మ, యల్లమ్మ, రాములమ్మ, సైదమ్మ, లింగమ్మ, మంజుల, కవిత పాల్గొన్నారు.

రామస్వామి మృతికి సంతాపం

సూర్యాపేటరూరల్ : మండలంలోని పిల్లలమర్రి గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన చింత రామస్వామి (75) మృతదేహాన్ని ఆదివారం ఎమ్మార్పీఎస్ నాయకుల సందర్శించి నివాళులు అర్పించి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి బోడ శ్రీరాములు, ఎంపీటీసీ రాపర్తి శ్రీనివాస్‌గౌడ్, యాతాకుల రాజయ్యమాదిగ, చంద్రశేఖర్, శ్రీను తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆత్మకూర్(ఎస్) : మండలంలోని తుమ్మలపెన్ పహాడ్ గ్రామానికి చెందిన సల్వాది వెంకట్రాములు కుటుంబానికి జైభీం సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రూ.25,500ల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ఆర్గనైజింగ్ సభ్యులు బొల్లెద్దు వెంకన్న మాట్లాడుతూ వెంకట్రాములు అనారోగ్యానికి గురవడంతో ఈ ఆర్థిక సాయం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు చెవుల నాగరాజు, బొందల అనిల్ పాల్గొన్నారు.

కరణంగిరి వ్యవస్థను పునరుద్ధరించాలి



భానుపురి : గ్రామాల్లో రద్దయిన కరుణంగిరి వ్యవస్థను తిరిగి పునరుద్ధరించాలని బ్రాహ్మణ నియోగ సంఘం రాష్ట్ర నేత కొప్పోలు యాదగిరిరావు అన్నారు. సెప్టెంబర్ 3న మేడ్చల్‌లో జరిగే సదస్సు కరపత్రాలను ఆదివారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఆదుర్తి రామయ్య, వెల్లంపల్లి రామారావు, నవీన్‌శశిధర్, చలపతిరావు, యాదగిరిరావు, ఆదుర్తి ప్రశాంత్, ప్రసాద్ పాల్గొన్నారు.

పార్వతీపుత్ర నమోస్తుతే..

- బొజ్జ గణపయ్యకు మూడో రోజు పూజలు
- గుంజలూరులో పాల్గొన్న డీఎస్పీ సునితామోహన్

చివ్వెంల :

ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి వేడుకలను జరుపుకోవాలని సూర్యాపేట డీఎస్పీ సునితామోహన్ అన్నారు. ఆదివారం మండలంలోని గుంజలూరు గ్రామంలో గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా మట్టి వినాయక విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించుకొని పూజించాలన్నారు. ఈసందర్భంగా 200 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మోర సైదులు, వీరబోయిన ప్రశాంత్, మోర నాగరాజు, సతీష్, వెంకన్న, పెదపోలు నారాయణ, వెంకన్న, లక్ష్మి, మణెమ్మ, యలమంచమ్మ, వెంకటేష్ పాల్గొన్నారు.

ఏకదంతుడికి ప్రత్యేక పూజలు

భానుపురి : సూర్యాపేట పట్టణంలోని ఖమ్మంక్రాస్‌రోడ్డులో వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహం వద్ద కమిటీ సభ్యులు మాడ్గుల రుక్మారావు, విగ్రహదాత మాడ్గుల సోనాచందర్, నవీన్, సామ వెంకట్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు డేగల రమేష్ పూజలు నిర్వహించారు.

రామన్నగూడెంలో అన్నదానం

సూర్యాపేటరూరల్ : మండలంలోని రామన్నగూడెం గ్రామంలో బీసీ కాలనీలో నెలకొల్పిన వినాయకుని విగ్రహం వద్ద ఆదివారం గ్రామానికి చెందిన నూకల వెంకన్న, లింగమ్మ దంపతులు అన్నదానం చేశారు. ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ ఆరాల వీరమల్లుయాదవ్, ఉపసర్పంచ్ చింత పాపయ్య, ఆరాల రమేష్, సైదులు, రామకృష్ణ, అచ్చారావు, నూకల శ్రీకాంత్, రాజశేఖర్, మనోహర్, మహేష్, ఆరాల సైదులు, లింగయ్య, అనిల్, శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే జనగాం క్రాస్‌రోడ్డులోని వినాయకుని విగ్రహం వద్ద బీసీ విద్యార్థి సంఘం సూర్యాపేట పట్టణ అధ్యక్షుడు సోమగాని వేణుగౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పులిహోర పంచారు.



చివ్వెంల : గుంజలూరులో పూజలు చేస్తున్న డీఎస్పీ



సూర్యాపేటరూరల్ : జనగాం క్రాస్‌రోడ్డులో..



సూర్యాపేటరూరల్ : రామన్నగూడెంలో అన్నదానం



భానుపురి : ఖమ్మం క్రాస్‌రోడ్డులో పూజలు చేస్తున్న భక్తులు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

పెన్‌పహాడ్ : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పాలన సాగిస్తోందని విద్యుత్ శాఖ, ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని గుడిబండ, గూడెపుకుంట తండాలకు చెందిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఆదివారం మాచారం ఆవాసం అనిరెడ్డిగూడెంలో మంత్రి సమక్షంలో టీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. గ్రామంలో మంత్రికి మహిళలు తిలకం దిద్ది స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలోని వినాయక విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కట్కూరి గన్నారెడ్డి, ఎంపీపీ భూక్య పద్మ, జెడ్పీటీసీ పిన్నెని కోటేశ్వర్‌రావు, వైస్ ఎంపీపీ ...



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

వెంకటేశ్వర్లు, మండల పార్టీ అధ్యక్షుడు మిర్యాల వెంకటేశ్వర్లు, నెమ్మాది భిక్షం, మండాది నగేష్‌గౌడ్, గ్రంథి వెంకటేశ్వర్లు, అనిరెడ్డి వెంకట్‌రెడ్డి, దేవిరెడ్డి వెంకట్‌రెడ్డి, ముదిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతారాంరెడ్డి, సర్పంచ్ ఇటికాల నాగేంద్ర, ఎంపీటీసీ పల్లె సువర్ణ, జూలకంటి వెంకట్‌రెడ్డి, పొలెబోయిన నర్సయ్య, గడ్డం జగన్‌మోహన్‌రెడ్డి, మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, యాట ఉపేందర్, వావిళ్ల రమేష్, ఎల్లారెడ్డి, భూక్య చిత్తరంజన్, వేణుగోపాల్‌వర్మ పాల్గొన్నారు.

Zone Guide

పీఆర్టీయూ అధ్యక్షుడిగా వెంకటి



అధ్యక్షుడు చింతమళ్ల వెంకటి



ప్రధాన కార్యదర్శి పి.విష్ణుకుమార్

చివ్వెంల : పీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా మండలంలోని తిమ్మాపురం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం చింతమళ్ల వెంకటి ఎంపికయ్యారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఎంపిక చేశారు. ప్రధాన కార్యదర్శిగా పి.విష్ణుకుమార్, అసోసియేట్ అధ్యక్షుడిగా షేక్ బషీర్, కార్యదర్శిగా కొత్త పల్లి సుదర్శన్, మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా సౌజన్య, కార్యదర్శిగా తన్నీర్ ప్రమీల ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర అషోసియేట్ అధ్యక్షులు కొండేటి రవీందర్‌రెడ్డి, తంగెళ్ల జతేందర్‌రెడ్డి వ్యవహరించిన ఈ కార్యక్రమంలో యడవల్లి శ్రీనివాస్, చెరుకు శ్రీనివాస్, మిర్యాల అమృతారెడ్డి, డేగల క్రిష్ణ. బొప్పని శ్రీనివాస్, పొదిల రవీందర్ గౌడ్, కె. సూర్యానారాయణ గౌడ్, కె.వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

జేఏసీ మండల కమిటీ ఎన్నిక

ఆత్మకూర్(ఎస్) : మండలంలోని నెమ్మికల్లు గ్రామంలో ఆదివారం జేఏసీ మండల సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీమండల కమిటీని ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా కుంచం సైదులు, కోకన్వీనర్‌గా సామ నర్సిరెడ్డి, సభ్యులుగా బొల్లె వెంకన్న, కొంపెల్లి రాంరెడ్డి, ఉత్తేజ్, లింగయ్యలను ఎన్నుకున్నారు.

నియామకపత్రం అందజేత



ఆత్మకూర్(ఎస్) : నవతెలంగాణ విద్యార్థి సంఘం మండల అధ్యక్షుడిగా మండలంలోని నెమ్మికల్ కుచెందిన వేల్పుల ఉత్తేజ్‌ను నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బారి అశోక్ యాదవ్ ఆదివారం నియామక ఉత్తర్వులు అందించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దండెంపల్లి మహేష్, ఆర్రూరి వినోద్, బోనగిరి సంతోష్, గోపగాని సంతోష్, చరణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ



పేరు : ముత్యం రాజు
అంశం : సబ్సిడీ పరికరాలు
హోదా : ఉద్యానవనశాఖ అధికారి



దురాజ్‌పల్లి : చిన్న, సన్నకారు, ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులకు ప్రభుత్వం బిందు, తుంపర సేద్య పరికరాలను సబ్సిడీ ద్వారా అందిస్తోందని ఉద్యానవన శాఖ అధికారి ముత్యం రాజు పేర్కొన్నారు. ఆసక్తి గల రైతులు దరఖాస్తు చేసుకోవాలని సాక్షికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు.

ప్రశ్న : బిందు, తుంపర సేద్య పరికరాలను ఎవరికిస్తారు.?
జవాబు : చిన్న, సన్నకారు, ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులకు ఇస్తారు.
ప్రశ్న : ఒక్కో రైతుకు ఎన్ని ఎకరాల వరకు సబ్సిడీ ఇస్తారు.?
జవాబు : ఒక్కోక్క రైతుకు 5 హెక్టార్లు అనగా 12.5 ఎకరాలకు సబ్సిడీ ఇవ్వనున్నారు.
ప్రశ్న : ఎంత సబ్సిడీ ఇస్తున్నారు.?
జవాబు : ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం, చిన్న, సన్నకారు, బీసీ రైతులకు 5 ఎకరాల వరకు 90 శాతం సబ్సిడీ అందనుంది.
ప్రశ్న : ఇతర రైతులకు సబ్సిడీ లేదా.?
జవాబు : ఇతర రైతులకు 12.5 ఎకరాల వరకు 80 శాతం సబ్సిడీ ఇస్తున్నారు.
ప్రశ్న : దరఖాస్తు ఎలా చేసుకోవాలి.?
జవాబు : మీసేవ కేంద్రాల్లోలో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలి.

భూమధ్యరేఖకు దగ్గరగా ఉన్న భారతదేశ దీవి?



ముల్కల రమేష్
సబ్జెక్టు నిపుణులు

మాదిరి ప్రశ్నలు

1. న్యూమూర్ దీవులు ఏ ప్రాంతంలో ఉన్నాయి?
1) మన్నార్ సింధుశాఖ
2) చిలకా సరస్సు
3) గంగా-బ్రహ్మపుత్ర డెల్టా
4) గోదావరి డెల్టా

2. దీవులు, అవి ఉన్న ప్రాంతాలకు సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది?
1) పిరం దీవులు – కథియవార్ తీరం
2) నౌరా దీవులు – కచ్ తీరం
3) అలియా బెట్ దీవులు – నర్మద, తపతి ముఖద్వారం
4) ఎలిఫెంటా – కొచ్చిన్ తీరం

3. 'బాలాసోర్' దీవి ఏ ప్రాంతంలో ఉంది?
1) చిలక సరస్సు 2) కొల్లేరు సరస్సు
3) పులికాట్ సరస్సు
4) మన్నార్ సింధుశాఖ

4. దీవులు, అవి ఉన్న ప్రాంతాలకు సంబంధించి కింది వాటిని జతపరచండి.
i) వైఫిన్ a) మన్నార్ సింధుశాఖ
ii) సాగర్ b) కథియవార్ తీరం
iii) పాంబన్ c) కొచ్చిన్ తీరం
iv) బైపోలా d) గంగాడెల్టా
1) i-b, ii-c, iii-d, iv-a
2) i-c, ii-d, iii-a, iv-b
3) i-b, ii-d, iii-a, iv-c
4) i-c, ii-a, iii-d, iv-b

5. 'అబ్దుల్ కలాం దీవి' ఏ రాష్ట్రంలో ఉంది?
1) తమిళనాడు 2) కేరళ
3) గుజరాత్ 4) ఒడిశా

6. 'కరంజ' దీవి ఏ రాష్ట్రంలో ఉంది?
1) ఒడిశా 2) పశ్చిమ బెంగాల్
3) మహారాష్ట్ర 4) కర్ణాటక

7. కింది వాటిలో సరికానిది ఏది?
1) వైడా, డయ్యు దీవులు కచ్ తీరంలో ఉన్నాయి
2) సాల్‌సెట్టి దీవులు కథియవార్ తీరంలో ఉన్నాయి
3) సాగర్ దీవులు పశ్చిమ బెంగాల్‌లో ఉన్నాయి
4) క్రొకడైల్ దీవులు మన్నార్ సింధు శాఖలో ఉన్నాయి

8. 8° చానల్ ఏ దీవి ద్వారా వెళుతోంది?
1) మినికాయ్ దీవి 2) సుహేలి దీవి
3) న్యూమూర్ దీవి 4) పాంబన్ దీవి

9. కింది వాటిలో సరికానిది ఏది?
1) 'డంకన్ పాసేజ్' అనేది దక్షిణ అండమాన్, లిటిల్ అండమాన్ దీవుల మధ్య ఉంది
2) సుహేలి దీవికి, మినికాయ్ దీవులకు మధ్య 9° చానల్ ఉంది
3) కోకో దీవికి, అండమాన్ దీవులకు మధ్య 'కోకో చానల్' ఉంది
4) అమీన్ దీవులు గుజరాత్ రాష్ట్రంలో ఉన్నాయి

10. 'మాజులీ' దీవి ఏ నది మూలంగా ఏర్పడింది?
1) గంగా 2) కృష్ణా
3) సింధూ 4) బ్రహ్మపుత్ర

11. 'గల్ఫ్ ఆఫ్ మన్నార్' ఎక్కడ ఉంది?
1) గుజరాత్‌కు పశ్చిమం వైపు
2) తమిళనాడుకు తూర్పు వైపు
3) పశ్చిమబెంగాల్‌కు ఉత్తరం వైపు
4) ముంబైకి దక్షిణం వైపు

12. మినికాయ్, మాల్దీవులను వేరు చేసే జల మార్గం ఏది?
1) 9° జలమార్గం 2) 8° జలమార్గం
3) కోకోస్ జలమార్గం
4) సెయింట్ జార్జెస్ జలమార్గం

13. మినికాయ్ దీవి ఏ ప్రాంతంలో ఉంది?
1) అండమాన్ 2) నికోబార్
3) లక్షదీవులు 4) మన్నార్ సింధుశాఖ

14. కింది వాటిలో భారత్, శ్రీలంక మధ్య ఉన్న ద్వీపాలు ఏవి?
1) ఎలిఫెంటా 2) నికోబార్
3) రామేశ్వరం 4) సాల్సెట్టి

15. కింది వాటిలో సరైంది ఏది?
1) లక్షదీవులు 'ప్రవాళ భిత్తిక'లతో ఏర్పడ్డాయి
2) లక్షదీవుల మొత్తం విస్తీర్ణం 32 చ.కి.మీ.
3) లక్షదీవుల్లో అతి పెద్ద దీవి 'కవ్రత్' దీవి
4) లక్షదీవుల్లో జనాభా లేని దీవి – పిట్లీ

16. పాంబన్ దీవి ఏ రెండు దేశాల మధ్య ఉంది?
1) భారత్, పాకిస్తాన్
2) భారత్, శ్రీలంక 3) భారత్, బంగ్లాదేశ్
4) భారత్, మయన్మార్

17. 'కపిలధార' జలపాతం ఏ నదిపై ఉంది?
1) నర్మద 2) తపతి
3) కృష్ణా 4) ఇంద్రావతి

18. దేశంలోని జలపాతాలు, అవి ఉన్న నదులకు సంబంధించి కింది వాటిలో సరికానిది?
1) పైకారా జలపాతం – కావేరి నది
2) కుంతాల జలపాతం – కడెం నది
3) దుదుమా జలపాతం – వంశధార నది
4) చిత్రకూట్ జలపాతం – ఇంద్రావతి నది

19. ధువన్‌ధార జలపాతం ఏ నదిపై ఉంది?
1) మహానది 2) కావేరి
3) కృష్ణా 4) నర్మద

20. జలపాతాలు, అవి ఉన్న నదులకు సంబంధించి కింది వాటిని జతపరచండి.
జలపాతం నదులు
i) జోగ్ a) సువర్ణరేఖ
ii) యెన్నా b) కావేరి
iii) శివసముద్రం c) కృష్ణా
iv) హుండ్రు d) శరావతి
1) i-d, ii-a, iii-b, iv-c
2) i-d, ii-c, iii-b, iv-a
3) i-d, ii-b, iii-a, iv-c
4) i-b, ii-a, iii-d, iv-c

21. హుండ్రు జలపాతం ఏ రాష్ట్రంలో ఉంది?
1) మధ్యప్రదేశ్ 2) బిహార్
3) జార్ఖండ్ 4) కర్ణాటక

22. జలపాతాలు, అవి ఉన్న రాష్ట్రాలకు సంబంధించి సరికానిది ఏది?
1) ధువన్‌ధార – మధ్యప్రదేశ్
2) శివసముద్రం – పశ్చిమ బెంగాల్
3) జొరసొప్పా – కర్ణాటక
4) చిత్రకూట్ – ఛత్తీస్‌గఢ్

23. 'తలకోన' జలపాతం ఏ రాష్ట్రంలో ఉంది?
1) తెలంగాణ 2) ఆంధ్రప్రదేశ్
3) కర్ణాటక 4) మహారాష్ట్ర



జనరల్ స్టడీస్
ఇండియన్ జాగ్రఫీ
ప్రత్యేకం

24. కపిలధార జలపాతం ఏ రాష్ట్రంలో ఉంది?
1) పశ్చిమ బెంగాల్
2) హిమాచల్‌ప్రదేశ్ 3) మధ్యప్రదేశ్
4) కర్ణాటక

25. 'గహిర్మాత' బీచ్ ఏ రాష్ట్రంలో ఉంది?
1) పశ్చిమ బెంగాల్ 2) ఒడిశా
3) మహారాష్ట్ర 4) కేరళ

26. కింది వాటిలో సరికానిది ఏది?
1) మెరీనా బీచ్ – తమిళనాడు
2) మైపాడు బీచ్ – ఆంధ్రప్రదేశ్
3) కోవలం బీచ్ – మహారాష్ట్ర
4) గంగాసాగర్ బీచ్ – పశ్చిమ బెంగాల్

27. దేశంలోని బీచ్‌లు, అవి ఉన్న రాష్ట్రాలను జతపరచండి.
i) అర్జున a) కేరళ
ii) చెరాయ్ b) గోవా
iii) శంకరపూర్ c) గుజరాత్
iv) గోపీనాథ్ d) పశ్చిమ బెంగాల్
1) i-c, ii-d, iii-b, iv-a
2) i-d, ii-a, iii-b, iv-c
3) i-c, ii-a, iii-d, iv-b
4) i-b, ii-a, iii-d, iv-c

28. దిగా బీచ్ ఏ రాష్ట్రంలో ఉంది?
1) తమిళనాడు 2) గోవా
3) పశ్చిమ బెంగాల్ 4) కర్ణాటక

29. 'జుహు' బీచ్ ఏ రాష్ట్రానికి చెందింది?
1) మహారాష్ట్ర 2) గుజరాత్
3) ఒడిశా 4) పశ్చిమ బెంగాల్

30. 'బారెన్' అగ్ని పర్వతం ఎక్కడ ఉంది?
1) అండమాన్ దీవులు
2) నికోబార్ దీవులు
3) లక్షదీవులు 4) మాల్దీవులు

31. 'రాస్' దీవి ఎక్కడ ఉంది?
1) గంగా డెల్టా 2) లక్షదీవులు
3) అండమాన్ దీవులు
4) ముంబైకి దక్షిణంగా

32. 'వీలర్ ఐలాండ్' ఏ రాష్ట్రానికి చెందింది?
1) తమిళనాడు 2) కేరళ
3) ఒడిశా 4) పశ్చిమ బెంగాల్

33. కింది వాటిలో ఏ దీవులను మొదటిసారిగా సూర్యకిరణాలు తాకుతాయి?
1) సుహేలి దీవులు 2) మినికాయ్ దీవి
3) కమోటా దీవి 4) కవ్రత్ దీవులు

34. మహారాష్ట్రలోని తీర ప్రాంతాన్ని ఏమని పిలుస్తారు?
1) కొంకణ్‌తీరం 2) కెనరాతీరం
3) మలబార్ తీరం
4) కోరమాండల్ తీరం

35. కింది వాటిలో సరికాని జత ఏది?
1) కెనరాతీరం – కర్ణాటక
2) మలబార్ తీరం – కేరళ
3) ఉత్కల్‌తీరం – పశ్చిమ బెంగాల్
4) సర్కార్‌తీరం – ఆంధ్రప్రదేశ్

36. 'వంగ తీరం' అని ఏ రాష్ట్ర తీర ప్రాంతాన్ని పిలుస్తారు?
1) ఒడిశా 2) పశ్చిమ బెంగాల్
3) గోవా 4) తమిళనాడు

37. తూర్పు తీరంలో ఆంధ్రప్రదేశ్ తర్వాత అత్యధిక తీర ప్రాంతం ఉన్న రాష్ట్రం ఏది?
1) పశ్చిమ బెంగాల్ 2) ఒడిశా
3) తమిళనాడు 4) పుదుచ్చేరి

38. కింది వాటిలో సరైన జత ఏది?
1) కళింగ తీరం – ఒడిశా
2) కోరమాండల్ తీరం – తమిళనాడు
3) రాణా ఆఫ్ కచ్ తీరం – గుజరాత్
4) పైవన్నీ సరైనవే

39. 'ఉత్కళ్' తీర మైదానం అని ఏ రాష్ట్ర తీరాన్ని పిలుస్తారు?
1) ఒడిశా 2) పశ్చిమ బెంగాల్
3) ఆంధ్రప్రదేశ్ 4) తమిళనాడు

40. దేశంలో ఎన్ని రాష్ట్రాలు తీర ప్రాంతాన్ని కలిగి ఉన్నాయి?
1) 8 2) 9 3) 10 4) 11

41. దేశంలో అత్యధిక తీర ప్రాంతం ఉన్న రాష్ట్రం ఏది?
1) ఆంధ్రప్రదేశ్ 2) తమిళనాడు
3) మహారాష్ట్ర 4) గుజరాత్

42. దేశంలో అతి తక్కువ తీర ప్రాంతం ఉన్న రాష్ట్రం ఏది?
1) కర్ణాటక 2) కేరళ
3) గోవా 4) పశ్చిమ బెంగాల్

43. మనదేశంలో 'లాగూన్'లు అత్యధికంగా ఉన్న రాష్ట్రం ఏది?
1) గుజరాత్ 2) మహారాష్ట్ర
3) పశ్చిమ బెంగాల్ 4) కేరళ

44. 'ఆలివ్ రిడ్లే' తాబేళ్లకు ప్రసిద్ధి చెందిన చిలక సరస్సు ఏ రాష్ట్రంలో ఉంది?
1) ఒడిశా 2) తమిళనాడు
3) కేరళ 4) గోవా

45. 'సరస్సుల నగరం' అని దేన్ని పిలుస్తారు?
1) శ్రీనగర్ 2) ఉదయ్‌పూర్
3) జైపూర్ 4) అజ్మీర్

46. భారతదేశంలో అతిపెద్ద మంచినీటి సరస్సు ఏది?
1) సాంబర్ 2) దాల్
3) లూనార్ 4) ఊలార్

47. భారత్‌లో అతి పొడవైన ఉప్పునీటి సరస్సు ఏది?
1) సాంబార్ 2) చిలకా
3) పులికాట్ 4) పుష్కర్

48. లక్షదీవుల్లో దక్షిణంగా ఉన్న దీవి?
1) రాస్ 2) సుహేళి
3) పిట్లీ 4) మినికాయ్

49. న్యూమూర్ దీవులు ఏ రెండు దేశాల మధ్య వివాదాస్పదమైనవి?
1) భారత్, మయన్మార్
2) భారత్, మాల్దీవులు
3) భారత్, బంగ్లాదేశ్
4) భారత్, శ్రీలంక

50. భారతదేశ ప్రాదేశిక జలాల పరిధి ఎంత?
1) 12 నాటికల్ మైళ్లు
2) 120 నాటికల్ మైళ్లు
3) 200 నాటికల్ మైళ్లు 4) 12 కి.మీ.

51. భారతదేశ దక్షిణాగ్ర ప్రాంతమైన 'పిగ్మో లియన్ పాయింట్' లేదా 'ఇందిరా పాయింట్' ఎక్కడ ఉంది?
1) ఉత్తర అండమాన్ దీవులు
2) లిటిల్ అండమాన్ దీవులు
3) గ్రేట్ నికోబార్ దీవులు
4) లక్షదీవులు

52. అండమాన్ నికోబార్ దీవుల రాజధాని 'పోర్టు బ్లెయిర్' ఏ ప్రాంతంలో ఉంది?
1) ఉత్తర అండమాన్
2) మధ్య అండమాన్
3) దక్షిణ అండమాన్
4) కార్ నికోబార్

53. భూమధ్య రేఖకు దగ్గరగా ఉన్న భారతదేశ దీవి ఏది?
1) గ్రేట్ నికోబార్ 2) కార్ నికోబార్
3) దక్షిణ అండమాన్
4) మధ్య అండమాన్

54. 'నార్కొండం' అగ్ని పర్వతం ఎక్కడ ఉంది?
1) మినికాయ్ దీవులు 2) లక్షదీవులు
3) ఉత్తర అండమాన్ 4) గ్రేట్ నికోబార్

సమాధానాలు

1) 3	2) 4	3) 1	4) 2	5) 4
6) 3	7) 2	8) 1	9) 4	10) 4
11) 2	12) 2	13) 3	14) 3	15) 3
16) 2	17) 1	18) 3	19) 4	20) 2
21) 3	22) 2	23) 2	24) 3	25) 2
26) 3	27) 4	28) 3	29) 1	30) 1
31) 3	32) 3	33) 4	34) 1	35) 3
36) 2	37) 3	38) 4	39) 1	40) 2
41) 4	42) 3	43) 4	44) 1	45) 2
46) 4	47) 2	48) 4	49) 3	50) 1
51) 3	52) 3	53) 1	54) 3	

What price should the dealer..



N. Vinaykumar Reddy
Director, IACE,
Hyderabad.

Model Questions

Directions (Q.No.1-5): Data related to the number of visitors in two museums (A&B) during 4 day's.

Days	Museum A		Museum B	
	Number of visitors (male+female)	% of male visitors out of the number of visitors	Number of visitors (male+ female)	% of male visitors out of the number of visitors
Monday	190	30%	480	40%
Tuesday	280	40%	188	50%
Wednesday	350	60%	200	60%
Thursday	400	35%	120	75%

1. In Museum A, on Wednesday 30% of male visitors and 70% of female visitors were from school X. What was the number of visitors (male + female) in Museum A from school X on Wednesday?
a) 161 b) 183 c) 181
d) 153 e) 157

2. The number of visitors (male + female) in Museum A and B increased by 50% and 15% respectively from Thursday to Saturday. If the total number of female visitors in Museum A and B together was equal on Thursday and Saturday, what was the total number of male visitors in Museum A and B together on Saturday?
a) 458 b) 438 c) 442
d) 448 e) 452

3. In Museum B, the ratio of female visitors on Tuesday to Friday was 2:3. If female visitors constituted 50% of the number of visitors (male+female) on Friday, what was the number of visitors (male + female) to Museum B on Friday?
a) 288 b) 296 c) 294
d) 282 e) 276

4. In Museum A, what is the difference between the total number of male visitors on Monday and Tuesday together and that on Wednesday and Thursday together?
a) 183
b) 177
c) 185
d) 187
e) 181

5. What is the average number of male visitors in Museum B on Monday, Wednesday and Thursday?
a) 134 b) 188 c) 185
d) 175 e) 184

Directions (Q.No. 6-10): In each of the following questions two equations I and II are given. You have to solve both the equations and Give answer.
a) If $x > y$ b) If $x \le y$
c) If $x < y$ d) If $x \ge y$
e) $x = y$ or relationship between x and y cannot be established

6. I. $14x^2 + 29x - 18 = 0$
II. $8y^2 - 25y - 28 = 0$

7. I. $6x^2 + 23x - 35 = 0$
II. $7y^2 - 9y - 46 = 0$

8. I. $x^2 = 6889$
$y = \sqrt{7142 - 253}$


IBPS RRB Special
Quantitative Aptitude

9. I. $6x - 11y = 132$
II. $8x + 9y = 34$


10. I. $6x^2 - 21x + 18 = 0$
II. $7y^2 - 46y - 21 = 0$

Directions (Q.No. 11 - 15): Study the following pie-charts carefully to answer the questions.

The following pie-charts show the regional distribution of aid from DAC member.



Year 2011



Year 2016

11. If the total aid received by all the countries in 2011 and 2016 was Rs. 740 billion and Rs. 1150 billion respectively, then which group of region show the maximum difference between 2016 and 2011?
a) South and Central Asia
b) Unspecified c) Europe
d) South of Sahara
e) Latin America and Caribbean

12. The aids received by South and Central Asia in 2011 and by South of Sahara in 2016 are Rs. 192.4 billion and Rs. 552 billion respectively. What is the difference between the total aid received by them in 2016 and that in 2011? (in Rs. billion)
a) 780 b) 820
c) 815 d) 860
e) 845

13. If Europe gets Rs. 74 billion aid in 2011, then the amount of aid received by South and Central Asia and East Asia and Pacific together is how much percentage less than that by South of Sahara and Middle East and North Africa together in the same year?
a) 31.12% b) 39.82%
c) 24.28% d) 34.28%
e) 36.78%

14. If the ratio of aids received by Unspecified region in 2011 to that in 2016 is 22 : 23 and the Unspecified regions get Rs. 264.5 billion in 2016 then what is the ratio of the aids received by Latin America and Caribbean in 2011 to that in 2016?
a) 1687 : 4025 b) 1683 : 4031
c) 4031 : 1683 d) 4025 : 1686
e) None of these

15. If Middle East and North Africa get Rs. 148 billion in 2011, then the aids received by Unspecified regions is what percent more than that received by South of Sahara?
a) 33.33% b) 23.33%
c) 16.66% d) 24.68%
e) None of these

Directions (Q.No.16-20): What value should come in place of question mark (?) in the following questions?

16. $8.6 \times 4.5 \times 30.2 = ?$
a) 1168.74 b) 1248.24
c) 1186.74 d) 1824.14
e) None of these

17. $\frac{17}{9}$ of 1638 of $\frac{19}{7}$ of $\frac{27}{13} = ?$
a) 12442 b) 18462
c) 19628 d) 17442
e) None of these

18. $25897 - 2434 + 3246 - 2642 = 7456 + ?$
a) 26421 b) 15211
c) 16611 d) 14211
e) None of these

19. $23^{2.3} \times 23^{2.6} \times 23^{475.2} = 23^{345 + ?}$
a) 126.1 b) 135.1
c) 145.1 d) 129.1
e) None of these

20. $7\frac{2}{3} + 8\frac{7}{9} + 2\frac{8}{9} + 4\frac{7}{12} = ?$
a) $39\frac{5}{12}$ b) $26\frac{7}{12}$ c) $23\frac{11}{12}$
d) $40\frac{7}{12}$ e) None of these

Key & Solutions

1. Number of (male + female) visitors in Museum A from School X on Wednesday
$= 350\times\frac{60}{100}\times\frac{30}{100} + 350\times\frac{40}{100}\times\frac{70}{100}$
$= 63 + 98 = 161$ ***Ans: a***

2. Total number of visitors in Museum A on Saturday
$= 400\times\frac{150}{100} = 600$
Total number of visitors in Museum B on Saturday
$= 120\times\frac{115}{100} = 138$
Now, total number of female visitors in Museum A and B together on Thursday
$= \left(400\times\frac{65}{100} + 120\times\frac{25}{100}\right) = 290$
∴Total number of male visitors in Museum A and B together on Saturday = (600 + 138) – 290
= 738 – 290 = 448 ***Ans: d***

3. Number of female visitors on Friday in Museum B = 50% of
$188\times\frac{3}{2} = \frac{1}{2}\times188\times\frac{3}{2} = 47\times3 = 141$
Number of (male + female) visitors in Museum B on Friday
∴50% ⇒ 141
∴100% ⇒141×2=282 ***Ans: d***

4. Required difference = (60% of 350 + 35% of 400) – (30% of 190 + 40% of 280) = (210 + 140) – (57 + 112) = 181 ***Ans: e***

5. Required average
$= \frac{40\% \text{ of } 480 + 60\% \text{ of } 200 + 75\% \text{ of } 120}{3}$
$= \frac{192+120+90}{3} = \frac{402}{3} = 134$
Ans: a

6. $14x^2 - 7x + 36x - 18 = 0$
$(2x-1)(7x + 18) = 0$
$x = \frac{1}{2}, \frac{-18}{7}$
$8y^2 + 32y - 7y - 28 = 0$
$(y + 4)(8y - 7) = 0$
$y = -4, \frac{7}{8}$
Hence relation cannot be established ***Ans: e***

7. $6x^2 + 30x - 7x - 35 = 0$
$(x + 5)(6x - 7) = 0$
$x = -5, \frac{7}{6}$
$7y^2 + 14y - 23y - 46 = 0$
$(y + 2)(7y - 23) = 0$
$y = -2, \frac{23}{7}$
Hence, relation cannot be established ***Ans: e***

8. I. $x^2 = 6889$
∴ $x = \sqrt{6889} = \pm 83$
II. $y = \sqrt{7142 - 253} = \sqrt{6889} = 83$
Hence $x \le y$ ***Ans: b***

9. I. $6x - 11y = 132$ —— (i)
II. $8x + 9y = 34$ —— (ii)
Equation (i) × 4 – (ii) × 3 gives
$24x - 44y = 528$
$24x + 27y = 102$
$-71y = 426$ ∴ $y = -6$
Putting the value of y in equation (i), we get $x = 11$
Hence, $x > y$. ***Ans: a***

10. I. $2x^2 - 4x - 3x + 6 = 0$
$(x - 2)(2x - 3) = 0$
$x = 2, \frac{3}{2}$
$7y^2 - 49y + 3y - 21 = 0$
$(y - 7)(7y + 3) = 0$
$y = 7, \frac{-3}{7}$
Hence, relation can't be established ***Ans: e***

11.

Country	2016	2011	Difference
Latin America & caribbean	11.50× 14 = 161	7.4× 8 = 59.2	101.8
Middle East & North Africa	11.50 × 8 = 92	7.4×10 =74	18
Europe	11.50 × 10 = 115	7.4 × 4 =29.6	85.4
Unspecified	11.50 × 23 =264.5	7.4 × 30 =222	42.5
South of Sahara	11.50 × 24 = 276	7.4 × 25 =185	91
South and Central Asia	11.50 × 15 = 172.5	7.4 × 13 96.2	76.3

Hence the maximum difference is Rs. 101.8 billion ***Ans: e***

12. Required difference
$= \frac{552}{24}\times100 - \frac{192.4}{13}\times100 =$ Rs. 820
Ans: b

13. Required % =
$= \frac{(25+10)-(13+10)}{(25+10)}\times100$
$= \frac{35-23}{35}\times100 = 34.28\%$
Ans: d

14. The aids received by Unspecified region in 2011 = Rs. 253 billion
Required Ratio
$= \frac{\frac{253}{30}\times8}{\frac{264.5}{23}\times14} \Rightarrow \frac{67.47}{161}$
$\Rightarrow \frac{1686.75}{4025} \Rightarrow \frac{1687}{4025}$ ***Ans: a***

15. Req.% $= \frac{30-25}{25}\times100 = 20\%$ ***Ans: e***

16. $8.6 \times 4.5 \times 30.2 = 1168.74$
Ans: a

17. $\frac{17}{9}\times1638\times\frac{19}{7}\times\frac{27}{13} = 17442$ ***Ans: d***

18. $25897 - 2434 + 3246 - 2642 = 7456 + ?$ Or, $? = 24067 - 7456 = 16611$ ***Ans: c***

19. $345 + ? = 2.3 + 2.6 + 475.2$
$? = 135.1$ ***Ans: b***

20. $? = (7+8+2+4)\left(\frac{2}{3}+\frac{7}{9}+\frac{8}{9}+\frac{7}{12}\right)$
$= 21 + \left(\frac{24+28+32+21}{36}\right) = 23\frac{11}{12}$
Ans: c

కింది రెండు బొమ్మల మధ్య ఉన్న 5 తేడాలను గుర్తించండి



కనుక్కోండి

కింద ఉన్న బొమ్మల్లో రెండు బొమ్మలు ఒకేలా ఉన్నాయి. అవేమిటో కనుక్కోండి.



మీకు తెలుసా?



జింకలు పుట్టిన అరగంటకే నడుస్తాయి



డైనోసార్లు భూమ్మీద 150 మిలియన్ సంవత్సరాలు బతికాయి

నాన్నా చెప్పవా?

ఎక్స్‌రే టెలిస్కోపులు దేనికోసం ఉపయోగిస్తారు


కాంతితాలూకు విభిన్న రూపాలలో కేవలం మన కంటికి కనిపించే కాంతి మాత్రమేగాక రేడియో తరంగాలు, సూక్ష్మతరంగాలు, పరారుణ కాంతి, అతినీలలోహిత కాంతి, ఎక్స్-కిరణాల కాంతి, గామా కిరణాల కాంతి ఉన్నాయి. విశ్వంలోని వివిధ ఖగోళ పదార్థాల ధర్మాలను, వాటి ఉష్ణోగ్రతలనుబట్టి వేర్వేరు రకాలకు చెందిన కాంతి వాటి నుంచి ఉద్గారమవుతుంది. ఉదాహరణకు సున్నా డిగ్రీ సెల్సియస్ కన్నా కొన్ని వందల డిగ్రీలు తక్కువ ఉష్ణోగ్రతతో ఉండే వస్తువుల నుంచి చాలా తక్కువ శక్తితో కూడిన రేడియో, ఇంకా



మైక్రోవేవ్ కాంతి కణాలు విడుదలవుతుంటాయి. సున్నా డిగ్రీ కన్నా ఎగువన కొన్ని వందల డిగ్రీల ఉష్ణోగ్రతతో ఉండే వస్తువులనుంచి ఎక్కువగా పరారుణ కాంతి విడుదలవుతుంటుంది. లక్షలాది డిగ్రీల ఉష్ణోగ్రతతో ఉండే ఖగోళ రాశుల నుంచి వెలువడే శక్తి ప్రధానంగా ఎక్స్-రే కిరణాల వంటి వాటి రూపంలో ఉంటుంది. ఉదాహరణకు నక్షత్ర మండలాల్లో చోటుచేసుకునే భారీ విస్ఫోటనాలు, తీవ్రంగా ఉండే అయస్కాంత క్షేత్రాలు, అతి శక్తివంతమైన గురుత్వాకర్షణ క్షేత్రాలు, న్యూట్రాన్ తారలు, కృష్ణ బిలాలు (బ్లాక్ హోల్స్) ఎక్స్-రే కిరణాల వంటి శక్తినే ఎక్కువగా విడుదల చేస్తుంటాయి. అయితే ఈ తరహా కాంతిని మనం మామూలు టెలిస్కోపులతో గ్రహించి, విశ్లేషించడానికి వీలు కాదు. మనకంటికి కనపించే కాంతి దర్పణాలపై పడినప్పుడు పరావర్తనం చెందితే, ఎక్స్-రే కిరణాలు మాత్రం అందులోంచి చొచ్చుకుని ముందుకు సాగిపోతాయి. అందుకని విశ్వంలోని సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ఎక్స్ కిరణాలను సేకరించి, ఆయా ఖగోళ పదార్థాలకు సంబంధించిన సమాచారాన్ని తెలుసుకొనేందుకు మామూలు టెలిస్కోపులకు బదులుగా ప్రత్యేకంగా రూపొందించే ఎక్స్-రే టెలిస్కోపులను ఉపయోగిస్తారు.

దారి కనుక్కోండి


మధ్యలో ఉన్న తాళంచెవితో ఒక డోర్ ఓపెన్ చేసుకుని బయటికి వచ్చే మార్గం కనుక్కోండి. తాళంచెవితో ఒక డోర్ మాత్రమే ఓపెన్ అవుతుంది.



గుర్తించండి

కింద ఇచ్చిన బొమ్మల పేర్లు పజిల్‌లో ఎక్కడ ఉన్నాయో గుర్తించండి


mango
onion
ladder
bamboo
peanut
lolipop
compost
apricot




e	u	t	u	n	a	e	p	l
e	e	f	e	z	i	t	r	o
t	j	p	s	j	u	o	e	l
s	r	o	t	s	g	c	d	i
o	k	n	s	j	w	i	d	p
p	a	i	z	o	e	r	a	o
m	w	o	b	f	s	p	l	p
o	e	n	o	g	n	a	m	v
c	c	b	a	m	b	o	o	o

నీడను గుర్తించండి

కింద ఇచ్చిన 5 నీడల్లో పైన ఉన్న డైనోసార్ అసలైన నీడ ఏదో గుర్తించండి



కింద ఇచ్చిన చేప బొమ్మను పక్కన ఉన్న ఖాళీ గళ్లలో గీసి రంగులు వేయండి



రంగులు వేయండి





ప్రతి పల్లెలో జానపదాలే..


కళాకారుల ర్యాలీలో పాల్గొన్న మంత్రి జగదీశ్‌రెడ్డి


జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడుతున్న గిడ్డంగుల సంస్థ చైర్మన్ సామేల్

భానుపురి(సూర్యాపేట) :

జానపద జాతర ర్యాలీని ప్రారంభించిన మంత్రి జగదీశ్‌రెడ్డి

తెలంగాణ రాష్ట్రంలో ఏ మారుమూల పల్లెకూ వెళ్లిన జానపదాలు ఉంటాయని, జానపదాలు మనలో ఒక భాగమైపోయాయని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి భాషా, సాంస్కృతిక శాఖ, జిల్లా జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జానపద జాతర ర్యాలీని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జానపదాలు తెలంగాణ సంస్కృతిలో భాగమన్నారు. గత ప్రభుత్వాలు జానపదాలు, కళలను నిర్లక్ష్యం చేసిన మాట వాస్తవమని.. అయితే ప్రజల సంకల్పంతో కళలను, జానపదాలను వారు బతికించుకున్నారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ జానపద కళలకు జీవం పోసి ప్రోత్సహిస్తున్నారన్నారు. ప్రపంచ జానపద దినోత్సవాన్ని పురస్కరించుకుని 10 రోజుల పాటు తెలంగాణలోని అన్ని జిల్లాల్లో జానపద జాతరను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జానపద కళాకారులను ప్రభుత్వం ఆదుకుంటుందని, వృద్ధ కళాకారులకు పింఛన్లు మంజూరు చేస్తున్నామన్నారు. తెలంగాణ ఉద్యమంలో కళాకారుల పాత్ర కీలకమైందన్నారు. అనంతరం పట్టణంలో జానపద కళాకారులతో పబ్లిక్ క్లబ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యక్రమాన్ని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ మందుల సామేల్, మున్సిపల్ చైర్‌పర్సన్ గండూరి ప్రవళిక జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.


డప్పు కళాకారుల ఆట


ర్యాలీలో బుర్రకథ కళాకారులు


డప్పు కళాకారుల విన్యాసం

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని పరిశీలించిన మంత్రి జగదీశ్‌రెడ్డి

తాళ్లగడ్డ (సూర్యాపేట) : జిల్లా కేంద్రంలోని మినీ ట్యాంక్ బండ్, నూతనంగా నిర్మిస్తున్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ నిర్మాణ పనులను రాష్ట్ర విద్యుత్, ఎస్సీ కులాల అభివృద్ధి శాఖా మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. మినీ ట్యాంక్ బండ్ సూర్యాపేట జిల్లా కేంద్రానికే తలమానికం కానుందన్నారు. అంతేకాకుండా ట్యాంక్‌బండ్‌పైకి వచ్చే వారు ఇక్కడే ఉండిపోయే విధంగా మరింత అత్యాధునికంగా తీర్చిదిద్దనున్నట్టు చెప్పారు. ఎమ్మెల్యే క్యాంపు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ గండూరి ప్రవళిక, మార్కెట్ చైర్మన్ వైవీ, గండూరి ప్రకాష్, కట్కూరి గన్నారెడ్డి, ఆకుల లవకుశ, ఉప్పల ఆనంద్, పాటి నాగిరెడ్డి, శనగాని రాంబాబుగౌడ్, కోడి సైదులుయాదవ్, కొండపల్లి దిలీప్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


క్యాంపు కార్యాలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి

మూసీకి పెరిగిన వరద ఉధృతి

మూసీ ప్రాజెక్ట్‌లోకి చేరుతున్న వరద





అర్వపల్లి (తుంగతుర్తి) : హైదరాబాద్‌తో పాటు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు మూసీనదికి వరద ఉధృతి పెరిగింది. భారీగా వస్తున్న వరద ప్రవాహంతో మండలంలోని జాజిరెడ్డిగూడెం–శాలిగౌరారం మండలం వంగమర్తి మధ్య మూసీ నదిలో రాక పోకలు పూర్తిగా నిలిచిపోయాయి. శనివారం రాత్రి నుంచి వరద ప్రవాహం పెరిగింది. నది ఉధృతితో పాటు మూసీ నదిలో గుంతలతో ప్రమాదం పొంచి ఉన్నందున ప్రజలు, రైతులు, ప్రయాణీకులు ఎవరూ ప్రస్తుతం రాకపోకలు సాగించవద్దని అధికారులు కోరుతున్నారు. జాజిరెడ్డిగూడెం శివారులోని మూసీనది నుంచి ఇసుక రవాణా కూడా నిలిచి పోయింది.

భారీ వాహనం





హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై ఆదివారం భారీ వాహనం ప్రయాణించింది. 120 టైర్లతో ఉన్న ఈ భారీ వాహనం హరిద్వార్ నుంచి ఖమ్మం వైపు పరిశ్రమల్లో వాడేందుకు ఓ భారీ పరికరాన్ని తీసుకెళుతోంది. 120 టైర్ల వాహనం సూర్యాపేట జిల్లా కేంద్రం మీదుగా వెళ్లడంతో ప్రజలు ఆసక్తిగా గమనించారు.
- సాక్షి ఫొటోగ్రాఫర్, సూర్యాపేట



వినాయకుడి ఆకారంలో టమాట

గరిడేపల్లి (హుజూర్‌నగర్) : గరిడేపల్లి శివాలయంలో వినాయకుడి అకారంలో ఉన్న టమాట చూపరులను ఆకట్టుకుంటోంది. ఆదివారం రామయ్య అనే భక్తుడు టమాటాలు కొనగా ఒక టమాటాపై తొండం ఆకారంగా ఉండడం చూసి శివాయాలనికి తీసుకొచ్చి వినాయకుడి విగ్రహం వద్ద ఉంచాడు. దీంతో భక్తులు వినాయకుడి ఆకారంలో ఉన్న టమాటాను చూసి మురిసిపోయారు.

మట్టపల్లిలో నాంపల్లి కోర్టు జడ్జి పూజలు


జడ్జి దంపతులను సత్కరిస్తున్న పాలకవర్గం

మఠంపల్లి(హుజూర్‌నగర్) : ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని హైదరాబాద్‌లోని నాంపల్లిలో గల మెట్రోపాలిటన్ కోర్టు జడ్జి శ్రీసుధా శ్రీకాంత్ దంపతులు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ పాలకవర్గం, అర్చకులు జడ్జి దంపతులకు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోని శ్రీస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆలయ విశిష్టతను వివరించారు. అనంతరం వారిని శేషవస్త్రాలతో ఆశీర్వదించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో హుజూర్‌నగర్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి జయంతి, జూనియర్ సివిల్ జడ్జి మంజుల, ఆలయ అనువంశిక ధర్మకర్త చెన్నూరు మట్టపల్లిరావు, ఈఓ, తహసీల్దార్ యాదగిరి తదితరులున్నారు.

వైభవంగా స్వామివారి కల్యాణం

మఠంపల్లి (హుజూర్‌నగర్) : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి లక్ష్మీనర్సింహస్వామి క్షేత్రంలో ఆదివారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి స్వాతీ నక్షత్ర కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారికి పంచామృతాభిషేకాలు, అష్టోత్తర సహస్రనామార్చనలు, అమ్మవార్లకు సహస్ర కుంకుమార్చనలు గావించారు. అనంతరం కల్యాణతంతులో భాగంగా శ్రీస్వామి, అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలంకరణతో వధూవరులుగా అలంకరించారు. అదేవిధంగా ఎదుర్కోళ్ల మహోత్సవంతో కల్యాణం ప్రారంభించి విశ్వక్సేనారాధన, పుణ్యాహ వచనం, రక్షాబంధనం, మధుపర్క పూజ, మాంగల్యధారణ, తలంబ్రాల కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. మహానివేదన, నీరాజన మంత్ర పుష్పాలతో భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అంతేగాక పెళ్లి పీటలపై కూర్చున్న దంపతులను శేష వస్త్రాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనవంశిక ధర్మకర్త చెన్నూరు మట్టపల్లిరావు, ఈఓ, తహసీల్దార్ యాదగిరి, ప్రధాన అర్చకులు కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్ : గరిడేపల్లి మండలం అప్పన్నపేటలోని 1వ వార్డులో పలు వీధుల్లో సీసీరోడ్ల నిర్మాణం చేపట్టలేదు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వీధులు బురదమయంగా మారడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు.

ఫొటో పంపినవారు : పి.శ్రీనివాస్, అప్పన్నపేట

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9603158840

అక్కడ బస్..! ఇక్కడ స్టాండ్..!!



మెయిన్‌రోడ్డు పైనే నిలుస్తున్న బస్సులు



మేళ్లచెరువు బస్‌స్టేషన్

'చూసుకోని మురువ.. చెప్పుకోని ఏడ్పు..' చందంగా ఉంది మేళ్లచెరువు బస్టాండ్ దుస్థితి. మండల కేంద్రంలో దీనిని నిర్మించి పుష్కరకాలం దాటింది. అయినా బస్సు ముఖం చూడలేదు ఆ ప్రాంగణం. కనీసం అక్కడ బస్టాండ్ ఉన్న సంగతి కూడా ప్రయాణికులకు తెలియదంటే అతిశయోక్తి కాదు.

- నిరుపయోగంగా మేళ్లచెరువు బస్టాండ్
- నిర్మించి పుష్కర కాలం..
- నేటికీ ఒక్క బస్సు కూడా రాని వైనం..
- గ్రామానికి దూరంగా ఉండడమే కారణం..
- మెయిన్‌రోడ్డు నుంచే ప్రయాణికుల రాకపోకలు

మేళ్లచెరువు :

మండలానికి 12 ఏళ్ల క్రితం బస్టాండ్ మంజూరైంది. అయితే అధికారులు, పాలకుల అనాలోచిత నిర్ణయంతో ప్రయాణికుల సౌకర్యార్థం కాకుండా గ్రామానికి కిలో మీటరు దూరంలో నిర్మించారు. అయితే మండల కేంద్రంలోని మెయిన్‌రోడ్డు ప్రయాణికులకు అనుకూలంగా ఉంటుంది. అక్కడికి బస్సులతోపాటు ఇతర ప్రైవేట్ వాహనాలు వస్తుంటాయి. దీంతో మండల ప్రజలతోపాటు ఇతర గ్రామాల ప్రయాణికులు మెయిన్‌రోడ్డునే ప్రధాన కేంద్రంగా చేసుకోని రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ప్రాంగణాన్ని మెయిన్‌రోడ్డులో నిర్మిస్తే అందరికి అనుకూలంగా ఉండేది. ప్రస్తుతం రోడ్డు మీద ఎలాంటి నీడ, రక్షన లేకపోవడంతో ఎండా, వానలకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

కబ్జా అవుతున్న బస్టాండ్ స్థలం

ప్రస్తుతం బస్టాండ్ నిర్మించిన ప్రాంతంలో భూమి విలువ గజం రూ.10 వేల వరకు పలుకుతోంది. అయితే ఏళ్ల తరబడి బస్టాండ్ నిరుపయోగంగా ఉంటుండడంతో దానిపై అక్రమార్కుల కన్ను పడింది. దానిని కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనికితోడు రాత్రి సమయాల్లో అసాంఘీక కార్యకలాపాలకు నిలయంగా మారుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండ్‌ను వినియోగంలోకి తేవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అందుబాటులోకి తేవాలి



బస్టాండ్ నిరుపయోగంగా మారడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నారులు రోడ్డుపై నిలబడలేక పోతున్నారు. వెంటనే అధికారులు స్పందించి ప్రయాణికుల ఇబ్బందులు తీర్చాలి.

-బుస్సా నర్సింహారావు, మేళ్లచెరువు

న్యూస్ బాక్స్

ఆయుర్వేదిక్ మందుల వినియోగంపై అవగాహన

హుజూర్‌నగర్ : పట్టణంలోని వర్తక సంఘం కార్యాలయంలో ఆదివారం బ్లూలైఫ్ ప్రొడక్ట్స్‌కు చెందిన వైద్యులు ఆయుర్వేదిక్ మందుల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షుగర్, బీపీ, ఇతర దీర్ఘకాలిక వ్యాధులు, ఆహారపు అలవాట్లు, మందుల వినియోగంపై తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్ఎం రామకృష్ణమాచార్యులు, వెంకటరెడ్డి, విష్ణుమూర్తి, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను వివరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మల్లికార్జున్‌రావు

హుజూర్‌నగర్ : కేంద్రం, రాష్ట్రంలోని పాలకులు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్‌రావు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఇం దిరా భవన్‌లో ఆ పార్టీ జిల్లా, బ్లాక్, బూత్ కమిటీల సభ్యుల ఎన్నికకు జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకు వచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్యాల అమర్‌నాథరెడ్డి, నాయకులు జక్కుల మల్లయ్య, జాల గురవయ్య, బెల్లంకొండ గురవయ్య, కుక్కడపు మహేష్, సైదులునాయక్, కస్తాల శ్రావణ్‌కుమార్, గంగసాని యల్లారెడ్డి, కోలపూడి యోహాన్, ముక్కంటి, రామరాజు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాల్లో డీజే సౌండ్స్ నిషేధం

హుజూర్‌నగర్ : పట్టణంలో జరుగుతున్న గణేష్ ఉత్సవాలల్లో డీజే సౌండ్స్‌ను నిషేధించినట్లు ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ విగ్రహాల ప్రతిష్ఠల నుంచి నిమజ్జనాల వరకు డీజే సౌండ్స్, భారీ మైక్‌సెట్‌ల ఏర్పాటు చేయవద్దని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్పీ ఆదేశానుసారం పకడ్బందీగా నిబంధనలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.

బలహీన వర్గాలను చీల్చే కుట్రలను నమ్మొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

హుజూర్‌నగర్ : బీసీ సంఘాల పేరుతో కొందరు నాయకులు బలహీనవర్గాలను చీల్చే కుట్రలు చేస్తున్నారని, వారిని నమ్మవద్దని టీఆర్ఎస్ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్థానికంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ కి చెందిన ఆర్.కృష్ణయ్య బీసీ సంఘాల పేరుతో బీసీలు ఎక్కువగా ఉన్న చోట మాత్రమే కమిటీలు వేస్తు అగ్రవర్ణాల కనుసన్నలలో పని చేస్తున్నాడని ఆరోపించారు. బలహీన వర్గాల ఐక్యతను నిర్వీర్యం చేసేందుకు చేస్తున్న కుట్రలను బీసీలు గమనించి తిప్పికొట్టాలని కోరారు. ఈ సమావేశంలో చేపూరి నర్సింహాచారి, బుడిగె పిచ్చయ్య, పల్లపు పెద్దబ్బాయ్, పచ్చిపాల ఉపేందర్, కోటేశ్వరరావు, శ్రీహరి, భాస్కర్, రామారావు, వెంకటాచారి, మురళీ, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

మిగతా జోన్ వార్తలు 12వ పేజీలో

వరి సేద్యంలో నత్రజని వాడాలి



యూరియా వాడే విధానాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ విద్యార్థినులు

గరిడేపల్లి : వరి పంటలో అవసరమైనంత పరిమాణంలో యూరియా అందిస్తేనే పంట దిగుబడి అధికంగా వస్తుందని గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమం టీం లీడర్ యసస్వీ, విద్యార్థినులు అనూష, పావని, మహిమా జ్యోతి, యమిషీలు అన్నారు. ఆదివారం మండలంలోని పొనుగోడులో మహిళా రైతు బొలిశెట్టి సంధ్య వరిక్షేత్రంలో నత్రజని వాడే విధానాలను పరిశీలించి మెలకువలు వివరించారు. వరి పంటలో యూరియాను 3 దఫాలుగా వేయాల్సి ఉంటుందన్నారు. భూసార పరీక్షలకు అనుగుణంగా నత్రజని మోతాదును నిర్ణయించుకొవాలని సూచించారు. నత్రజని పొలంలో వేసేటప్పుడు నీటిని బాగా తగ్గించి బురద పదునులో వేసుకోవడం ద్వారా నత్రజని వృథా కాకుండా పూర్తిగా మొక్కలకు అందుతుందని వివరించారు.కార్యక్రమంలోవిద్యార్థినులు, రైతులు సైదారావు, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నేరేడుచర్ల : సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు బియ్యాల వెంకటనర్సయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన నేరేడుచర్లలో 'సెప్టెంబర్ 1, పెన్షన్ వి ద్రోహ దినం' వాల్ పోస్టర్‌ను విడుదల చేసి మాట్లాడారు. నేరేడుచర్ల టీఎస్ యూటీఎఫ్ ప్రధా న కార్యదర్శి బి.సైదులు నాయక్, పాలకీడు, మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.సాంబయ్య, ఆర్. శ్రీనయ్య, యూ ఎస్‌పీసీ నాయకులు కె.సైదులు, ఉపేందర్, వెంకటేశ్వర్లు పిచ్చ య్య, జైహింద్, ఎం.రవి, నాగార్జున పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ



గరిడేపల్లి : జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ –16 విభాగంలో బహుమతులు సాధించినఆదర్శ పాఠశాల విద్యార్థులను ప్రిన్సిపాల్ సుధాకర్ ఆది వారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడూతూ ఆదివారం సూర్యాపేట ఎస్‌వీ కళాశాలలో జరిగిన జిల్లాస్థాయి స్కూల్‌గేమ్ ఫెడరేషన్ అండర్ –16 విభాగంలో విద్యార్థినులు జి.శిల్ప (200మీ, 400మీ) రన్నింగ్‌లో ద్వితీయ బహుమతి, పి.రాధిక (హైజంప్) ద్వితీయ బహుమతి, పి.రాధిక (లాంగ్‌జంప్) థర్డ్ ప్రైజ్‌లను సాధించినట్లు ఆయన తెలిపారు.

ఏకదంతుడికి ఘన పూజలు



హుజూర్‌నగర్ : అన్నదానం చేస్తున్న చైర్మన్, ఎస్‌ఐ



హుజూర్‌నగర్ : నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు

- కొనసాగుతున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలు
- ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అన్నదానాలు

హుజూర్‌నగర్ /హుజూర్‌నగర్ రూరల్ /నేరేడుచర్ల /గరిడేపల్లి : నియోజకవర్గ వ్యాప్తంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఆదివారం కొనసాగాయి. మండపాల వద్ద భక్తులు నిత్య పూజలు చేశారు. రాత్రి సమయాల్లో భజనలు, కోలాటాలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. హుజూర్‌నగర్ పట్టణంలోని 13వ వార్డు శ్రీనగర్‌కాలనీ, టీచర్స్ కాలనీ, దీక్షిత్‌నగర్ తదితర గణేష్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో భారీగా అన్నదానాలు నిర్వహించారు. శ్రీనగర్ కాలనీలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు అట్లూరి హరిబాబు ఏర్పాటు చేసిన అన్నదానాన్ని నగరపంచాయతీ చైర్మన్ జక్కుల వెంకయ్య, ఎస్‌ఐ రంజిత్‌రెడ్డిలు ప్రారంభించారు. అదేవిధంగా టీచర్స్ కాలనీ ప్రధాన వీధిలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు పంపిణీ చేశారు. కాగా పట్టణంలోని 6వ వార్డు, 2వ వార్డులకు చెందిన, ఎండీఆర్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాలకు శోభాయాత్ర నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. ఈ కార్యక్రమాల్లో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



నేరేడుచర్ల : వినాయకుడికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



గరిడేపల్లి : పూజల్లో పాల్గొన్న భక్తులు

ప్రజలను చైతన్యం చేయాలి : సంకినేని

హుజూర్‌నగర్ : రాష్ట్రంలోని టీఆర్‌ఎస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యం చేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని టౌన్‌హాల్‌లో జరిగిన బీజేపీ నియోజకవర్గ స్థాయి సోషల్ మీడియా అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ రంగుల కలలను చూపిస్తూ పాలన సాగిస్తున్నాడే తప్ప ప్రజాసమస్యలు పరిష్కరించడం లేదని విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలను, ప్రభుత్వ వైఫల్యాలను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకు వెళ్లాలని కోరారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొణతం సత్యనారాయణరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి బొబ్బా భాగ్యరెడ్డి, సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ వెంకటరమణ, జీడి భిక్షం, నాగేంద్రనాయక్, కృష్ణయ్య, భిక్షమయ్య, రమేష్, విజయ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంకినేని వెంకటేశ్వరరావు

సమాజ చైతన్యానికి పాటుపడాలి

నేరేడుచర్ల : కమ్యూనిస్టులు అధ్యయనం చేస్తూ పోరాటంతో సమాజ చైతన్యానికి పాటుపడాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు, స్టడి సర్కిల్ కన్వీనర్ కొదమగుండ్ల నగేష్ అన్నారు. ఆదివారం నేరేడుచర్లలోని అరిబండి భవన్‌లో నేరేడుచర్ల, గరిడేపల్లి, పాలకీడు మండలాల స్థాయి క్యాడర్ స్టడి సర్కిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవత విలువలు తగ్గి, మతమాద్యం పెచ్చురిల్లుతున్న ప్రస్తుత సమయంలో సైద్ధాంతికంగా చైతన్యం కావాలని, అందుకు ఈ స్టడీ సర్కిల్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిలా కార్యదర్శి వర్గ సభ్యులు పారేపల్లి శేఖర్‌రావు, మండల కార్యదర్శి కందగట్ల అనంత ప్రకాశ్, సుంకరి వెంకటేశ్వరరావు, ఎస్‌కె.యాకుబ్, మండల కమిటీ సభ్యులు రాచమల్ల రామస్వామి, వాసా సంపత్ మచ్చ, వెంకటేశ్వర్లు, సుంకరి క్రాంతి కుమార్, నీలా రామూర్తి, మోహన్‌రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నగేష్

Zone Guide

కేసీఆర్ సేవాదళ్ మండల అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు



గరిడేపల్లి : కేసీఆర్ సేవాదళ్ గరిడేపల్లి మండల అధ్యక్షుడిగా పొనుగోడు గ్రామానికి చెందిన బాల్తు వెంకటేశ్వర్లు నియామకమయ్యారు. ఆదివారం సూర్యాపేటలోని కేసీఆర్ సేవాదళ్ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎజాజ్ అహ్మద్ ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాల్తు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ అమీర్, జిల్లా కార్యదర్శి అహ్మద్, నియోజకవర్గ ఇన్‌చార్జి ఎండీ మతిన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రామ్ సైదులు, కొండేటి శ్రీనివాస్, ఇంజమూరి సైదులు తదితరులు పాల్గొన్నారు.

నాగార్జునసాగర్ ముట్టడిని జయప్రదం చేయాలి

హుజూర్‌నగర్ : రైతుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో నేడు నిర్వహిస్తున్న సాగర్ ముట్టడిని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పులిచింతల వెంకటరెడ్డి కోరారు. ఆదివారం పట్టణంలోని అమరవీరుల భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయకట్టుకు సాగు నీరు అందించడంలో, ఇతర రాష్ట్రాల సాగు నీటి అక్రమ వినియో గాన్ని అడ్డుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. సమావేశంలో ఆ పార్టీ పట్టణ కార్యదర్శి శీలం శ్రీను, నాయకులు నాగారపు పాండు, పల్లె వెంకటరెడ్డి, ఎం.నాగేందర్, దుగ్గి బ్రహ్మం, సాంబయ్య, వెంకటనారాయణ, రమేష్, వెంకటేష్, మోహన్‌రెడ్డి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మేళ్లచెరువు : మండలకేంద్రంతో పాటు హేమ్లాతండా గ్రామాలకు నేడు విద్యుత్ సరఫరా నిలవేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ నాగరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఇంటర్వ్యూ



పేరు : శ్రీకాంత్
అంశం : మిషన్ భగీరథ
హోదా : ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ



మఠంపల్లి :

ప్రశ్న : మండలంలో ఎన్ని గ్రామాల్లో గ్రామీణ నీటి సరఫరా విభాగం పనులు జరుగుతున్నాయి ?

జవాబు : మండలంలోని 16 గ్రామ పంచాయతీల పరిధిలో మిషన్ భగీరథ పనులు చేపడుతున్నాం.

ప్రశ్న : మిషన్ భగీరథ పనులకు మండలానికి ఎన్ని నిధులు మంజూర య్యాయి. ?

జవాబు : మండలంలోని అన్ని గ్రామాల పరిధిలో మిషన్ భగీరథ పనులకు రూ. 15కోట్లు మంజూరయ్యాయి.

ప్రశ్న : మిషన్ భగీరథ నిధులతో ఏఏ పనులు చేపడుతున్నారు ?

జవాబు : మండలంలోని 16 గ్రామ పంచాయతీలలో మిషన్ భగీరథ పనుల్లో భాగంగా 34 మంచినీటి ట్యాంకులు మంజూరైనాయి. వాటిలో 15 ట్యాంకులు నిర్మాణం జరుగుతున్నాయి. మిగతావి టెండర్ దశలో ఉన్నాయి.

ప్రశ్న : ఆ నిధులతో ఇంకా ఏఏ పనులు చేస్తున్నారు ?

జవాబు : మండలంలోని మట్టపల్లి వద్ద గల కృష్ణానది నుంచి నియోజకవర్గంలోని అన్ని మండలాలకు మంచినీటి పైపులు, మెయిన్‌లైన్ నిర్మాణం కొనసాగుతున్నాయి. వివిధ గ్రామాల పరిధిలో మైనర్ పైపులైన్ నిర్మాణాలు, ఇంటింటికీ నల్లా కనెక్షన్ల పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.





కోదాడ : పట్టణంలోని భవాని నగర్‌లో ఇళ్ల మధ్య మురుగు నీరు నిలిచి తీవ్ర దుర్వాసన వస్తోంది. ఇక్కడ డ్రైయినేజీని ఏర్పాటు చేసి మురుగు నీరు బయటకు పంపాలి.

ఫొటో పంపినవారు : కె.అరుణకుమారి, భవానినగర్

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9705346214

స్వాధీనం దిశగా..

వ్యవసాయశాఖ గోదాం
- ఏళ్లుగా ఆక్రమణదారుల చేతుల్లో..
- మంత్రి జోక్యంతో అధికారుల్లో చలనం

ఎన్నో ఏళ్లుగా ఆక్రమణదారుల చేతుల్లో ఉన్న కోదాడ వ్యవసాయశాఖ గోదాంను స్వాధీనం చేసుకోవడానికి రంగం సిద్ధమవుతోంది. అధికారులు ఆ దిశగా ప్రయత్నాలు మొదలు పెట్టడంతో ఆక్రమణదారులు ఆందోళన చెందుతున్నారు. కోదాడ నడిబొడ్డున ఉన్న ఈ గోదాంను స్వాధీనం చేసుకోవాలని పలువురు వ్యవసాయశాఖకు విజ్ఞప్తి చేసినా ఇన్నాళ్లు పట్టించుకొనే వారు కరువయ్యారు.

కోదాడ :

వ్యవసాయశాఖకు పట్టణంలోని ఆజాద్‌నగర్‌లో ప్రస్తుత పీఏసీఎస్ భవనం పక్కన దాదాపు 300 గజాల స్థలంలో గోదాము ఉంది. గతంలో ఎరువులు, విత్తనాలను నిల్వ చేసుకోవడానికి దానిని వాడుకొనేవారు. ఆ తరువాత వ్యవసాయశాఖ కార్యాలయాన్ని మార్కెట్ ఆవరణలో ఉన్న రైతుల విశ్రాంతి భవనంలోకి మార్చారు. అక్కడే ఉన్న గోదామును వాడుకుంటున్నారు. దీంతో పాతగోదామును పట్టించుకోకుండా వదిలేశారు. ఇదే అదనుగా కొందరు దానిలో స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారు. దీనిపై వ్యవసాయశాఖకు ఎంత మంది ఫిర్యాదులు చేసినా స్వాధీనం తమ వల్ల కాదని చేతులెత్తేశారు.



ఆక్రమణలో ఉన్న వ్యవసాయశాఖ గోదాం

పీఏసీఎస్ ప్రతిపాదనతో మళ్లీ కదలిక

ఇటీవల కోదాడలో పీఏసీఎస్ వారు సొంత నిధులతో కొత్త భవనాన్ని కట్టుకున్నారు. ఈ భవన ప్రారంభోత్సవానికి మంత్రి జగదీశ్‌రెడ్డి వచ్చారు. ఈ సమయంలో ఎమ్మెల్యేతోపాటు పీఏసీఎస్ చైర్మన్ మాట్లాడుతూ పక్కనే ఉన్న ఈ గోదామును సంఘానికి ఇవ్వాలని.. అక్కడ గోదామును నిర్మిస్తే ఎరువులు, విత్తనాలను రైతులకు అందించడానికి ఉపయోగంగా ఉంటుందని మంత్రికి విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన మంత్రి దాని స్వాధీనానికి తగుచర్యలు తీసుకోవాలని అక్కడే ఉన్న అధికారులను ఆదేశించారు. దీంతో తాజాగా అధికారులు ఆక్రమణలు తొలగించడానికి ప్రయత్నాలు మొదలు పెట్టారు. అదే జరిగితే రైతులకు ఉపయోగకరంగా ఉండడంతోపాటు ఆక్రమణదారుల చెర నుంచి గోదాముకు విముక్తి లభించనుంది.

నూతన గోదాం నిర్మిస్తాం..



ఇటీవల రూ.65 లక్షల సంఘ నిధులతో నూతన భవన నిర్మాణం పూర్తి చేశాం. పక్కనే వ్యవసాయశాఖ గోదాం ఆక్రమణలో ఉంది. దానిని సంఘానికి ఇస్తే నూతన గోదాం నిర్మించుకుంటాం. రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఎరువులు, విత్తనాలను అందులో నిల్వ చేసి రైతులకు అందించవచ్చు.

–తోట జ్యోతి, పీఏసీఎస్ చైర్మన్, కోదాడ

న్యూస్ బాక్స్

సంస్కృతీ సంప్రదాయలు మరవొద్దు



ముగ్గుల పోటీలను ప్రారంభిస్తున్న అనిత

కోదాడ : తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను మరవొద్దని, వాటిని కాపాడుకోవాలన్న బాధ్యత అందరిపై ఉందని కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ వంటిపులి అనిత కోరారు. ఆదివారం పట్టణ పరిధిలోని 24వ వార్డులో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద నిర్వహిస్తున్న ముగ్గుల పోటీలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఈ పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొని ముగ్గులు వేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, కౌన్సిలర్ కోట మధు, దొంగరి సుధాకర్, లక్ష్మణ్, మధు, వైవీసార్, రామారావు, చందా రామనర్సయ్య, బి. రామాచారి, ఆర్.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్ తదితరులు

కోదాడఅర్బన్ : సూర్యాపేటలో తెలంగాణ బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో నేడు నిర్వహించే సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలోకార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొలిచలం శ్రీనివాసరావు కోరారు. ఆదివారం ఖానాపురంలో జరిగిన కార్యక్రమంలో ఆయన సమావేశ పోస్టర్‌ను ఆవిష్కరించారు.కార్యక్రమంలో నాయకులు గుళ్లపల్లి ఉపేందర్, సురగాని శేఖర్, తోకల వెంకటేశ్వర్లు, ఉయ్యాల నాగేశ్వరరావు, తోకల ఉపేందర్, రెడ్డిబోయిన ఉపేందర్, శ్రీరామ్‌గౌడ్ పాల్గొన్నారు.

విమోచన దినాన్ని ప్రభుత్వమే నిర్వహించాలి

నడిగూడెం : సెప్టెంబరు 17 తెలంగాణ విమోచన దినాన్ని ప్రభుత్వమే నిర్వహించాలని బీజేపీ సీనియర్ నాయకుడు నకిరెకంటి జగన్ మోహన్ రావు ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలి

మిగతా జోన్ వార్తలు 12వ పేజీలో



పుట్టగొడుగులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కోదాడ : విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తిని పెంచుకోవాలని, విద్యార్థి దశ నుంచే నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని కోదాడ ఎంపీడీఓ నంద్యాల ప్రేమ్‌కరణ్‌రెడ్డి కోరారు. ఆదివారం పట్టణంలోని శ్రీ హైస్కూల్‌లో సైన్స్ విద్యార్థులు నిర్వహించిన పలు సైన్స్ ప్రాజెక్టులను ఆయన పరిశీలించారు. ఉపాధ్యాయులు కూడ విద్యార్థులలో ఆసక్తులను గమనించి ప్రోత్సహించాలని ఆయన కోరారు. జీవశాస్త్రంలో పుట్టగొడుగుల పెంపకంపై విద్యార్థులు చేసిన ప్రయోగాలను పరిశీలించిన ఆయన వీటిపై గ్రామీణ ప్రాంత నిరుద్యోగులకు తగిన శిక్షణ ఇస్తే వారికి ఉపాధి లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో ఆర్డీ సాంబిరెడ్డి, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

టీఆర్ఎస్వీని బలోపేతం చేయాలి



శశిధర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

కోదాడ : టీఆర్ఎస్ అనుబంధ విద్యార్థి సంఘం టీఆర్ఎస్వీని బలోపేతం చేయడానికి విద్యార్థులు కృషి చేయాలని కోదాడ నియోజకవర్గ టీఆర్ఎస్ ఇన్‌చార్జి కె. శశిధర్‌రెడ్డి కోరారు. ఆదివారం కోదాడలోని ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా నియమితులైన బెతిదె భరత్‌కుమార్‌ను ఆయన అభినందించగా వారు ఇన్‌చార్జిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కె. నాగుల్‌మీరా, అఖిల్‌సాయి, నాగరాజు, కమల్, ఇమామ్, అలీ, వినయ్, సాయి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఏకదంతుడికి పూజలు


మునగాల : పూజల్లో పాల్గొన్న యూత్ సభ్యులు


నడిగూడెం : పూజలు నిర్వహిస్తున్న భక్తులు

- కొనసాగుతున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలు
- ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అన్నదానాలు

నడిగూడెం/ మునగాల :

నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో గణేషుని నవరాత్రి ఉత్సవాలు ఆదివారం మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలను భక్తులు భక్తి, శ్రద్ధలతో నిర్వహించారు. పలు గ్రామాల్లో విగ్రహాల వద్ద ఆట, పాటలతో యువతీ, యువకులు గడిపారు.

మోతెలో నిమజ్జనం

మోతె : మామిళ్లగూడెంలో శ్రీ వెంకటేశ్వర విద్యాలయం ఆధ్వర్యంలో ఆదివారం మట్టి వినాయక విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మట్టి విగ్రహాలను పూజిద్దాం–వాతావరణం కాపాడుదామంటూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాలేరు రిజర్వాయర్‌లో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జలాల్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వేముల రమేష్, ఉపాధ్యాయులు గజ్జి సైదులు, నవిల పుల్లయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.


మోతె : ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ముత్యాలమ్మ గుడికి చేరిన బొడ్రాయి


ముత్యాలమ్మ గుడిలో భద్రపరుస్తున్న బొడ్రాయి

కోదాడ : పట్టణంలో త్వరలో పునః ప్రతిష్ఠించనున్న బొడ్రాయి కోసం 10 రోజులుగా కమిటీ సభ్యులు చేస్తున్న అన్వేషణ ఫలించింది. కోదాడ మండల పరిధిలోని నెమలిపురి పునరావాస కాలనీ సమీపంలో ఉన్న గుట్టల్లో బొడ్రాయి ఆకారంలో 6 అడుగులు 10 అంగుళాలు ఉన్న రాయిని కనుగొన్నారు. (త్రికోణ ఆకారంలో ఉండి కింది భాగం వెడల్పుగా, పైభాగం సన్నగా సహజసిద్ధంగా ఉండే రాయినే బొడ్రాయికి ఉపయోగిస్తారు) దానికి వేద పండితులు పూజలు నిర్వహించి కోదాడలోని ముత్యాలమ్మ గుడికి తరలించారు. అక్కడ కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ వంటిపులి అనిత ప్రత్యేక పూజలు నిర్వహించి దేవాలయంలో భద్రపరిచారు. అనంతరం దేవాలయంలో జరిగిన కమిటీ సమావేశంలో సభ్యులు ఆవుల రామారావు మాట్లాడుతూ వేద పండితులతో చర్చించిన అనంతరం బొడ్రాయి ప్రతిష్ఠ తేదిని ప్రకటిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమానికి ఆర్థికంగా సహకరించాలని కోరారు.

'సీపీఎస్' రద్దు దీక్షలో పాల్గొనాలి

కోదాడ : సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ సెప్టెంబర్ 1న జరిగే పాత పెన్షన్ సాధన దీక్షను విజయవంతం చేయాలని సీపీఎస్ రద్దు సాధన సమితి కోరింది. ఆదివారం ఈ మేరకు వారు దీక్షా పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం పలువురు ఆ సంఘ నాయకులు మాట్లాడుతూ సెప్టెంబర్ 1న ఉద్యోగులు అందరూ సామూహిక సెలవు పెట్టి దీక్షలో పాల్గొనాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కోదాడ ఎంఈఓ గోపతి గోపయ్య, బడుగుల సైదులు, ఏడుకొండలు, అంకులయ్య, లక్ష్మీనారాయణ, ఎం.శ్రీనివాసరావు, బాలరాజు, కరుణాకర్, బుల్లయ్య, ఉపేందర్, కొమ్ము శ్రీను, మాన్‌సింగ్, పి.ఏడుకొండలు పాల్గొన్నారు.

చిలుకూరు : సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రఘునాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం చిలుకూరులో జరిగిన ఆ సంఘం మండల శాఖా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. సీపీఎస్ విధానానికి వ్యతిరేకంగా సెప్టెంబర్ 1న ఉపాధ్యాయులతో నల్లబ్యాడ్జిలతో నిరసన వ్యక్తం చేయనున్నట్లుగా తెలిపారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు శంకర్‌బాబు, డివిజన్ అధ్యక్షుడు రమానాయక్, నాయకులు బాలాజీ నాయక్, సైదా, భావసింగ్, వెంకన్న నాయక్, కనకమ్మ, సూర్య, రాంబాబు, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రఘునాయక్

గ్రామాభివృద్ధికి కృషి చేస్తా

చిలుకూరు : ప్రభుత్వం నుంచి వచ్చే నిధులతో ప్రాధాన్యం ప్రకారం గ్రామాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని సర్పంచ్ సుల్తాన్ వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం చిలుకూరు ఎస్సీ కాలనీ వద్ద కంపచెట్లు తొలగించారు.కార్యక్రమంలో ఎంపీటీసీ పుట్టపాక శ్రీనివాస్ యాదవ్, ఉప సర్పంచ్ నెల్లూరి నాగేశ్వరరావు, వార్డు సభ్యులు, ఎస్సీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

నర్సింహాపురంలో 'స్వచ్ఛభారత్'

మునగాల : ఎవరో వస్తారు ఏదో చేస్తారు అని ఎదురుచూడకుండా తమ పరిసరాలను శుభ్రం చేసేందుకు నడుం బిగించారు మండలంలోని నర్సింహాపురం పదో వార్డు ప్రజలు. వార్డులో కొంత కాలంగా కంపచెట్లు, పెరిగి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ విషయమై పలుమార్లు వార్డు ప్రజలు గ్రామపంచాయితీ దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ పట్టించుకోకపోవడంతో ఆ వార్డు సభ్యుడు వేమూరి సత్యనారాయణ కంపచెట్లను తొలగించేందుకు ముందుకు వచ్చాడు. ఆయనకు గ్రామస్తులు సహకరించడంతో వీధుల్లో ఉన్న పిచ్చిచెట్లు తొలగించి, మురుగు కాల్వలను శుభ్రం చేశారు.ఈ కార్యక్రమంలో చెరువుపల్లి నాగేశ్వరరావు, కేశబోయిన బాలు, వీరబోయిన సాయి, అల్లి చిన్న పాల్గొన్నారు

సోమగాని రామయ్యకు ఘన నివాళి



చిలుకూరు : నారాయణపురానికి చెందిన, మట్టపల్లి దేవస్థానం గౌడ అన్నదాన సత్రం వ్యవస్థాపకుడు సోమగాని రామయ్య వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రామయ్య ఆదర్శప్రాయుడని కొనియాడారు. అనంతరం ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో గౌడ సత్రం అధ్యక్షుడు దొంతగాని రాములుగౌడ్, నాయకులు వెంకటేశ్వర్లు, గురవయ్య, వెంకటరత్నం,వెంకటేశ్వర్లు, సోములు, వెంకయ్య, చంద్రయ్య, ధర్మయ్య, పరుశురాములు, వెంకన్న, అంజయ్య, విష్ణుమూర్తి పాల్గొన్నారు.

నేడు 'హలో బీసీ చలో సూర్యాపేట'

చిలుకూరు : తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నేడు సూర్యాపేటలో జరిగే 'హలో బీసీ చలో సూర్యాపేట' సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరుతూ ఆ సంఘం నాయకులు ఆదివారం ఆ కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గునగంటి సైదులు, సంఘం మండల అధ్యక్షుడు అమరగాని కృష్ణగౌడ్, ఉపాధ్యక్షుడు ఉపేందర్, రాష్ట్ర , జిల్లా నాయకులు కొలిచలం శ్రీనివాస్, గుండ్లపల్లి ఉపేందర్, స్వామికృష్ణ, రేణుగుంట్ల నాగరాజు, కమలాకర్, వెంకటేశ్వర్లు, కోల నరేష్, సతీష్, రమేష్, భరత్, రాంబాబు , విజయ్ తదితరులు పాల్గొన్నారు

కేసీఆర్ సేవా దళం కార్యవర్గం ఎన్నిక

నడిగూడెం : మండల కేంద్రానికి చెందిన గడ్డం మల్లేష్ యాదవ్ కోదాడ నియోజవర్గ కేసీఆర్ సేవా దళం ప్రధానకార్యదర్శిగా, మండల అధ్యక్షుడిగా మేరిగ ధనయ్యను ఎంపిక చేసినట్లు ఆదివారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండి.అమీర్ ఒక ప్రకటనలో తెలిపారు.

Zone Guide

పీఆర్టీయూ కార్యవర్గం ఎన్నిక


వీరబాబు


వీరారెడ్డి

మునగాల : పీఆర్టీయూ మునగాల మండల శాఖ ఎన్నిక ఆదివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక పలువురు రాష్ట్ర, జిల్లా శాఖ నాయకుల సమక్షంలో జరిగింది. మండల కమిటీ గౌరవ అధ్యక్షురాలిగా వి.లక్ష్మి(జీహెచ్ఎం, నర్సింహులగూడెం), అధ్యక్షుడిగా పప్పుల వీరబాబు, ప్రధాన కార్యదర్శిగా పందిరి వీరారెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా జి.జహంగీర్, మహిళా ఉపాధ్యాక్షులుగా వై.జ్యోతి, షేక్ ఫాతిమాబేగం, కార్యదర్శులుగా ఎస్.లక్ష్మీ నారాయణ, టి.నాగేందర్‌రెడ్డి, మహిళా కార్యదర్శిగా బి.మంగమ్మలను ఎన్నుకున్నారు.

బూత్ కమిటీల ఎంపిక

నడిగూడెం : ఏఐసీసీ, పీసీసీ ఆదేశాల మేరకు ఆదివారం మండలంలోని 22 బూత్‌ల్లో కమిటీలు ఏర్పాటు చేసినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దేవబత్తిని వెంకటనర్సయ్య విలేకరులకు తెలిపారు. ఒక్కో బూత్‌కి 15 మంది కమిటీ సభ్యులను ఎంపిక చేసినట్లు చెప్పారు. ఆయన వెంట కోఆప్షన్ సభ్యుడు ఎండి.జలీల్, నాయకులు గుండు శ్రీను, మొక్క భిక్షపతి, గోసుల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


నాగరాజు


సురేష్

చిలుకూరు : సీపీఎస్ మండల శాఖను ఆదివారం ఆ సంఘం నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. అధ్యక్షుడిగా ఆరె నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా ముదిగొండ సురేష్, ఉపాధ్యక్షులుగా ముగ్ధం బాబు, శంకర్ బాబు, శ్రీనివాస్, మహిళా ప్రతినిధిగా మంగమ్మ, దీపలను నియామకమయ్యారు.

ఇంటర్వ్యూ

పేరు : రజితారెడ్డి

అంశం : మండపాలు -భద్రత

హోదా : పట్టణ సీఐ



కోదాడ:

ప్రశ్న : గణేష్ మండపాల వద్ద ఎలాంటి భద్రతా చర్యలు తీసుకున్నారు?

జవాబు : ప్రతి గణేష్ మండపానికి కమిటీని ఏర్పాటు చేశాం. వారి ద్వారా ప్రతిరోజు మండపం వద్ద జరిగే కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నాం. మండపాల్లో కమిటీ సభ్యులే రాత్రి సమయంలో పడుకోవాలి. వారి వివరాలను స్టేషన్‌లో ఇవ్వాలి.

ప్రశ్న : ఇంకా ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

జవాబు : ప్రతి గణేష్ విగ్రహానికి జియో ట్యాగింగ్ చేశాం. ఏ విగ్రహం ఎక్కడ ఉంది, కమిటీ సభ్యులు ఎవరూ అనే విషయాలను వెంటనే తెలుసుకొనేలా చేశాం.

ప్రశ్న : సిబ్బందిని నియమించారా?

జవాబు : మండపాల వద్ద భద్రతకు 25 మంది ప్రత్యేక సిబ్బందిని నియమించాం. వీరు నిత్యం మండపాలను సందర్శిస్తారు. మండపం వద్ద బుక్ పెట్టాం. దానిలో సందర్శకులు రాసే సమస్యలను వెంటనే పరిష్కరిస్తాం.

ప్రశ్న : మైక్ విషయంలో ఏ నిబంధనలు విధించారు ?

జవాబు : అనుమతితో మైక్ పెట్టుకోవచ్చు. ఎట్టి పరిస్థితుల్లో డీజేలు పెట్టవద్దు. విద్యుత్ అనుమతులు కూడ తీసుకోవాలి. నిర్ణీత సమయంలో మండపం వద్ద కార్యక్రమాలను ముగించాలి.



ఫొటో పంపినది : వీరన్న, తిరుమలగిరి

తిరుమలగిరి : తిరుమలగిరి మండల కేంద్రంలోని బొడ్రాయి ఎదుట ఈ నెల 16వ తేదీన జరిగిన ఉట్ల పండగ రోజు బురద మట్టి పోశారు. ఇప్పటి వరకు మట్టి తొలగించకపోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురిసిన రోజు చిత్తడిగా మారుతుంది.

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9010009974

ప్రమాదకరంగా విద్యుత్‌వైర్లు

మద్దిరాల : మండల పరిధిలోని కుక్కడం బస్టాండ్ వద్ద కరెంటు తీగలు చాలా క్రిందికి ఉండడంతో అక్కడ ఉన్న చుట్టు ప్రక్కల జనం భయాందోళనకు గురి అవుతున్నారు. కనీసం ఆ తీగలు మనిషి ఎత్తులో కూడా లేకపోవడంతో అటు వైపు ఎవరైనా వెళ్లాలన్నా వెళ్లలేని పరిస్థితి నెలకొన్నది. గతంలో ఆ వైర్లు రెండు సార్లు తెగి క్రింద పడ్డాయని స్థానికులు అంటున్నారు. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు స్తంభాల మధ్య దూరం ఎక్కువగా ఉండడం వల్ల తీగలు చాలా క్రిందికి వేలాడుతున్నాయి. అంతే కాకుండా సమీపంలో పాఠశాల ఉండడం వల్ల విద్యార్థులు తరచూ అక్కడే తిరుగుతుంటారు. కావున అధికారులు వెంటనే స్పందించి కరెంటు వైర్ల మధ్యలో స్తంభం ఏర్పాటు చేసి విద్యుత్ వైర్లను పైకి లాగాలి.

స్తంభాన్ని ఏర్పాటు చేయాలి



బస్టాండ్ సమీపంలో విద్యుత్ వైర్లు వేలాడుతున్న చోట విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేయాలి. రెండు స్తంభాల మధ్య దూరం ఎక్కువగా ఉండడం వల్ల వైర్లు క్రిందికి వేలాడుతున్నాయి. అధికారులు సమస్య పరిష్కరించాలి.

- గిరిశెట్టి ఉపేందర్, కుక్కడం



చేతికందే ఎత్తులో ఉన్న కరెంటు తీగలు

అధికారులకు తెలిపాం



గతంలోనే ఈ విద్యుత్ వైర్లు రెండు సార్లు తెగాయి. ఆ సమయంలో ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకు వెళ్లడం జరిగింది. అయినా ఇంతవరకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. జనావాసంలో ఉన్న ఈ వైర్లు తెగి ఎవరిమీదనైనా పడే అవకాశం ఉంది. కావున అధికారులు వెంటనే స్పందించాలి.

- పసుపులేటి శ్రీనివాస్, కుక్కడం

న్యూస్ బాక్స్

మందుల సామేలు పరామర్శ



మాట్లాడుతున్న మందుల సామేలు

తిరుమలగిరి : తొండ గ్రామ మాజీ ఉపసర్పంచ్ వేల్పుల నర్సయ్య తల్లి మృతి చెందడంతో మృతుడి కుటుంబ సభ్యులను రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మెన్ మందుల సామేలు ఆదివారం పరామర్శించారు. ఆయన వెంట టీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు దుంపల కృష్ణారెడ్డి, రైతువిభాగం మండల అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, గొలుసుల మల్లయ్య, బంగారి, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నూతనకల్ : మండల పరిధిలోని తాళ్లసింగారం మాజీ సర్పంచ్ చిత్తలూరి సాంబయ్య ఇటీవల మృతి చెందడంతో అతని కుటుంబ సభ్యులను రాష్ట్ర గిడ్డంగుల సంస్థ కార్పొరేషన్ చైర్మన్ మందుల సామేల్ ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. పరామర్శించిన వారిలో టీఆర్ఎస్ జిల్లా నాయకులు తీగల మల్లారెడ్డి, గిలకత్తుల జీడయ్య, పచ్చిపాల వెంకన్న, సత్యనారాయణ, పులుసు లింగమల్లయ్య తదితరులు ఉన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి



క్రీడాలను ప్రారంభిస్తున్న పాశం విజయ

నాగారం : క్రీడాకారలును ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలని తిరుమలగిరి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పాశం విజయయాదవరెడ్డి, స్థానిక ఎస్ఐ శ్రీనివాస్‌లు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని నాగారం బంగ్లా వద్ద వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది రషీద్, సతీష్, ఉత్సవ కమిటీ సభ్యులు సురేష్‌రెడ్డి, శ్రావణ్, మహేందర్, భాను, బబ్లూ, శ్రీను పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎం.లక్ష్మయ్య

తిరుమలగిరి : రాష్ట్ర ప్రభుత్వం ఎస్సారెస్పీ కాల్వల ఆధునీకీకరణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు మురుగండ్ల లక్ష్మయ్య డిమాండ్ చేశారు. రైతు సంఘం మండల సమావేశం ఆదివారం తిరుమలగిరిలో జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి పంట ఋణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సాదాబైనామాలు త్వరితగతిన పూర్తి చేసి రైతులకు పాస్ పుస్తకాలు అందజేయాలని కోరారు. ఎస్సారెస్పీ 69,70 డీబీఎం పనులు ఇప్పటి వరకు ప్రారంభించలేదని, ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేసి పూర్తి చేయాలని కోరారు. సెప్టెంబర్ 12వ తేదీన జిల్లా కేంద్రంలో జరిగే టీమాస్ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు తెడ్డు నర్సయ్య, మాచిరెడ్డి సోమిరెడ్డి, ఉప్పలయ్య, భిక్షమాచారి, బొల్లు మల్లయ్య పాల్గొన్నారు.

చెరువులను పరిశీలించిన సీఐ

తుంగతుర్తి : మండల కేంద్రంలో వినాయక నిమజ్జనాలను చేయడం కోసం ఆదివారం స్థానిక సీఐ శ్రీనివాస్ తుంగతుర్తిలోని పెద్ద చెరువు, పల్లె చెరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక నిమజ్జనాన్ని ప్రజలు శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. ఆయనతో పాటు చలర్లపల్లి సాయిలు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

అక్రమంగా భూముల సాగు

తుంగతుర్తి : గానుగుబండ గ్రామంలో దేవాలయ భూములను కొంతమంది వ్యక్తులు అక్రమంగా సాగు చేసుకుంటున్నారని గ్రామానికి చెందిన రైతులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలోని వేణుగోపాల స్వామి దేవాలయానికి చెందిన 105, 118, 119, 120, 122, 123, 170గల సర్వే నెంబర్‌లలో 11.24 ఎకరాల భూమి ఉందని దానిని గ్రామానికి చెందిన కొందరు రైతులు అక్రమంగా సాగు చేస్తున్నారని ఆరోపించారు. సాగుచేస్తున్న సమయంలో తాము దేవాలయ భూమిని సాగు చేయవద్దని అడ్డగించడంతో సదరు వ్యక్తులు మాపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. గత నెల 7వ తేదిన దేవాలయ భూములను వేలం నిర్వహించాల్సి ఉండగా నేటికీ వేలం నిర్వహించకుండానే భూములను సాగుచేస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో రైతులు బొబ్బలి వెంకన్న, రాయపురపు వెంకన్న, వెలిశాల రాజు, జటంగి మలయ్య, వినోద్, వీరబోయిన లింగయ్య, కట్ల వెంకటరాములు, వెంకన్న పాల్గొన్నారు.

భూసాగుదారుల వివరణ.....

దేవాలయ భూమిని గత 50 ఏళ్లకు పైగా తామే సాగుచేస్తున్నామని గ్రామానికి చెందిన కంచర్ల కుశలవరెడ్డి తెలిపారు. దీనికి సంబంధించి పన్నులు చెల్లిస్తున్నామని, ఈ భూమికి రెండు ఏళ్ల క్రితం ఎండోమెంట్‌వారు వేలం పాట నిర్వహించారని తెలిపారు. దీనిపై తాము హైకోర్టు ద్వారా ఇంజిక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నామన్నారు. తాము భూమి సాగుచేసుకుంటుండగా గ్రామస్తులు అడ్డుకున్నారని తెలిపారు.

మిగతా జోన్ వార్తలు 12వ పేజీలో

12

మన తుంగతుర్తి
సాక్షి సూర్యాపేట
సోమవారం । ఆగస్టు । 28 । 2017

గణనాథుడికి పూజలు

గణేష్ నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో గణనాథులకు పిల్లలు, పెద్దలు, నాయకులు ఘనంగా పూజలు చేశారు. అనంతరం పలుచోట్ల అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

- అర్వపల్లి/నాగారం/తిరుమలగిరి/తుంగతుర్తి/నూతనకల్/మద్దిరాల


నూతనకల్ : పూజలు నిర్వహిస్తున్న మాజీ మంత్రి ఆర్డీఆర్


తుంగతుర్తిలో పూజలు చేస్తున్న భక్తులు


అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని గౌడ్స్ కాలనీలో..


నాగారంలో..


తిరుమలగిరి : పూజలు చేస్తున్న భక్తులు


మద్దిరాల : అన్నదానంలో పాల్గొన్న భక్తులు

న్యూస్ బాక్స్

పరమేశ్వర్ కుటుంబానికి పరామర్శ

అర్వపల్లి : తిమ్మాపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ శ్రీరాముల పరమేశ్వర్ తల్లి అయిన సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు దేవకమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడిపాటి నర్సయ్య ఆమె కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మంచి కార్యకర్తను కోల్పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తుంగతుర్తి/నాగారం : సెప్టెంబర్–5 ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక కోసం మండలంలోని ఉపాధ్యాయులు నేడు సాయంత్రంలోగా దరఖాస్తు చేసుకోవాలని తుంగతుర్తి, నాగారం ఎంఈఓలు బోయిని లింగయ్య, బాలునాయక్‌లు ఆదివారం ప్రకటనల్లో తెలిపారు.

జాగృతి మండల కమిటీ ఎన్నిక

మద్దిరాల : నియోజకవర్గ అధికార ప్రతినిధి గొడ్డలి నర్సయ్య, బెడద రమ ఆధ్వర్యంలో తెలంగాణ జాగృతి నూతన మండల కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. జంబారపు సంతోష్‌ను మండల అధ్యక్షుడిగా, మహిళ కన్వీనర్‌గా షేక్ సాబెరాను, యూత్ కన్వీనర్‌గా అనపర్తి అంజయ్యను, మండల ఉపాధ్యక్షుడిగా చాపల సందీప్‌ను, రైతు విభాగంలో మండల కన్వీనర్‌గా గుండగాని వెంకన్నలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మరోజు శేఖర్, నలమాస శరత్, మడుపు సతీష్ పాల్గొన్నారు.

బాలవికాస ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు



మద్దిరాల : మండల కేంద్రంలో ఆదివారం బాలవికాస, సాంఘిక సేవ సంస్థ ఆధ్వర్యంలో సూర్యాపేటకు చెందిన బాలాజీ హాస్పిటల్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ రాజమనోహర్‌రెడ్డి చేత హెల్త్ క్యాంపును ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా రోగులకు ఉచితంగా మందులు ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిస్టర్స్ స్వప్న, రమణ, లత, మధు పాల్గొన్నారు.

పోస్టాఫీస్ తరలింపు సరికాదు

నాగారం : ఫణిగిరిలో ఉన్న పోస్టాఫీస్‌ను నాగారం మండల కేంద్రానికి తరలించడం సరికాదని బహుజన సామాజ్‌పార్టీ (బీఎస్పీ) జిల్లా ఉపాధ్యక్షుడు పోతరాజు వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఫణిగిరి గ్రామంలో గ్రామపరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహారదీక్షలో వికలాంగుల పాల్గొనగా వారికి మద్దతు తెలిపి మాట్లాడారు.కార్యక్రమంలో గ్రామపరిరక్షణ సమితీ సభ్యులు ఎర్ర రాంబాబు, కె.బాలు, శ్రావణ్, బాలరాజు, యాకూబ్, సోమయ్య, చింటూ, భానుప్రసాద్, శ్రీకాంత్, పవణ్, వెంకటేశ్, కల్యాణ్ పాల్గొన్నారు.

జాగృతిలో పలువురి చేరిక


జాగృతిలో చేరుతున్న నాయకులు

అర్వపల్లి : ఆదివారం జాజిరెడ్డిగూడెంలో 70 మంది తెలంగాణ జాగృతిలో చేరారు. ఈ కార్యక్రమంలో జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మేడి రాజీవ్‌సాగర్, తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు రంగినేని ఉపేందర్ రావు, జిల్లా పీఆర్‌ఓ బొద్రబోయిన మహేష్, యలగందుల మల్లేష్‌నేత, గఫార్‌ఖాన్, నాగునాయక్, కోటమర్తి నవీన్, అనిల్ పాల్గొన్నారు.

70 మంది చేరిక..

జాగృతిలో చేరిన వారిలో మామిడి రాజ్‌కుమార్, మామిడి వెంకటయ్య, గీస భద్రయ్య, చింతల సైదులు, చింతల అంజి, గీస సైదులు, కె. బాలరాజు, మామిడి నాగరాజు, కె. సైదులు, ఎస్. వెంకన్న, నర్సయ్య, రాజు తదితరులు ఉన్నారు.

టీకాలు తప్పనిసరిగా వేయించాలి


అడివెంలలో టీకా వేస్తున్న వైద్యసిబ్బంది

అర్వపల్లి : తట్టు, రుబెల్లా టీకాలు వేయించుకోని పిల్లలుంటే వెంటనే వేయించాలని తిమ్మాపురం ఆరోగ్య ఉపకేంద్రం హెల్త్ అసిస్టెంట్ బి. ప్రసాద్, ఏఎన్‌ఎం కవితలు కోరారు. అడివెంల గ్రామంలో ఎంఆర్ టీకాలు వేయించని పిల్లలకు ఆదివారం టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. 15 ఏళ్ల పిల్లలందరికీ టీకాలు వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశాకార్యకర్తలు శ్రవంతి, పుష్ప పాల్గొన్నారు.

గిన్నిస్ రికార్డు సాధించేలా బతుకమ్మ

తుంగతుర్తి : గిన్నిస్‌రికార్డు సాధించేలా బతుకమ్మ సంబరాలను తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలంగాణ జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మేడే రాజీవ్‌సాగర్ అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణలోని 31జిల్లాల నుంచి 31వేల మహిళలు, జీహెచ్‌ఎంసీ నుంచి 4వేల మంది మహిళలతో సెప్టెంబర్–26న ఎల్‌బీ స్టేడియంలో బతుకమ్మ సంబరాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామం నుంచి ఇద్దరు లేదా ముగ్గురు మహిళలను హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో జరిగే బతుకమ్మ సంబరాలకు తీసుకెళ్తామన్నారు. సంబరాల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జాగృతి జిల్లా కన్వీనర్ రంగినేని ఉపేందర్, మల్లేష్‌నేత, కోదారి శ్రీను, సంపత్, భూతం లింగయ్య, నాగునాయక్, మహేష్, గఫార్‌ఖాన్, సతీష్‌రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

Zone Guide

ఫొటోగ్రాఫర్స్ మండల కమిటీ ఎన్నిక


యాదగిరి


శ్రీనువాస్

తిరుమలగిరి : మండల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్స్ కమిటీ సభ్యులు ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. అధ్యక్షుడిగా వంగూరి యాదగిరి, ప్రదాన కార్యదర్శిగా సురుగురు శ్రీనువాస్, ఉపాధ్యక్షుడిగా ఎండీ.సారాజ్ , కె. నరేష్, సహాయ కార్యదర్శిగా టి. గంగాదర్, కోశాధికారిగా లాలూ, ప్రచార కార్యదర్శిగా రమేస్, గౌరవ సలహాదారులుగా కిష్టు నాయక్, మల్లేష్, శ్రీనువాస్ ఎన్నికయ్యారు.

స్వర్ణకారుల సంఘం కమిటీ ఎన్నిక


నియామకపత్రం అందజేస్తున్న దేవేంద్రాచారి

అర్వపల్లి : స్వర్ణకారుల సంఘం సమావేశాన్ని ఆదివారం స్థానిక విజ్ఞాన్ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చొల్లేటి దేవేంద్రాచారి సమక్షంలో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బోగోజు బ్రహ్మాచారి, ఉపాధ్యక్షుడిగా టి. రామాచారి, ప్రధాన కార్యదర్శిగా డి. సతీష్, సహాయ కార్యదర్శిగా తాడూరి విశ్వనాథం, కోశాధికారిగా డి.అంజయ్యలను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె. సత్యనారాయణచారి, ఎం.సత్యనారాయణ, జిల్లా కోశాధికారి బి. శ్రీనివాస్, ఎన్.వీరాచారి, ఆర్. సతీష్, ఎ. బ్రహ్మాచారి, శ్రవణ్ పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ



పి. రవికుమార్
అంశం : అభివృద్ధి పనులు
పీఆర్‌ఏఈ, తిరుమలగిరి

తిరుమలగిరి :

ప్రశ్న : మండలంలో సీసీ రోడ్ల నిర్మాణం ఎలా సాగుతుంది ?

జవాబు : తిరుమలగిరి మండలంలో ప్రస్తుతం రూ.25 లక్షల సీసీ రోడ్లు మంజూరయ్యాయి. రూ.10 లక్షలతో పనులు ప్రారంభమయ్యాయి. మిగతా రూ.15 లక్షల రోడ్లు త్వరలోనే ప్రారంభిస్తాం.

ప్రశ్న : ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన ఎంత వరకు జరిగింది ?

జవాబు : మండలంలో 330 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఉండగా ఇప్పటి వరకు 261 ఇళ్లను పరిశీలించాం. వీరికి అక్టోబర్, నవంబర్ నెలల్లో బిల్లులు వస్తాయి.

ప్రశ్న : సబ్ ప్లాన్ నిధులకు ఎక్కడ రోడ్లు మంజూరయ్యాయి ?

జవాబు : ట్రైబర్ సబ్ ప్లాన్ కింద రూ.3 కోట్ల నిధులతో రోడ్లు మంజూరయ్యాయి. జలాల్‌పురం నుంచి రాజ్యానాయక్ తండాకు (రూ.1.74 కోట్లు), వెలిశాల బీడబ్ల్యూడీ రోడ్డు నుంచి చింతల కుంట తండాకు (రూ.84 లక్షలు), గుండెపురి రోడ్డు నుంచి కేఆర్‌కే తండాకు (రూ.44 లక్షలు) మంజూరయ్యాయి.

ప్రశ్న : హరితహారంలో ఎన్ని చెట్లు నాటారు ?

జవాబు : పంచాయతీరాజ్ శాఖ ద్వారా ఇప్పటి వరకు 1200 మొక్కలు నాటాం.

ప్రశ్న : మండలంలో నూతనంగా ఎన్ని పంచాయతీ భవనాలు మంజూరయ్యాయి ?

జవాబు : మండలంలో 4 గ్రామాల్లో గ్రామ పంచాయతీ భవనాలు మంజూరయ్యాయి. మాలిపురం, గుండెపురి గ్రామాల్లో నిర్మాణం పనులు సాగుతున్నాయి. అనంతారం, మామిడాలల్లో పనులు ప్రారంభం కావాల్సి ఉంది.